# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 27 ఏప్రిల్ 2026 | సంపుటి: 22 | సంచిక: 209 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Vijayawada Circulated from AP, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## ప్రపంచంలో తీవ్ర ఆహార సంక్షోభం

### ఆకలితో అలమటించే దేశాల టాప్-10 జాబితాలో పాకిస్థాన్



పొరుగు దేశం పాకిస్థాన్ తీవ్ర ఆహార సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రపంచంలో అత్యంత తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంటున్న టాప్-10 దేశాల జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని ఐక్య రాజ్యసమితి మద్దతుతో విడుదలైన ఒక నివేదిక వెల్లడించింది. "2026 గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ఫుడ్ క్రైసిస్" పేరుతో విడుదలైన ఈ నివేదిక ప్రకారం, పాక్‌లో సుమారు 1.1 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆహార కొరతతో బాధపడుతున్నారు.

-న్యూఢిల్లీ (నినాదం)

2



## రష్యాలో ఎరువుల ప్లాంట్‌పై ఉక్రెయిన్ దాడి

వాయువ్య రష్యాలో కీలకమైన ఎరువుల ప్లాంట్ 'ఫోస్ అగ్రో'పై ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసింది. ఏప్రిల్ నెలలో ఈ ప్లాంట్‌పై జరిగిన రెండో దాడి ఇది. రష్యా కీలక ఎగుమతి కేంద్రాలపై ఇటీవల కాలంలో ఉక్రెయిన్ దాడులు తీవ్రమయ్యాయి. ఈ ప్లాంట్‌లోని సల్ఫ్యూరిక్ యాసిడ్ పంప్ చేసే హై ప్రెజర్ పైప్‌లైన్లను ఈ డ్రోన్లు ధ్వంసం చేశాయి. . ఈ విషయాన్ని వోలోగ్డా గవర్నర్ జార్జి ఫలిమొనోవ్ ధ్రువీకరించారు. -న్యూఢిల్లీ (నినాదం)

2

# రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

## ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

- సరఫరా లోపాల వల్లే కొన్ని బంకులు మూతపడ్డాయని వెల్లడి
- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- పెట్రోల్ బంకుల మూసివేతపై నివేదిక కోరిన సీఎం చంద్రబాబు
- ఆయిల్ డిపోలను నిరంతరం తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశం




ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కొన్ని పెట్రోల్ బంకులు 'నో స్టాక్' బోర్డులు పెట్టడం, ప్రజలు క్యూలలో నిలబడటం వంటి పరిణామాలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేవలం సరఫరా లోపాల కారణంగానే కొన్నిచోట్ల ఇబ్బందులు తలెత్తాయని, ఇంధన నిల్వలకు లోటు లేదని ఆయన తెలిపారు.

-అమరావతి, ఏప్రిల్ 26 (నినాదం)

2

## బంకుల మూసివేతపై చంద్రబాబు ఆగ్రహం

### తక్షణ నివేదిక కోరిన ఏపీ సీఎం



రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా బంకుల మూసివేతపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.

-అమరావతి (నినాదం)

2



## ఎండల ఉగ్రరూపం

### వడదెబ్బకు నలుగురి బలి

- రాష్ట్రంలో కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు
- మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- పలు జిల్లాల్లో 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

2

## వైట్ హౌస్ విందులో కాల్పుల కలకలం

### ట్రంప్‌ను సురక్షితంగా తరలించిన సీక్రెట్ సర్వీస్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరైన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ వార్షిక విందులో తీవ్ర కలకలం రేగింది. ఓ దుండగుడు కాల్పులకు తెగబడటంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. అయితే, ఈ ఘటనకు కొద్దిసేపటి ముందే ట్రంప్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఆమె అన్న మాటలకు, జరిగిన ఘటనకు మధ్య ఉన్న సారూప్యత అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

వాషింగ్టన్, ఏప్రిల్ 26 (నినాదం)

2

## ప్రతి ఊళ్లో పార్టీ జెండా ఎగరాలి

### బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

- నేడు తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం
- వేసవి తీవ్రత దృష్ట్యా ప్లీనరీకి బదులు కార్యవర్గ సమావేశం
- ఆహ్వానం ఉన్నవారు మాత్రమే రావాలని నేతలకు కేటీఆర్ సూచన
- నియోజకవర్గాల్లోనే వేడుకలు జరపాలని కార్యకర్తలకు విజ్ఞప్తి



భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జెండాలు ఎగరేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు పార్టీ నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయం తెలిపారు.

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నినాదం)

2



## టీఎంసీతో బెంగాల్‌లో మహిళలకు రక్షణ లేదు: మోదీ

తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నంతవరకు బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్త్రీలను హింసించే గూండాలకు ఆ పార్టీ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అందువల్లే రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

-న్యూఢిల్లీ (నినాదం)

2




## ఏడుగురు ఎంపీలపై అనర్హత వేటు వేయండి

### రాజ్యసభ ఛైర్మన్‌ను కోరిన ఆప్

తమ పార్టీని వీడి ఇటీవలే బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ సభ్యులపై అనర్హత వేటు వేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు పిటిషన్ సమర్పించారు.

-న్యూఢిల్లీ (నినాదం)

2

## విశాఖలో కూలిన రైల్ ఓవర్ బ్రిడ్జ్ సెంట్రింగ్


### 8 మందికి గాయాలు



న్యూస్‌టుడే: రైల్ ఓవర్ బ్రిడ్జ్ సెంట్రింగ్ కూలడంతో 8 మంది కార్మికులు గాయపడిన ఉదంతమిది. విశాఖపట్నం ఆటోనగర్‌లో రైల్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం జరుగుతోంది. అటు కొంతభాగం.. ఇటు కొంతభాగం పూర్తికాగా అనుసంధా నిస్తున్నారు. పిల్లర్‌కు, పిల్లర్‌కు మధ్య ఐరన్ పైపులతో సెంట్రింగ్ అమర్చి దానిపై స్లాబ్ వేస్తున్నారు. స్లాబ్ పనులు 65 శాతం పూర్తయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలప్పుడు అకస్మాత్తుగా సెంట్రింగ్, స్లాబ్ కుప్పకూలాయి. ఆ సమయంలో 8 మంది కూలీలు స్లాబ్‌పై ఉన్నారు. వారంతా కింద పడిపోయారు. స్థానికులు వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కూలీల్లో ఒకరికి తీవ్ర గాయాలు కాగా.. మిగతా వారికి పెద్ద ప్రమాదం లేదనివైద్యులు తెలిపారు.

విశాఖపట్నం, (నినాదం):

## శేషాచలం కొండల్లో భారీగా మంటలు



**తిరుపతి ,(నినాదం):** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి పరిసరాల్లోని శేషాచలం అటవీ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శ్రీవేంకటేశ్వర వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పరిధిలోని జీవకోన సమీపంలో అడవి ఒక్కసారిగా అంటుకోవడంతో సుమారు 2 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం కాలి బూడిదైంది. జీవకోన సమీపంలోని మొండోడికోన నుంచి తిమ్మినాయుడుకోన వరకు మంటలు వేగంగా వ్యాపించాయి. విలువైన వనమూలికలు, భారీగా వృక్షాలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటల ధాటికి వన్యప్రాణులు భయంతో పరుగులు తీశాయి.

సమాచారం అందుకున్న వెంటనే అటవీ శాఖ సిబ్బంది, అగ్నిమాపక దళం, స్థానికులు రంగంలోకి దిగి మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అటవీ ప్రాంతం, కొండ ప్రాంతం కావడంతో ఫైర్ ఇంజన్లు వెళ్లడానికి సరైన దారి లేక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి వేగంగా వీస్తుండటంతో మంటలు పక్కనే ఉన్న గుట్టలకు వ్యాపిస్తున్నా యని, వీటిని పూర్తిగా ఆర్పడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు ధృవీకరించారు.

అయితే, అటవీ సంపదకు మాత్రం భారీ నష్టం వాటిల్లింది. ఎండల తీవ్రత పెరగడం వల్ల ఎండుటాకులు రాపిడికి గురై మంటలు చెలరేగి ఉండవచ్చని లేదా ఎవరైనా ఆకతాయిలు నిప్పు పెట్టారా అనే కోణంలో అటవీ శాఖ విచారణ చేపడుతోంది. ఎర్రచందనం నిల్వలు ఉన్న ప్రాంతం కావడంతో నిఘా పెంచామని, గిడ్డంగులకు ముప్పు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని అధికారులు వెల్లడించారు.

# క్షేత్రస్థాయికి ప్రజావాణి

## త్వరలో మండల స్థాయికి ప్రజావాణి విస్తరణ

## సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 26 (నినాదం):** రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయడంతో ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఎంసీహెచ్ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులను ఆదేశించారు. వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని తరువాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని సూచించారు.

**ప్రజావాణిలో అప్పీల్ వ్యవస్థ:**

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును ...మిగతా 2లో


> రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్ర స్థాయికి విస్తరించాలని సూచించారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుసటి రోజే 2023 డిసెంబర్ 8వ తేదీన ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మహాత్మా జ్యోతిభా పూలే ప్రజా భవన్‌లో ప్రజావాణి విజయవంతంగా అమలవుతోంది. ఆదివారం ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజావాణిపై మాట్లాడారు.




## మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం

### గుట్కా, పాన్ మసాలా, డ్రగ్స్, ఖైనీ వాడకంతో ప్రాణహాని తప్పదు: ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 26 (నినాదం):** మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటూ అణచివేస్తోందని రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. యువత ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తు దిశగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని రాయదుర్గం సత్వ నాలెడ్జ్ పార్క్‌లో గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నోటి క్యాన్సర్ మరాథాన్‌లో పాల్గొన్న ఆయన, 10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, యువత యోగా, వ్యాయామం వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని కోరారు. చెడు అలవాట్ల వల్ల ప్రాణనష్టాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, సమాజంలో అవగాహన పెంపు ...మిగతా 2లో



## చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం

- యాదాద్రి జిల్లా ఆలేరు వద్ద ఘటన
- రైలులోని S5 కోచ్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు
- ప్రాణభయంతో రైలు నుంచి కిందకు దూకేసిన ప్రయాణికులు
- పలువురికి స్వల్ప గాయాలు, తప్పిన ప్రాణనష్టం

2




## మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

అత్యవసరమని తెలిపారు. గుట్కా వంటి హానికర అలవాట్లపై చైతన్య కార్యక్రమాలుమరింత విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయని హెచ్చరించి, వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సైబరాబాద్ సీపీ రమేష్ 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. మరో అతిథిగా పాల్గొన్న బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నోటి క్యాన్సర్ కారణంగా దేశంలో లక్షలాది మంది మరణిస్తున్నారని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె. దిలీప్ కుమార్ మాట్లాడుతూ నోటి క్యాన్సర్‌పై అవగాహన పెంపు కోసం ఈ మరాథాన్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స సాధ్యమవుతుందని, కాబట్టి ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగ దీపిక, డాక్టర్ సౌమ్య, డాక్టర్ వినూత్న, డాక్టర్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థల ఐటీ ప్రొఫెషనల్స్, డాక్టర్లు, ప్రముఖులు, యువతతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రత్యేకంగా పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో గవర్నర్ స్వీయగణన

గవర్నర్‌తో పాటు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా అధికారుల సమక్షంలో 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (స్వీయ గణన) ద్వారా తన జనాభా లెక్కల వివరాలను నమోదు చేసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా వారు ఆదర్శంగా నిలవడమే కాకుండా, రాష్ట్ర ప్రజలకు కీలక పిలుపునిచ్చారు.

**ప్రజలకు గవర్నర్, గవర్నర్ విజ్ఞప్తి..**

పౌరులంతా తమ కుటుంబ వివరాలను సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానంలో నమోదు చేసుకోవాలని గవర్నర్ కోరారు. ఖచ్చితమైన, సమగ్రమైన జనాభా లెక్కల కోసం ప్రతి కుటుంబం భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఏ ఒక్క ఇల్లూ లెక్కల్లోంచి తప్పిపోకూడదని గవర్నర్ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ స్వీయ గణన ప్రక్రియలో తెలంగాణ రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపేలా ప్రజలందరూ ముందుకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. 2027 సెన్సస్ కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఆన్‌లైన్ సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని, దేశ ప్రగతికి తోడ్పడే ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అధికారులు సైతం విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రతి ఊళ్లో పార్టీ జెండా ఎగరాలి



భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జెండాలు ఎగరేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు పార్టీ నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయం తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాల్లో జెండా వందనం చేసి వేడుకలు జరపాలని అన్నారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. వాస్తవానికి ప్లీనరీ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, ఇటీవల జగిత్యాలలో భారీ సభ నిర్వహించడం, ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఈసారికి కార్యవర్గ సమావేశానికే పరిమితం చేస్తున్నట్లు వివరించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులకు మాత్రమే ఆహ్వానాలు పంపినట్లు పార్టీ స్పష్టం చేసింది. ఆహ్వానం ఉన్నవారు మాత్రమే తెలంగాణ భవన్‌కు రావాలని, మిగతా నాయకులు తమ తమ నియోజకవర్గాల్లోనే ఉండి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీలో పిల్లుట్ల రఘు చేరిక సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ప్రజలకు రంగుల సినిమా చూపించి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో కమల్ హాసన్ కంటే గొప్ప నటులు ఉన్నారని, వారి నటనతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. మూడు, నాలుగు ఫీట్ల ఎత్తు ఉన్న వారు కూడా నేడు కేసీఆర్ వంటి మహోన్నత నాయకుడిని దూషిస్తున్నారని, ఇది దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## రష్యాలో ఎరువుల ప్లాంట్‌పై ఉక్రెయిన్ దాడి

ఎటువంటి మంటలు లేదా లీకేజీకి ఈ దాడి కారణం కాలేదని వెల్లడించారు. పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతులు నిర్వహించినట్లు తెలిపారు. దీంతో ప్రమాదకర గ్యాస్‌లు కూడా ఏమీ లీక్ కాలేదని చెప్పారు. 'ఫోస్ అగ్రో' ప్రతినిధి మాత్రం ఈ దాడిపై స్పందించేందుకు నిరాకరించారు. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం తీవ్ర స్థాయిలో ఉండటంతో నైట్రోజన్ ఫర్టిలైజర్స్ ధరలు గణనీయంగా పెరిగాయి. దీంతోపాటు రష్యా, చైనా దేశాలు వీటి ఎగుమతులపై ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి ఫాస్ఫరస్ ఆధారిత ఎరువులను భారత్‌కు ఎగుమతి చేసే కంపెనీల్లో ఇది కూడా ఉంది.

# క్షేత్రస్థాయికి ప్రజావాణి

మొదటి పేజీ తరువాయి

నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించాలన్నారు. పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని, ఆలస్యం జరగకూడదని చెప్పారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని సూచించారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశ పెట్టాలని సూచించారు.

**బాధ్యులుగా అధికారులు:**

ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని సీఎం స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలని చెప్పారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కిందిస్థాయిలోనే కొన్ని పరిష్కరించే వీలుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని సూచించారు.

**ప్రజాభవన్‌లో విజయవంతంగా..**

ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుసటి రోజే 2023 డిసెంబర్ 8వ తేదీన ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి మంగళవారం, శుక్రవారం మహాత్మా జ్యోతిభా పూలే ప్రజా భవన్లో ప్రజావాణి విజయవంతంగా అమలవుతోంది. అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల అధ్వర్యంలో ప్రతి వారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు.

## అణుశక్తిలోనూ భారత్ ముందడుగు



పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో ఈ రియాక్టర్‌ను రూపొందించడం గర్వకారణమని, ఇది వికసిత భారత్ లక్ష్యానికి ఇంధన రంగం నుంచి గొప్ప బలాన్ని ఇస్తుందని చెప్పారు. 2024 మార్చిలో ఈ రియాక్టర్ లోడింగ్ ప్రక్రియను స్వయంగా చూసే అవకాశం తనకు లభించిందని గుర్తుచేసుకున్న మోదీ, అణు రంగ పురోగతి వల్ల ఆరోగ్యం, పరిశ్రమలు, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు.

పర్యావరణ హితమైన విద్యుత్ ఉత్పత్తిలో భారత్ దూసుకుపోతోందని ప్రధాని తెలిపారు. దేశ పవన విద్యుత్ సామర్థ్యం ప్రస్తుతం 56 గిగావాట్లకు చేరిందని, కేవలం గత ఒక్క ఏడాదిలోనే 6 గిగావాట్ల అదనపు సామర్థ్యాన్ని పెంచుకున్నామని వివరించారు. భవిష్యత్తు అవసరాల కోసం సౌర, పవన శక్తిపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

దేశంలో ప్రారంభం కానున్న 2027 జనగణన కార్యక్రమంలో పౌరులంతా ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని కోరారు. ఇది ప్రభుత్వ విధి మాత్రమే కాదని, బాధ్యతాయుతమైన పౌరుల కర్తవ్యమని పేర్కొన్నారు. ఈసారి జనగణన పూర్తిగా డిజిటల్ రూపంలో ఉంటుందని, ఎన్యుమరేటర్లు మొబైల్ యాప్ ద్వారా వివరాలు సేకరిస్తారని తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే నమోదు చేసుకునేందుకు 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' సదుపాయం కల్పించామని, దీనివల్ల సమయం ఆదా అవుతుందని సూచించారు. సేకరించిన సమాచారం అత్యంత రహస్యంగా, భద్రంగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.


ఈశాన్య రాష్ట్రాల కళాకారులకు అండగా నిలిచేందుకు ప్రజలందరూ కనీసం ఒక వెదురు వస్తువునైనా కొనుగోలు చేయాలని లేదా బహుమతులుగా ఇవ్వాలని మోదీ కోరారు. అలాగే.. బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ జున్ను పోటీల్లో రెండు భారతీయ బ్రాండ్‌లు అవార్డులు సాధించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భారతీయ పాడి ఉత్పత్తుల రుచి ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై గుర్తింపు పొందుతోందని ప్రశంసించారు.

త్వరలో రానున్న బుద్ధ పూర్ణిమ సందర్భంగా ముందస్తు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని, ప్రస్తుత అశాంతి కాలంలో బుద్ధుడి శాంతి మంత్రం ఎంతో అవసరమన్నారు. లడఖ్‌కు చెందిన ద్రుబ్‌పోన్ ఓట్జెర్ రిన్‌పోచె అనే వ్యక్తి దక్షిణ అమెరికాలోని చిలీ దేశంలో బౌద్ధ బోధనలను వ్యాప్తి చేస్తూ, అక్కడ స్తూపాలను నిర్మిస్తున్నారని అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో భారతీయ ఆధ్యాత్మికత వెలుగులు విరజిమ్ముతుండటం గర్వకారణమని ప్రధాని పేర్కొన్నారు.

## రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

కొందరు వ్యాపారులు ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరతను సృష్టిస్తూ బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరఫరా వ్యవస్థకు ఆటంకాలు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ డిపోలతో పాటు ప్రైవేట్ కంపెనీల అవుట్‌లెట్లను కూడా జిల్లా అధికారులు నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. పెట్రోల్ బంకుల వద్ద శాంతిభద్రతల సమస్యలు రాకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. ఈ అంశంపై ఎంపీ పురందేశ్వరి కూడా స్పందిస్తూ, కొన్ని ఏజెన్సీలు కృత్రిమ కొరత వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని విమర్శించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని, పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆమె సూచించారు. కాగా, రాష్ట్రంలో పెట్రోల్ బంకుల మూసివేతలపై సాయంత్రంలోగా నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రకటనలతో క్షేత్రస్థాయిలో పరిస్థితి త్వరలోనే చక్కబడుతుందని భావిస్తున్నారు.

## బంకుల మూసివేతపై చంద్రబాబు ఆగ్రహం



ముంబయి నుంచి అమరావతికి బయల్దేరే ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తోపాటు ఉన్నతాధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాల వారీగా ప్రస్తుత పరిస్థితిని అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలో మొత్తం 4,510 పెట్రోల్ బంకులు ఉండగా.. పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా దాదాపు 421 బంకులు మూతపడ్డాయని తెలిపారు. సరఫరా గతం కంటే 10 శాతం పెరిగినా ప్యానిక్ కొనుగోళ్ల కారణంగా అనేక బంకుల్లో రద్దీ కనిపిస్తోందని అధికారులు తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు 6,330 కిలో లీటర్ల పెట్రోల్, 9,048 కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతాయని వివరించారు. కొరత ఉందనే ఆందోళనతో కొనుగోళ్లు భారీగా పెరిగాయని అధికారులు తెలిపారు. శనివారం 10,345 కిలో లీటర్ల పెట్రోల్.. 14,156 కిలో లీటర్ల డీజిల్ అమ్మకం జరిగినట్లు అధికారులు వివరించారు. సాధారణ అమ్మకం కంటే ఒక్కసారిగా 50శాతం అమ్మకాలు పెరగడంతో బంకుల్లో నిల్వలు అయిపోతున్నాయని, అధికారులు వివరించారు. ఆక్వారైతులు డ్రమ్ముల్లో కొనుగోళ్లు జరుపుతారని వారికి పెట్రో ఉత్పత్తులు విక్రయించే విషయంలో సమస్య తలెత్తుతోందన్నారు. పరిష్కారం చూపేందుకు కలెక్టర్లు, ఫిషరీస్ శాఖ అధికారులు వెంటనే కార్యాచరణ అమలు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖలు తీసుకున్న చర్యలు, సమస్య పరిష్కారంపై తనకు నివేదిక ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు.

**నాదెండ్ల వీడియో కాన్ఫరెన్స్**

సీఎం ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కమిషనర్ కన్నబాబు చమురు కంపెనీలు, డీలర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇబ్బంది సమయంలో కంపెనీలు సమర్థంగా పని చేయాలని కోరారు. ఎక్కడా సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. కొరత సృష్టించి వినియోగదారులకు అసౌకర్యం కలిగించడం తగదన్నారు. సరఫరా విషయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, అధిగమించాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందని చెప్పారు. చమురు కంపెనీల డిపోల వద్దకు వెళ్లి జేసీలు తనిఖీలు చేపట్టాలని సూచించారు. సరఫరాలో ఎక్కడా ఆలస్యం లేకుండా పర్యవేక్షించాలన్నారు.

## వైట్ హౌస్ విందులో కాల్పుల కలకలం

వివరాల్లోకి వెళితే, ఈ కార్యక్రమానికి ముందు ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడిన లీవిట్, ట్రంప్ ప్రసంగం చాలా ఉత్సాహంగా ఉండబోతోందని చెప్పారు. "ఈ రాత్రి కొన్ని షాట్లు పేలబోతున్నాయి (షాట్స్ విల్ బి ఫైర్డ్). ఆయన ప్రసంగం చాలా సరదాగా, ఆకర్షణీయంగా ఉంటుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ఇక్కడ 'షాట్స్ ఫైర్డ్' అంటే ట్రంప్ ప్రసంగం వాడిగా, వేడిగా ఉండబోతోందని ఆమె ఉద్దేశం. కానీ, ఆమె వ్యాఖ్యలు చేసిన కొద్దిసేపటికే ఆ కార్యక్రమంలో నిజంగానే కాల్పులు జరిగాయి. ఓ దుండగుడు (లోన్ వుల్ఫ్) సెక్యూరిటీ అధికారిపై కాల్పులు జరపడంతో గందరగోళం నెలకొంది. అయితే, ఆ అధికారి బుల్లెట్‌ప్రూఫ్ వెస్ట్ ధరించి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. వెంటనే అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, ట్రంప్‌ను చుట్టుముట్టి వేదిక వెనుక నుంచి సురక్షితంగా తరలించారు. ఈ ఘటనపై ట్రంప్ స్పందిస్తూ, దాడి చేసిన వ్యక్తి తనను హత్య చేసేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. "మొదట ఆ శబ్దం ఏదో ట్రే కిందపడినట్లుగా భావించాను, కానీ ఫస్ట్ లేడీ మాత్రం అది ప్రమాదకరమైన శబ్దమని వెంటనే గుర్తించారు" అని ట్రంప్ తెలిపారు. లీవిట్ చేసిన వ్యాఖ్యలకు, జరిగిన ఘటనకు మధ్య ఉన్న ఈ అసాధారణ సారూప్యతపై సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ ఘటనలో ఎవరికి తీవ్ర గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దాడిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్ రికవరీ బ్రాంచ్ (05170)
2వ అంతస్తు, ఇండియన్ రెడ్ క్రాస్ బిల్డింగ్స్, నెం. 32, మాంటియెత్ రోడ్, ఎగ్మోర్, చెన్నై - 600008. ఫోన్: 044-28881058/1082, ఇ-మెయిల్: sbi.05170@sbi.co.in

**స్వాధీనతా నోటీసు (రూల్-8 (1)) (స్థిరాస్తుల కొరకు)**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని **రూల్ 3**తో చదవబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకముదారు **తేది: 06.11.2025**తో జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారము **రుణగ్రహీత మెస్సర్స్ ఐబిసి లిమిటెడ్ మరియు హామీదారులు (1) మెస్సర్స్ సుప్రీమ్ స్టార్ షిప్పింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, (2) శ్రీ కె. రాజమోహన్ రెడ్డి, (3) శ్రీ కె. మురళి మోహన్ రెడ్డి తండ్రి కె రాజమోహన్ రెడ్డి, (4) శ్రీమతి కె. మహేశ్వరి, భర్త కె. రాజమోహన్ రెడ్డి, (5) శ్రీమతి జి. శకుంతలమ్మ, భర్త జి. వెంకట రాఘవ రెడ్డి, (6) శ్రీమతి ఎస్. లక్ష్మీ దేవి, భర్త ఎస్. రామ ముని రెడ్డి, (7) శ్రీమతి కె. రాజేశ్వరి, భర్త (లేట్) కె. శివానంద రెడ్డి ((లేట్) కె. శివానంద రెడ్డి యొక్క చట్టపరమైన వారసురాలు కూడా), (8) శ్రీ కె. మదన్ మోహన్ రెడ్డి, తండ్రి (లేట్) కె. శివానంద రెడ్డి ((లేట్) కె శివానంద రెడ్డి యొక్క చట్టపరమైన వారసుడు కూడా), (9) శ్రీ కె. చంద్ర ఓబుల్ రెడ్డి, తండ్రి (లేట్) కె. శివానంద రెడ్డి ((లేట్) కె. శివానంద రెడ్డి యొక్క చట్టపరమైన వారసుడు కూడా), (10) శ్రీ ఎస్. వెంకట శివారెడ్డి, తండ్రి (లేట్) ఎస్. శంకర్ రెడ్డి ((లేట్) ఎస్. శంకర్ రెడ్డి యొక్క చట్టపరమైన వారసుడు కూడా), (11) శ్రీమతి ఎస్. పద్మావతమ్మ భర్త (లేట్) ఎస్. శంకర్ రెడ్డి ((లేట్) ఎస్. శంకర్ రెడ్డి యొక్క చట్టపరమైన వారసురాలు కూడా)** వారిని నోటీసులో తెలిపిన రుణబకాయి మొత్తం **రూ. 13,78,01,277/- (రూపాయలు పదమూడు కోట్ల డెబ్బై ఎనిమిది లక్షల ఒక్క వెయ్యి రెండు వందల డెబ్బై ఏడు మాత్రమే)**లను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరియున్నారు.

**రుణగ్రహీత & హామీదారుల పేరు & చిరునామా: 1. ఐబిసి లిమిటెడ్ - CIN: U24111TN1985PLC011627** ప్రతినిధిగా దాని **మేనేజింగ్ డైరెక్టర్, నమోదిత కార్యాలయము:** వాన్‌గార్డ్ హౌస్ నెం. 148, సెకండ్ లైన్ బెంచ్, చెన్నై-600001. **ఇంకా ఇక్కడ కూడా:** నెం. 27(14), కామరాజ్ నగర్, 1వ మెయిన్ రోడ్డు (వెస్ట్), తిరువాన్మియూర్, చెన్నై-600041. **2. శ్రీ కె. రాజమోహన్ రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ ఐబిసి లిమిటెడ్,** నెం. 27(14), కామరాజ్ నగర్, 1వ మెయిన్ రోడ్ (వెస్ట్), తిరువాన్మియూర్, చెన్నై-600041. **ఇంకా ఇక్కడ కూడా:** 1/397, కోర్టు రోడ్డు, కడప-516001. **3. శ్రీ కె. మురళి మోహన్ రెడ్డి తండ్రి కె. రాజమోహన్ రెడ్డి,** విల్లా నెం. XII, ఎ టైప్, ప్రెస్టేజ్ సిల్వర్ స్ప్రింగ్స్, ఇసిఆర్ లింక్ రోడ్, శోలింగనల్లూర్, చెన్నై 60019. **4. శ్రీమతి కె. మహేశ్వరి, భర్త కె. రాజమోహన్ రెడ్డి,** 1/397, కోర్ట్ రోడ్డు, కడప 516001, **5. శ్రీ ఎస్. వెంకట శివా రెడ్డి (మరణించిన శ్రీ ఎస్. శంకర్ రెడ్డి యొక్క చట్టపరమైన వారసులు) తండ్రి లేట్ శ్రీ ఎస్. శంకర్ రెడ్డి,** ప్లాట్ నెం. 23, ఆదిత్య ఫోర్ట్ వ్యూ విల్లాస్, పుప్పాలగూడ, ప్రతిభా హై స్కూల్ దగ్గర, మణికొండ, పుప్పాలగూడ, కెవి రంగారెడ్డి-500008. **6. శ్రీమతి ఎస్ పద్మావతమ్మ (మరణించిన శ్రీ ఎస్. శంకర్ రెడ్డి యొక్క చట్టపరమైన వారసులు) భర్త లేట్ శ్రీ శంకర్ రెడ్డి,** ఇంటి నెం. 1-397, కోర్టు రోడ్డు, వైఎస్ఆర్ జిల్లా, కడప-516001. **7. శ్రీమతి జి. శకుంతలమ్మ భర్త జి. వెంకట రాఘవ రెడ్డి,** ఫ్లాట్ నెం. 103, విఘ్నేశ్వర హెవెన్స్ పవర్ నగర్, మూసాపేట, బాలానగర్, కెవి. రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500018, తెలంగాణ. **8. శ్రీమతి ఎస్. లక్ష్మి దేవి, భర్త ఎస్ రామ ముని రెడ్డి,** ఫ్లాట్ నెం. 501, వాసవి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, కడప-516003 (ఆంధ్రప్రదేశ్). **9. కె. రాజేశ్వరి భర్త లేట్ శ్రీ కె. శివానంద రెడ్డి,** ఇంటి నెం. 8-3-966/16, కెఓఆర్ అపార్ట్‌మెంట్స్, నాగార్జున నగర్, అమీర్‌పేట, హైదరాబాద్-500073. **10. కె. మదన్ మోహన్ రెడ్డి తండ్రి లేట్ శ్రీ కె. శివానంద రెడ్డి,** 1/397, కోర్టు రోడ్డు, కడప-516001. **11. కె. చంద్ర ఓబుల్ రెడ్డి, తండ్రి శ్రీ కె. శివానంద రెడ్డి,** ఇంటి నెం. 8-3-966/16, కెఓఆర్ అపార్ట్‌మెంట్స్, నాగార్జున నగర్, అమీర్‌పేట, హైదరాబాద్-500073. **12. మెస్సర్స్ సుప్రీమ్ స్టార్ షిప్పింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్,** కార్పొరేట్ కార్యాలయము: నెం. 27(14), కామరాజ్ నగర్, 1వ మెయిన్ రోడ్డు (వెస్ట్), తిరువాన్మియూర్, చెన్నై-600041.

సదరు రుణగ్రహీత/హామీదారులు బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడు సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ క్రింద తెలిపిన ఆస్తిని **తేది: 24 ఏప్రిల్, 2026**న స్వాధీనము చేసుకోవడమైనదని రుణగ్రహీతలకు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకించి రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరపకూడదనియు, ఒక వేళ జరిపినట్లయితే **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి చెందవలసిన బకాయి మొత్తము **24.04.2026** నాటికి **రూ. 14,97,59,761/- (రూపాయలు పద్నాలుగు కోట్ల తొంభై ఏడు లక్షల యాభై తొమ్మిది వేల ఏడు వందల అరవై ఒక్కటి మాత్రమే)** మరియు **25.04.2026** నుండి తదుపరి వడ్డీతో పాటు దానిపై అయ్యే ఖర్చులు మొ॥గు॥ అదనము.

**సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల సమయ లభ్యత కొరకు చట్టములోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.**

**స్థిరాస్తి యొక్క వివరణ**

**ఐటం నెం. 1 - శ్రీ ఎస్. శంకర్ రెడ్డి (మరణించినారు) మరియు శ్రీ కె. శివానంద రెడ్డి (మరణించినారు) పేర్ల మీద ఉన్న ఆస్తి. (ఎ)** కడప రిజిస్ట్రేషన్ జిల్లా, కడప మున్సిపల్ కార్పొరేషన్ వద్ద వైఎస్ఆర్ జిల్లా, కడప మం॥, నాగరాజుపల్లి గ్రా॥, కోర్టు రోడ్డు, సర్వే నెం. 233-1ఎ1లో ఇమిడి ఉన్న, కాంపౌండ్ గోడతో ఆవరించబడి, ఎ. 0.55.56 సెంట్లు దానికి సమానమైన 0.224 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన భూభాగంలో 1/4వ వాటా మరియు పాత డోర్ నెం. 1/595, కొత్త నెం. 1/397 కలిగిన ఇల్లు యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: సి.ఎస్. మిషన్ కాంపౌండ్ గోడ, 101, దక్షిణం: జిల్లా కోర్టుకు వెళ్లే పక్కీరుపల్లి రోడ్డు, తూర్పు: శ్రీ నుసి జుస్సఫ్ యొక్క ఇంటి నెం. 1/594, 256', పడమర: శ్రీ హబీబుల్లా సాబ్ యొక్క ఇంటి నెం. 1/596, 256'. **(బి)** కడప రిజిస్ట్రేషన్ జిల్లా, కడప మున్సిపల్ కార్పొరేషన్ వద్ద వైఎస్ఆర్ జిల్లా, కడప మం॥, నాగరాజుపల్లి గ్రా॥, కోర్టు రోడ్డు, సర్వే నెం. 233-1ఎ1లో ఇమిడి ఉన్న, కాంపౌండ్ గోడతో ఆవరించబడి, ఎ. 0.55.56 సెంట్లు దానికి సమానమైన 0.224 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన భూభాగంలో 1/4వ వాటా మరియు పాత డోర్ నెం. 1/595, కొత్త నెం. 1/397 కలిగిన ఇల్లు యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: సి.ఎస్. మిషన్ కాంపౌండ్ గోడ, 101, దక్షిణం: జిల్లా కోర్టుకు వెళ్లే పక్కీరుపల్లి రోడ్డు, తూర్పు: శ్రీ నుసి జుస్సఫ్ యొక్క ఇంటి నెం. 1/594, 256', పడమర: శ్రీ హబీబుల్లా సాబ్ యొక్క ఇంటి నెం. 1/596, 256'. **(సి)** కడప రిజిస్ట్రేషన్ జిల్లా, కడప మున్సిపల్ కార్పొరేషన్ వద్ద వైఎస్ఆర్ జిల్లా, కడప మం॥, నాగరాజుపల్లి గ్రా॥, కోర్టు రోడ్డు, సర్వే నెం. 233-1ఎ1లో ఇమిడి ఉన్న, కాంపౌండ్ గోడతో ఆవరించబడి, ఎ. 0.55.56 సెంట్లు దానికి సమానమైన 0.224 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన భూభాగంలో 1/4వ వాటా మరియు పాత డోర్ నెం. 1/595, కొత్త నెం. 1/397 కలిగిన ఇల్లు యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: సి.ఎస్. మిషన్ కాంపౌండ్ గోడ, 101, దక్షిణం: జిల్లా కోర్టుకు వెళ్లే పక్కీరుపల్లి రోడ్డు, తూర్పు: శ్రీ నుసి జుస్సఫ్ యొక్క ఇంటి నెం. 1/594, 256', పడమర: శ్రీ హబీబుల్లా సాబ్ యొక్క ఇంటి నెం. 1/596, 256'. **(డి)** కడప రిజిస్ట్రేషన్ జిల్లా, కడప మున్సిపల్ కార్పొరేషన్ వద్ద వైఎస్ఆర్ జిల్లా, కడప మం॥, నాగరాజుపల్లి గ్రా॥, కోర్టు రోడ్డు, సర్వే నెం. 233-1ఎ1లో ఇమిడి ఉన్న, కాంపౌండ్ గోడతో ఆవరించబడి, ఎ. 0.55.56 సెంట్లు దానికి సమానమైన 0.224 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన భూభాగంలో 1/4వ వాటా మరియు పాత డోర్ నెం. 1/595, కొత్త నెం. 1/397 కలిగిన ఇల్లు యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: సి.ఎస్. మిషన్ కాంపౌండ్ గోడ, 101, దక్షిణం: జిల్లా కోర్టుకు వెళ్లే పక్కీరుపల్లి రోడ్డు, తూర్పు: శ్రీ నుసి జుస్సఫ్ యొక్క ఇంటి నెం. 1/594, 256', పడమర: శ్రీ హబీబుల్లా సాబ్ యొక్క ఇంటి నెం. 1/596, 256'.

**ఐటం-2 - శ్రీ కె. శివానంద రెడ్డి (మరణించినారు) పేరున ఉన్న ఆస్తి:** కడప జిల్లా, వేంపల్లి సబ్ ఇల్లా, సర్కార్ పుంజి సర్వే నెం. 494/1 నందు గల వేంపల్లి గ్రామ పొలాలు మరియు దాని పంచాయతీ బోర్డు పరిధిలో, 13వ వార్డు, స్పిన్నింగ్ మిల్లు, పాత ఐటిఐ, పులివెందుల రోడ్డు వద్ద ఉన్న వరండాతో ఆయిల్ మిల్లు గోదాము గదులు మరియు మొదలైనవి (ప్రస్తుతం ఇవి కూల్చివేయబడి మరియు నూతనంగా నిర్మించబడిన షాపింగ్ కాంప్లెక్స్‌లు) (గ్రౌండ్ ఫ్లోర్-15,000 చ॥అ॥లు మరియు మొదటి అంతస్తు: 15,000 చ॥అ॥లు) మొత్తంగా 2 ఎకరాల 13 సెంట్లు లేదా 10,309.2 చ॥గ॥ల విస్తీర్ణం గల భవనము మరియు భూమి యావదాస్తి. తూర్పు: మొహమ్మదీయుల శ్మశానవాటిక, పడమర: మద్దాల ఓబులం శెట్టి, పుల్లయ్య శెట్టి, తొండమునాటి సదాశివాచారి, ఆకేటి వెంకటపతి మరియు ఇతరుల యొక్క భూమి, ఉత్తరం: పబ్లిక్ రోడ్డు మరియు మద్దాల ఓబుళం శెట్టి యొక్క భూమి, పుల్లయ్య శెట్టి, తొండమునాటి సదాశివాచారి,పందిల్లపల్లె నీలం శేషయ్య మరియు ఇతరుల భూమి, దక్షిణం: ఆర్ నారాయణ రెడ్డి & సన్స్ యొక్క మిల్ మరియు భూమి.

తేది: 24.04.2026 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం: చెన్నై — స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

## చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నినాదం)

చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్తున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఆలేరు రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలులోని S5 కోచ్ నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు, మంటలు రావడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. రైలు ఆలేరు స్టేషన్ పరిధిలోకి రాగానే S5 బోగీలో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన ప్రయాణికులు చైన్ లాగి రైలును ఆపారు. ప్రాణభయంతో కొందరు ప్రయాణికులు రైలు నెమ్మదిస్తుండగానే కిందకు దూకేశారు. ఈ క్రమంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, స్థానిక అగ్నిమాపక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా రైల్వే సిబ్బంది వెంటనే S5 కోచ్‌ను మిగతా రైలు నుంచి వేరు చేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

## టీఎంసీతో బెంగాల్‌లో మహిళలకు రక్షణ లేదు

ఈసారి ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే మహా జంగిల్ రాజ్ నుంచి రక్షణ కల్పిస్తామన్నారు. మహిళల రక్షణ గురించి తాము ఆలోచిస్తాం కాబట్టే ఆర్జీకర్ మృతురాలి తల్లికి తమ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల టికెట్ ఇచ్చామన్నారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలపై దారుణాలకు పాల్పడిన నిందితులను న్యాయస్థానం ముందు నిలబెడతామన్నారు. బంగావ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తరచుగా బాలికలు అదృశ్యమవుతున్న కేసులు నమోదు అవుతున్నాయని మోదీ పేర్కొన్నారు. అయినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిద్రపోతోందని మండిపడ్డారు. మహిళలతో పాటు రైతులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్రంలో భాజపా కృషి చేస్తోందన్నారు. అందుకే గత 11ఏళ్లలో జనపనార కనీస మద్దతు ధరల(MSP)ను రెట్టింపు చేసిందన్నారు. గోధుమలు, బియ్యం కోసం 100 శాతం జనపనార ప్యాకేజింగ్‌ను తప్పనిసరి చేశామని వెల్లడించారు. హుగ్లీ నది పరిసరాల్లో ఒకప్పుడు మిల్లులు, ఫ్యాక్టరీలు అధికంగా ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాటన్నిటినీ మూసివేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే వాటిని తిరిగి తెరిపిస్తామన్నారు. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. బెంగాల్ అభివృద్ధి చెందాలంటే తాము అధికారం చేపట్టాల్సిందేనన్నారు

# ఆ ఏడుగురు ఎంపీలపై అనర్హత వేటు వేయండి

తమ పార్టీని వీడి ఇటీవలే బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ సభ్యులపై అనర్హత వేటు వేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు పిటిషన్ సమర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ఆ ఏడుగురు ఎంపీల చర్య పార్టీ ఫిరాయింపు నిరోధక చట్ట నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. అందుకే వారి సభ్యత్వాన్ని పార్టీ ఫిరాయింపు చట్టం కింద రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. గత శుక్రవారం ఆప్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ తన సిద్ధాంతాలు, విలువలు, నైతికత నుంచి పక్కకు తప్పిందని ఆరోపిస్తూ రాఘవ్ చద్దా, అశోక్ మిత్తల్, సందీప్ పాఠక్, హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్త, విక్రమ్ సాహ్ని, స్వాతి మలివాల్ పార్టీని వీడారు. అంతేకాదు ఆ వెంటనే బీజేపీలో చేరారు. బీజేపీలో తాము చేరడాన్ని సమర్థించుకుంటూ రాఘవ్ చద్దా కీలక వ్యాఖ్యలు చేశారు. "రాజ్యాంగం ప్రకారం, ఒక పార్టీలోని మొత్తం ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది సభ్యులు వేరే పార్టీలో చేరితే, అది విలీనం కిందకు వస్తుంది. రాజ్యసభలో ఆప్ పార్టీకి మొత్తం 10 మంది ఎంపీలు ఉన్నారు. వారిలో ఏకంగా ఏడుగురు బీజేపీలో చేరారు. కనుక ఇది విలీనం కిందకు వస్తుంది" అని అన్నారు.

**పంజాబ్ ప్రజలను చద్దా వంచించారు!**

అయితే చద్దా సహా ఆరుగురు ఎంపీలు పార్టీ ఫిరాయించడంపై ఆప్ నేత సంజయ్ సింగ్ మండిపడ్డారు. ఈ ఫిరాయింపు ప్రజల తీర్పును, ముఖ్యంగా పంజాబ్ ప్రజలను వంచించడమేనని ఆరోపించారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. ఎందుకంటే ఆప్‌ను వీడిన ఏడుగురు ఎంపీలలో ఆరుగురు పంజాబ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నవారే కావడం గమనార్హం.

కాగా, ఈ అంశంపై తాము సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్‌తో సహా పలువురు రాజ్యాంగ నిపుణులను సంప్రదించామని సంజయ్ సింగ్ అన్నారు. పార్టీ ఫిరాయించిన సదరు ఎంపీలు చట్టం ప్రకారం అనర్హతకు గురవుతారని వాళ్లు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. "ఈ సభ్యులు ఆప్ ద్వారా ఎన్నికై, ఆపై పార్టీని వీడి మరో పార్టీలో చేరారు. ఇది పంజాబ్ ప్రజలకు, భారత రాజ్యాంగానికి చేస్తున్న ద్రోహం" అని సంజయ్ సింగ్ విమర్శించారు.

**ఎంపీలకు నిరసన సెగ**

మరోవైపు పార్టీ వీడిన ఎంపీలకు నిరసన సెగలు తగులుతున్నాయి. జలంధర్‌లోని హర్భజన్ సింగ్ నివాసం వెలుపల ఆప్ కార్యకర్తలు నిరసన చేపట్టారు. రాజ్యసభలో ఆప్ ఎంపీగా కూడా వ్యవహరించిన ఈ మాజీ క్రికెటర్, ఇటీవల బీజేపీలో చేరారు.

**బీజేపీలోకి ఆప్ ఎమ్మెల్యేలు!**

మరోవైపు పంజాబ్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా బీజేపీలో చేరే అవకాశం ఉందన్న ప్రచారాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ తోసిపుచ్చింది. అందులో ఏ మాత్రం వాస్తవం లేదని ఆ పార్టీ సీనియర్ నేత సంజయ్‌సింగ్ అన్నారు. బీజేపీతోపాటు ఆ పార్టీలో చేరిన ఏడుగురు ఎంపీలు ఇలాంటి తప్పుడు ప్రచారం చేసే అవకాశం ఉందన్నారు. ఇది గందరగోళం సృష్టించటం తప్ప మరొకటి కాదని సంజయ్‌సింగ్ చెప్పారు.

"వదంతులు, అసత్య ప్రచారాలు బీజేపీ, రాఘవ్ చద్దా, ఇతరుల ద్వారా జరిగే అవకాశం ఉంది. మొత్తం పంజాప్‌లో వారిపై వ్యతిరేకత ఉంది. వారికి వ్యతిరేకంగా ప్రజలు రోడ్లపైకి వచ్చి నినాదాలు చేస్తున్నారు. పార్టీకి, పంజాబ్‌కు ద్రోహం చేశారని ప్రజలు భావిస్తున్నారు. మరో విషయం ఏమంటే వారి సభ్యత్వం రద్దుకానుంది. అలాంటి వారి వెంట ఏ ఎమ్మెల్యే వెళ్తారు."
– సంజయ్‌సింగ్, ఆప్ సీనియర్ నేత

**ఆప్ నాయకత్వం ఆత్మ పరిశీలన చేసుకోవాలి!**

పలువురు ఆప్ నేతలు పార్టీ వీడడంపై సామాజిక కార్యకర్త అన్నా హజారే ఇంతకు ముందు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ నిర్ణయాలు తీసుకునే హక్కు ప్రతి వ్యక్తికీ ఉంటుందన్నారు. అయితే నేతలు పార్టీని ఎందుకు వీడుతున్నారో పార్టీ నాయకత్వాలు తప్పక ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఆప్ సరైన మార్గంలో నడిచి ఉంటే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలు పార్టీని వీడి ఉండేవారు కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆప్ ప్రస్తుత దుస్థితికి పార్టీ అధిష్ఠానానిదే పూర్తి బాధ్యత అని హజారే తేల్చిచెప్పారు.



## హైదరాబాద్ కలెక్టర్‌గా డాక్టర్ ప్రియాంక ఆల

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నినాదం)

హైదరాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా డాక్టర్ ప్రియాంక ఆల ఆదివారం బాధ్యతలు చేపట్టారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా కొనసాగుతున్న ఆమెను జిల్లా కొత్త కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఇక్కడ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న హరిచందన దాసరిని బదిలీ చేసి ఆమె స్థానంలో ఏర్పడిన ఖాళీలో ప్రియాంక ఆలకు పోస్టింగ్ ఇచ్చారు. 2016 ఐఏఎస్ బ్యాచ్ , తెలంగాణ ఐఏఎస్ క్యాడర్ కు చెందిన ఆమె గతంలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా , ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా, వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా కూడా పని చేశారు. మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నుండి ఆమె ఎంబీబీఎస్ పట్టా పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. అనంతరం ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మొక్కను బహుకరించి కృతజ్ఞతలు తెలిపారు.



# దక్షిణాది పన్నులు.. ఉత్తరాది సీట్లు!

## సమాఖ్య వ్యవస్థ పునాదులను కదిలిస్తున్న డెలిమిటేషన్ దెబ్బ!

**భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో 'ఒక వ్యక్తి - ఒక ఓటు - ఒకే విలువ' అనేది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. అయితే, త్వరలో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన ఈ సూత్రాన్ని దక్షిణాది రాష్ట్రాల పాలిట శాపంగా మార్చబోతోందా అనే చర్చ ఇప్పుడు దేశవ్యాప్తంగా సాగుతోంది. జనాభాను నియంత్రించి, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రాలను రాజకీయంగా నిర్వీర్యం చేసేలా ఈ ప్రక్రియ ఉండబోతోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా స్తంభింపజేసిన లోక్‌సభ స్థానాల గడువు ముగియనుండటంతో, రాబోయే మార్పులు సమాఖ్య వ్యవస్థ పునాదులనే కదిలించేలా కనిపిస్తున్నాయి.**

ఎడిటోరియల్

నియోజకవర్గాల పునర్విభజన అనే అంశం భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక కీలకమైన మలుపుగా మారింది. రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ సూత్రం నేడు దేశవ్యాప్తంగా నెలకొన్న జనాభా మార్పుల వల్ల సవాళ్లను ఎదుర్కొంటోంది. గడిచిన ఐదు దశాబ్దాలలో రాష్ట్రాల మధ్య సామాజిక, ఆర్థిక మరియు జనాభా పరమైన వ్యత్యాసాలు భారీగా పెరిగాయి. దీనివల్ల ఓటరు ఎక్కడ నివసిస్తున్నారనే దానిపై వారి రాజకీయ ప్రాతినిధ్యం ఆధారపడే విచిత్ర పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఉత్తరాదిలోని ఒక రాష్ట్ర ఓటరు కంటే దక్షిణాదిలోని ఓటరుకు పార్లమెంటులో రెట్టింపు ప్రాతినిధ్యం లభిస్తుండటం సమానత్వపు హక్కుకు విరుద్ధంగా కనిపిస్తోంది.

ఈ అసమానతలకు ప్రధాన కారణం రాష్ట్రాలు సాధించిన అభివృద్ధిలోనే దాగి ఉంది. దక్షిణాది రాష్ట్రాలు విద్య, వైద్యం మరియు మహిళా సాధికారతపై ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల అక్కడ సంతానోత్పత్తి రేటు తగ్గి జనాభా స్థిరీకరణ సాధ్యమైంది. అయితే, ఇదే సమయంలో ఉత్తరాదిలోని అనేక రాష్ట్రాలు సామాజిక అభివృద్ధిలో వెనుకబడటం వల్ల అక్కడ జనాభా పెరుగుదల తీవ్రంగా కొనసాగింది. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్విభజిస్తే, జనాభాను అదుపు చేసి దేశాభివృద్ధికి సహకరించిన రాష్ట్రాలు రాజకీయంగా తమ బలాన్ని కోల్పోతాయి. అంటే బాధ్యతాయుతంగా వ్యవహరించినందుకు ఆయా రాష్ట్రాలకు శిక్ష విధించినట్లు అవుతుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇది కేవలం ప్రాంతాల మధ్య వివాదం మాత్రమే కాదు, దేశ సమాఖ్య స్ఫూర్తికే ముప్పుగా పరిణమించే అవకాశం ఉంది.

మరోవైపు, ఈ జాప్యం వల్ల సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా అన్యాయం జరుగుతోంది. షెడ్యూల్డ్ కులాలు, తెగలు మరియు మైనారిటీ వర్గాలు ఎక్కువగా జనాభా సాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. నియోజకవర్గాల పరిధి అసాధారణంగా పెరగడం వల్ల ఈ వర్గాల సమస్యలు జాతీయ స్థాయిలో బలంగా వినిపించడం లేదు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ఫలాలు ప్రస్తుత జనాభా నిష్పత్తికి అనుగుణంగా అందకపోవడం వల్ల వారి సామాజిక మరియు రాజకీయ సాధికారత కుంటుపడుతోంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో యువత వాటా ఎక్కువగా ఉన్నప్పటికీ, వారికి పార్లమెంటులో దక్కాల్సిన ప్రాతినిధ్యం లభించకపోవడం వారి రాజకీయ గొంతుకను బలహీనపరుస్తోంది.

భారతదేశ ఆర్థిక ఫెడరలిజం కూడా ఈ చర్చతో ముడిపడి ఉంది. దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆదాయానికి అత్యధిక వాటాను పన్నుల రూపంలో అందిస్తుండగా, ఆ నిధులు కేంద్రం ద్వారా వెనుకబడిన రాష్ట్రాల అభివృద్ధికి మళ్లించబడుతున్నాయి. ఇప్పటివరకు రాజకీయ సమతుల్యత ఉండటం వల్ల ఈ ప్రక్రియ సాఫీగా సాగింది. కానీ భవిష్యత్తులో రాజకీయ అధికారం కూడా జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల వైపు మళ్లినప్పుడు, దక్షిణాది రాష్ట్రాలు తమ ఆర్థిక వనరులపై పట్టు కోల్పోయే ప్రమాదం ఉందని భావిస్తున్నాయి. తమ పన్నులు ఎక్కడ ఖర్చు చేయాలనే విషయంలో నిర్ణయాధికారం కోల్పోవడం రాష్ట్రాల మధ్య విభేదాలను మరింత పెంచుతుంది.

ఈ సంక్లిష్ట సమస్యను పరిష్కరించడానికి కేవలం సీట్ల పెంపు సరిపోదు, వ్యవస్థాగతమైన మార్పులు అవసరం. రాజ్యసభను మరింత శక్తివంతం చేయడం ద్వారా రాష్ట్రాల హక్కులను కాపాడవచ్చు. అమెరికా సెనెట్ తరహాలో ప్రతి రాష్ట్రానికి సమాన ప్రాతినిధ్యం కల్పించడం లేదా ఆర్థిక అంశాల్లో రాజ్యసభకు మరింత అధికారాలు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలించాలి. అలాగే వలస కార్మికుల సంక్షేమం కోసం దేశవ్యాప్త పోర్టబిలిటీ సౌకర్యం కల్పించడం ద్వారా పేద రాష్ట్రాల ప్రజలకు రక్షణ కల్పించవచ్చు.

ముగింపులో చెప్పాలంటే, 2026 తర్వాత జరగబోయే పునర్విభజన ప్రక్రియ కేవలం అంకెల గారడీగా కాకుండా, సమాఖ్య స్ఫూర్తిని కాపాడేలా ఉండాలి. రాజకీయ బలం మరియు ఆర్థిక వనరుల మధ్య సమతుల్యతను సాధించినప్పుడే భారత ప్రజాస్వామ్యం నిజమైన అర్థంలో సుస్థిరంగా ఉంటుంది. అభివృద్ధి చెందిన రాష్ట్రాల ప్రయోజనాలను, వెనుకబడిన రాష్ట్రాల ఓటర్ల హక్కులను సమతుల్యం చేయడమే నేటి తక్షణ కర్తవ్యం. ఏ ఒక్క ప్రాంతం కూడా రాజకీయంగా అణచివేతకు గురవుతున్నామనే భావన కలగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. అప్పుడే దేశ అఖండత, సార్వభౌమత్వం పటిష్టంగా ఉంటాయి. నేటి నాయకత్వం ప్రదర్శించే విజ్ఞత పైనే రేపటి భారతదేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి అంటే కేవలం సంఖ్యల పెరుగుదల కాదు, అది అన్ని ప్రాంతాల సమాన భాగస్వామ్యమని గుర్తించినప్పుడే దేశం బలోపేతమవుతుంది.

వెంక గారి భూమయ్య
సీనియర్
జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863



# తాత-బామ్మ కథలతో పిల్లల్లో జీవన విలువల పెరుగుదల

## (27 ఏప్రిల్ "ప్రపంచ కథలు చెప్పే దినోత్సవం" సందర్భంగా)

కథలు చెప్పడం అనాదిగా వస్తున్న సదాచారం. చిన్నతనంలో పిల్లలు అన్నం తినడానికి మారాం చేస్తే "అనగనగా ఒక రాజు" అంటూ నీతి కథలు చెప్పేవాళ్లం. తాత నాన్నమ్మ లేదా అమ్మమ్మలు కథలు చెబితే జోలపాట వలె వింటూ నిద్రలోకి జారుకునే వారు చంటి పిల్లలు. అమ్మమ్మ కథలు పిల్లల జీవితాలను మార్చుతాయని సామెత కూడా ఉన్నది. నేటి డిజిటల్ యుగంలో కథలు చెప్పే ఓపిక పెద్దలకు, కథలు వినే శ్రద్ధ పిల్లల్లో క్రమంగా తగ్గుతోంది. అన్ని వయస్సుల వారికి కథలు వినడం చాలా ఇష్టంగా ఉంటుంది. ముఖ్యంగా పిల్లలు నీతి కథలు, వాటి చందమామ కథలు, అలనాటి బాలమిత్ర కథలు వినడానికి ఆసక్తి చూపుతారు. నాటి ఉమ్మడి కుటుంబాల్లో తాతలు, అమ్మమ్మలు, నాన్నమ్మలు ఆ కుటుంబంలోని పిల్లలు, యువతకు రామాయణ మహాభారత కథలను ఆసక్తికరంగా వివరించే వారు. ఆ కథలను జీర్ణించుకున్న పిల్లలు తమ మనో విస్తృతిని పెంచుకుంటూ సన్మార్గంలో నీతి నియమాల చట్రంలో గౌరవంగా జీవించే వారని మనకు తెలుసు. తరతరాలుగా కథలు ఒకరి నుంచి మరొకరికి చెప్పబడుతూనే ఉన్నాయి, విలువల బోధనలు జరుగుతూనే ఉన్నాయి. రాబోయే తరానికి జీవన విలువలను పరిచయం చేయడానికి కథలు చెప్పడం ఎంత ముఖ్యమో తెలపడానికి ప్రతి ఏట ఏప్రిల్ 27న "జాతీయ కథలు చెప్పే దినోత్సవం" లేదా "వరల్డ్ టెల్ ఏ స్టోరీ" పాటించడం ఆనవాయితీగా మారింది.

**కథలు వినడం, చెప్పడం వల్ల పలు ప్రయోజనాలు:**

కథలు అనేక రకాలుగా ఉంటాయి. మనం ఒక పుస్తకం చదివి లేదా మన అనుభవాలతో తెలుసుకొని మరో తరానికి చెప్పడం పెద్దల బాధ్యత అని మరువరాదు. చిన్నతనంలో విన్న కథలు చెరగని ముద్రలు వేస్తూ జీవితాంతం వారికి మార్గనిర్దేశనం చేస్తాయి. మన బంధువుల్లో లేదా మిత్రుల పిల్లలు, యువతతో నీతి కథలు పంచుకో



వడం ఒక సదాచారాన్ని కాదు అది వారి జీవితంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. కథలు చెప్పడం వల్ల చెప్పిన వారికి, విన్న వారికి మధ్య సత్సంబంధాలు నెలకొంటాయి. అమెరికాలో ప్రారంభమైన "జాతీయ కథలు చెప్పు దినం" సందర్భంగా ప్రజలు కథలు పంచుకోవడం వల్ల భావోద్వేగాల నియంత్రణ కమ్యూనికేషన్, క్రియేటివిటీ, అవగాహన, ఆత్మవిశ్వాసం, మనో విస్తృతి, ఒకరినొకరు కనెక్ట్ కావడం, సామాజిక వాతావరణం సృష్టించడం, ఆలోచనాశక్తి పెరగడం, విమర్శనాత్మక ఆలోచనలు ప్రోత్సహించబడడం, భాషపై పట్టు, ప్రేరణ, కొత్త పరిచయాలు, సృజనాత్మక, వినడమనే సుగుణం, సంస్కృతీ వారసత్వాల వితరణ, వాక్కు, కొత్త ఆలోచనలు పురుడు పోసుకోవడం, దయ/సహానుభూతి, ఆశావహ దృక్పథం, ప్రపంచాన్ని చూసే దృక్కోణం, ఇతర నైపుణ్యాలు లాంటివి పెరుగుతాయి.

**మౌఖిక కథల నుంచి ఏఐ కథల వరకు..:**

కథలు చెప్పడంలో మౌఖిక, డిజిటల్, దృశ్య, వ్రాతపూర్వక రూపాలు ఉన్నాయి. సినిమాలు, పుస్తకాలు, కవితలు, పాటలు, పెయింటింగ్‌లు కూడా కథలు చెప్పే రూపాల్లోకి వస్తాయి. మౌఖిక కథలు చెప్పడం అంటే పురాణ పద్యాలు, శ్లోకాలు, ప్రాసలు, పాటలు లాంటి రూపాలు ఉండవచ్చు. కథలు చెప్పడం పట్ల మక్కువ ఉంటే అనేక కెరీర్ అవకాశాలు (స్క్రీన్ రైటర్, సృజనాత్మక రచయిత, సినీ దర్శకులు, వీడియో గేమ్ రచయితలు, కంటెంట్ స్ట్రాటజిస్టులు, పాడ్‌కాస్ట్ నిర్మాతలు, స్టోరీబోర్డ్ కళాకారులు, యానిమేటర్స్ లాంటి) ఉంటాయి. ఒకప్పుడు మనుషులు మాత్రమే చెప్పే కథలను నేడు ఏఐ విప్లవంతో ఆసక్తికరంగా కథలను చెప్పడం చూస్తున్నాం. సాంకేతికత, సృజనాత్మకత కలయికతో ఏఐ తన పరిధిని విస్తరిస్తోంది. ఇది మరింత గొప్ప, వైవిధ్యమైన కథనాలకు దారి తీస్తున్నది.

తల్లితండ్రులు, పెద్దలు తమ డిజిటల్ ప్రపంచపు నీలి తెరల్లోంచి కొంత సమయం తీసుకొని తమ పిల్లలకు కథలు చెప్పడానికి వెచ్చించాలి. పిల్లల్లో వినే కళను కూడా పెంచండి. నేటి పెద్దలు కొంత వరకు తమ పిల్లలకు కథలు చెప్పడం నేర్చుకోవాలి. కాథలిక్ వింటూ ఎదిగిన పిల్లల వ్యక్తిత్వం ఇతర పిల్లల కన్న విలక్షణంగా ఉంటుందని గమనించాలి.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# తెలంగాణ సాధనలో తెరాస పాత్ర సింహావలోకనం

## ఏప్రిల్ 27... తెరాస (భారాస) ఆవిర్భావ దినం

**తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఏప్రిల్ 27 మరిచి పోలేని రోజు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా తె.రా.స పార్టీ ఆవిర్భవించిన రోజు. ఆనాడు కేసీఆర్ మరి కొందరి భాగస్వామ్యంతో తె.రా.స ఉద్యమ పార్టీ ఏర్పాటు జరగక పోతే, నేటి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తెలంగాణ ప్రజల చిర కాల వాంచితంగానే మిగిలి పోయి ఉండేదేమో. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన తొలి దశలో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమం స్వార్ధ ప్రయోజనాల కారణంగా చల్లారి పోగా, మలి దశ ఉద్యమం కేసీఆర్ సమర్ధ నాయకత్వం, వ్యూహాత్మక ఎత్తుగడలు, ప్రణాళికా బద్ధమైన కార్యక్రమాలు, రాజకీయ జేఏసీ ఏర్పాటు, ఉద్యోగ, స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు, గ్రామ గ్రామాన ఉద్యమ రూపాలు, ప్రధానంగా ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని కల్పించిన నేపథ్యం వెరసి లక్ష్య సాధనకు దోహదం అయింది.**

తొలిదశ తెలంగాణ ఉద్యమం, మలిదశలో తెలంగాణ సిద్ధాంత కర్త జయశంకర్ ప్రారంభించిన కార్యక్రమాలు కేసీఆర్ పై తొలగని ప్రభావం చూపాయి.

2001లో కొత్తగా ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఏర్పాటు నేపథ్యం తెలంగాణ ఏర్పాటు సాధ్యాసాధ్యాల గురించి చర్చలకు తెర లేపాయి.

ఈ క్రమంలోనే తెలంగాణ ఉద్యమకారులతో ఏర్పాటుచేసిన సమావేశాల్లో రాష్ట్ర సాధన ఉద్యమం గురించి కేసీఆర్ విస్తృతంగా చర్చించారు. ఫలితంగా ప్రజల మనోభావాలకు అనుగుణంగా, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటుచేయాలన్న ఆలోచనను బలపరిచాయి. ఫలితంగా, 2001 ఏప్రిల్ 27 న కల్వకుంట్ల చంద్రశేఖరరావు అప్పటి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి పదవికి, శాసనసభా సభ్యత్వానికి, తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, తన ఆలోచనలతో ఏకీభవించిన కొందరు

నాయకులతో కలిసి తెరాసను ఏర్పాటు చేశారు. నిజాం మనుమరాలు సలీమా బాషా (అస్మత్ బాషా కుమార్తె), ఆమె కుమార్తె రఫత్‌షా ఆజంపురాలు తెలంగాణకు మద్దతు ప్రకటించారు. పాతబస్తీలోని ముస్లిం వర్గాలు తెలంగాణకు వ్యతిరేకం కాదని అన్నారు. 2001 ఏప్రిల్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం జలదృశ్యంలో టీఆర్ ఎస్ పార్టీ పురుడు పోసుకుంది. సుదర్శన్ రావు, నాయిని నర్సింహారెడ్డి, హన్మంతరావు, గాదె ఇన్నయ్య, వి. ప్రకాశ్ , నిమ్మ నర్సింహారెడ్డి, నారాయణరెడ్డి, గొట్టె భూపతి, మందాడి సత్యనారాయణరెడ్డి, హరీశ్ రావు తదితరులు ఆనాటి కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఉన్నారు. సుమారు ఏడాదికి పైగా జలదృశ్యం లోనే టీఆర్ ఎస్ పార్టీ కార్యకలాపాలు సాగాయి. 2001 మే 17న కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ కాలేజీ గ్రౌండ్ లో నిర్వహించిన బహిరంగ సభ ఉమ్మడి ఏపీ రాజకీయాల్లో పెను మార్పులకు బీజం వేసింది. జేఎంఎం చీఫ్ , అప్పటి జార్ఖండ్ సీఎం శిబూ సోరెన్ ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొన్ని రోజుల తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితి కార్యకలాపాలు నందినగర్ , హైదరాబాద్ లోని కేసీఆర్ నివాసానికి మారాయి. ఆరు నెలల తర్వాత ఎమ్మెల్యే కాలనీలోని మాజీ మంత్రి వేదంతరావు ఇంటికి పార్టీ కార్యాలయాన్ని మార్చారు. 2004లో వైఎస్ ప్రభుత్వం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ప్రస్తుతం తెలంగాణ భవన్ ఉన్న స్థలాన్ని టీఆర్ఎస్ కు కేటాయించింది. రేకుల షెడ్డు వేసి టీఆర్ఎస్ పార్టీ ఆఫీసు నిర్మాణాన్ని ప్రారంభించారు. 2006లో తెలంగాణ భవన్ ను ప్రారంభించారు.




పార్టీకి సైద్ధాంతిక భూమిక కల్పించడం దగ్గర్నుంచి కార్యాచరణను నిర్దేశించడం వరకు , తెలంగాణ సమాజాన్ని, దేశ రాజకీయ వ్యవస్థ స్వభావాన్ని లోతుగా అధ్యయనం చేసి, అర్థం చేసుకుని, తెలంగాణ ఉద్యమ వ్యూహానికి రూపకల్పన చేశారు కేసీఆర్. స్ట్రీట్ ఫైట్ స్థానంలో స్టేట్ ఫైట్ ఉండాలని భావించి , అందుకు వాహకంగా తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్ )ని ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దారు.

2004 లో టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకుని, టిఆర్ఎస్ 26 మంది ఎమ్మెల్యేలను, 5 మంది ఎంపిలను గెలుచుకుంది. తద్వారా శాసనసభ, లోకసభలలో స్థానాలను పొందింది. టిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ కేంద్ర మంత్రిగా కొంతకాలం పనిచేశారు. కొంతకాలం పోర్ట్‌ఫోలియో లేకుండా కూడా కొనసాగారు. 2006 లో తన మంత్రిత్వ శాఖకు రాజీనామా చేశారు. సెప్టెంబర్ 2006 లో కెసిఆర్ కరీంనగర్ లోక్ సభ స్థానానికి రాజీనామా చేసి ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో గెలిచారు. ఏప్రిల్ 2008 లో, టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలచే రాజీనామా చేయించి, రాష్ట్ర ప్రభుత్వం నుండి వైదొలిగారు. కానీ, ఈ ఉప ఎన్నికలో టిఆర్ఎస్ 7 ఎమ్మెల్యే, 2 లోక్ సభ స్థానాలను మాత్రమే నిలుపుకో గలిగింది. 2009 ఎన్నికలలో టిడిపి పొత్తుతో టిఆర్ఎస్ 10 ఎమ్మెల్యే సీట్లు, 2 ఎంపి సీట్లు మాత్రమే గెలుచుకో గలిగింది.

తెలంగాణ రాష్ట్ర సమితి 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు, నాటి కాంగ్రెస్ అధినేత్రి సోనియాతో కరీంనగర్‌లో ప్రత్యేక తెలంగాణ ఇస్తామని ప్రకటింప జేయడం, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ అంశాన్ని చేర్చడం, యూపీఏ కనీస ఉమ్మడి ప్రణాళిక (కామన్ మినిమమ్ ప్రోగ్రాం)లో తెలంగాణ అంశం చేర్చడంలో టీఆర్ఎస్ విజయం సాధించింది. తెలంగాణకు అనుకూలంగా దాదాపు 36 పార్టీలు లేఖ ఇవ్వడంలో ఢిల్లీ వేదికగా టీఆర్ఎస్ పార్టీ కృషి చేసింది.

"కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో" అంటూ కేసీఆర్ నవంబర్ 29, 2009 న, కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్షను చేపట్టారు. ఆయన దీక్షతో తెలంగాణలో ఉద్యమం ఉధృతం అయింది. డిసెంబర్ 7 న అఖిలపక్ష సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. దీంతో దిగి వచ్చిన యూపీఏ2 ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు దిశగా ప్రక్రియ ప్రారంభిస్తామంటూ 2009 డిసెంబర్ 9న ఒక ప్రకటన చేసింది. కానీ, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి నిరసనలు వెల్లువెత్తడంతో డిసెంబర్ 23న ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. తెలంగాణ ఏర్పాటుపై అందరి అభిప్రాయాలను సేకరించేందుకు శ్రీకృష్ణ కమిటీని ఏర్పాటు చేసింది.

తెలంగాణ జెఏసి, అనేక సంస్థలు, ప్రొఫెసర్ కోదండరం దాని ఛైర్మన్‌గా టిజెఎస్ ప్రారంభించిన పలు ఆందోళనలు, నిరసనలలో టిఆర్ఎస్ గ్రామస్థాయి నుండి చురుకుగా పాల్గొన్నారు. ఈ రాజకీయ ఐక్య కార్యాచరణ కమిటి ప్రత్యేక తెలంగాణ కోసం కేంద్రంపై ఒత్తిడిని తీవ్రం చేసింది. 2010 డిసెంబర్ 16న వరంగల్‌లో టీఆర్ఎస్ తలపెట్టిన మహా గర్జనకు 20 లక్షల మంది హాజరు అయ్యారు. శ్రీకృష్ణ కమిటీ నివేదిక సమర్పణ తర్వాత 2011 జనవరి నుండి టీఆర్ఎస్ అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భాగంగా 2013 అక్టోబర్‌లో తెలంగాణ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

2014 ఫిబ్రవరి 18న లోక్‌సభ, 20న రాజ్యసభ ఆమోదం తెలిపింది. మరో వైపు 2014 ఏప్రిల్‌లో సాధారణ ఎన్నికలు జరుగగా, మే 16న ఫలితాలు వచ్చాయి. తెలంగాణలోని 119 అసెంబ్లీ స్థానాలకు గాను టీఆర్ఎస్ 63, 11లోక్‌సభ స్థానాలను గెలుపొందింది. దీంతో తెలంగాణలో జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావంతో పాటు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. 2018 డిసెంబరు 7 న జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ 88 స్థానాల్లో గెలుపొంది ఘనవిజయం సాధించి, డిసెంబరు 13 గురువారం మధ్యాహ్నం 1:25 నిమిషాలకు రాజ్ భవన్‌లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. మలి సారి పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ధ్యేయంగా పార్టీని స్థాపించిన ఉద్యమ నేత కేసీఆర్ రెండు సార్లు అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా స్వయం పాలనా పగ్గాలు చేపట్టారు. తెలంగాణలోని సంఘాలు, విద్యార్థులు, రాజకీయ నేతల సహాయంతో ఉధృతంగా ఉద్యమం చేసి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన టీఆర్ఎస్, ఎన్నో ఆటుపోట్లను చవిచూసింది. ఎందరో పార్టీని వీడి వెళ్ళారు. ఎందరో చేరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పూర్తి స్థాయి బలమైన రాజకీయ పార్టీగా మారింది. కేసీఆర్ నేతృత్వంలో ప్రస్తుతం భారతీయ రాష్ట్ర సమితిగా పేరు మార్చుకుని, రాష్ట్ర రాజకీయాలలో కీలక పాత్ర పోషిస్తూ , ఇటీవలి సాధారణ ఎన్నికల్లో ఓటమిని చవి చూసి, అధికారాన్ని కోల్పోయి, ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ, గడ్డుకాలంలో కొట్టుమిట్టాడు తున్నది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494

# ఫీజు రీయింబర్స్మెంట్‌కు పంగనామాలా!

తెలంగాణ రాష్ట్రం ఎన్నో సహజ వనరులకు పెట్టింది పేరు. అలాగే విద్యావనరుకు కూడా ఒక ప్రత్యేకమైన స్థానం తెలంగాణకు ఉంది. రాష్ట్రంలో పేరు వేసిన విద్యాలయాలు, మరియు సాంకేతిక, ఫార్మా,వైద్య విద్యాసంస్థలు కూడా ఉండడం తెలంగాణకు తలమానికం. ప్రతి విద్యాసంవత్సరం కొన్ని లక్షల మంది విద్యార్థులు తమ విద్యా అర్హతను పూర్తి చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యను అందించాలని 2008వ సంవత్సరంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారు. నిరుపేద వర్గాల విద్యార్థులకు అందని ద్రాక్షగా ఉన్న ఇంజనీరింగ్,మెడిసిన్, లా, ఫార్మసీ కోర్సులు చదివే అవకాశం ఈ పథకం కారణంగానే లభించింది. ఈ పథకం ద్వారా లక్షల మంది విద్య ఉన్నత చదువులు చదవడంతో పాటు దేశ,విదేశాల్లో స్థిరపడి ఆర్థికంగా వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. అంతేకాకుండా దేశానికి విదేశీ మార్గద్రవ్యాన్ని కూడా అర్జించి పెడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ,బిసి, ఈబీసీ, మైనారిటీ కుటుంబాలకు ఉన్నత స్థితికి చేర్చే ఈ వినూత్న పథకాన్ని పాతరేసే కుట్రలను నేడు పాలక పక్షం చేస్తుంది. ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్ షిప్ ల మీద ఆధారపడి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఏటా సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పథకం అమలుకు ప్రతిఏటా 2,500 కోట్ల నిధులు అవసరం ఉండగా బడ్జెట్లో అరకొర నిధులు కేటాయిస్తూ కనీసం కేటాయించిన నిధులను సైతం సరి అయిన సమయంలో విడుదల చేయకుండా జాప్యం చేస్తున్నారు. పథకం మొదట్లో లేని అనేక షరతులు విధిస్తూ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడంతోపాటు కోర్సు మొత్తం ఫీజులో ఎంతవరకు తప్పించుకోవచ్చు అనే కుట్రలతో ఈ పథకానికి తూట్లు పొడిచే ప్రయత్నాలు చేస్తున్నారు. గత నాలుగేళ్ల నుండి ఇప్పటివరకు 10,000 కోట్ల బకాయిలు పేరుకుని పోయాయి. దీనికి ప్రధాన కారణం విద్య పట్ల విద్యార్థి లోకం పట్ల పాలకుల నిర్లక్ష్యం వైఖరి తెలుస్తుంది. ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ల ను విడుదల చేయకపోగా ఎస్సీ, ఎస్టీ బీసీ,ఈ బీసీ,మైనారిటీ విద్యార్థులకు ఈ పాలక పక్షం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఇంజనీరింగ్ కాలేజీల ఫీజులను 30 నుండి 35% పెంచడంలో ఎనలేని ఉత్సాహాన్ని ప్రదర్శించి పేద తల్లిదండ్రులకు గుండెల పై మరింత భారాన్ని మోపింది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్లకు ఇచ్చే నిధులు సైతం రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా తిరిగి వెనక్కు వెళుతున్నాయి. విద్యా సంవత్సరం అంతా పరీక్షల కోసం కష్టపడి చదువుకుంటే ఫీజు న రీయింబర్స్ మెంట్ రాలేదని హాల్ టికెట్ ఇవ్వకుండా కాలేజీల యాజమాన్యాలు వేధించడంతో చాలామంది విద్యార్థులు చదువుకు స్వస్తి చెబుతున్నారు. మరి కొంతమంది విద్యార్థులు మానసిక ఆవేదనను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పాలకులు నిధులు మంజూరు చేయకుండా కేవలం విద్యార్థిలోకాన్ని మోసం చేయడమే కాకుండా కళాశాల ఫ్యాకల్టీ కి జీతాలు అందక అర్థ ఆకలి తో అలమటించే పరిస్థితులు నెలకొన్నాయి. స్కాలర్షిప్ లు అందకపోవడంతో కడుపు నింపుకోవడానికి తోచిన పనిని చేసుకుంటూ కాలాన్ని వెల్లదీసే దుస్థితి విద్యార్థి లోకానికి దాపరించింది. విద్యారంగం పట్ల చిత్త శుద్ధిలేని పాలకుల వైఫల్యాల వల్ల చాలామంది విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారు. పాలకుల నిర్లక్ష్య పోకడాల వల్ల ప్రవేట్ కళాశాలల యాజమాన్యాలు కూడా అప్పుల పాలు అవుతున్నాయి. ప్రతి ఏటా రాష్ట్ర బడ్జెట్ 3 లక్షల కోట్లకు పైచిలుకు ఉంది.దీనిలో కేవలం 2500 కోట్ల రూపాయలతో 14 లక్షల మంది బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నత చదువులకు నిధులు సరిపోతాయి. ఈ మొత్తం బడ్జెట్లో కేవలం. 0.77 శాతం మాత్రమే. ఈ నిధులు కూడా విడుదలక చేయకపోగా అలసత్వం వహించడం చాలా దురదృష్టకరం. ఇటీవల కొన్ని కళాశాలాల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని హైకోర్టును ఆశ్రయించిన సందర్భంలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను గురించి స్పష్టమైన వైఖరిని తెలిసేలా కౌంటర్ దాఖలు చేయాలని పాలకులను కోర్టు పలుమార్లు ఆదేశించింది. అయినా పాలన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ వచ్చే విద్యా సంవత్సరం 2026–27 నుండి యాజమాన్యాలు విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేసుకోవచ్చు అని చెప్పిన మధ్యంతర జడ్జిమెంట్ రావడానికి పాలకులే పరోక్షంగా సహకరించినట్లు కనిపిస్తుంది. విద్యార్థుల చదువులు కొనసాగేలా పాలకులు దృష్టి పెట్టి వీలైనంత తొందరగా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి రాబోయే తరాలకు విద్యా వనరును చేరువచేసేలా ప్రయత్నాలు చేయాలి.



వంశీకృష్ణగౌడ్
బండి
ఎబివిపి పూర్వ విద్యార్థి
నాయకులు
జయశంకర్ భూపాలపల్లి
జిల్లా

## ముంబై తీరాన మంత్ర భాష్యం..

# గణపతి అథర్వ శీర్ష అంతరార్థం!

## జ్ఞాన స్వరూపం.. సనాతన ధర్మం: గణపతి ఉపనిషత్తుపై సామవేదం ప్రవచన యజ్ఞం

ముంబై మహానగరం లోని థానే వేదికగా సనాతన ధర్మ ప్రచారకులు, ఆధ్యాత్మిక సమన్వయ సరస్వతి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ వాగ్ధార ముంబై తెలుగు ప్రజలను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. 'సామవేదం సాంస్కృతిక సమన్వయ సమితి' ఆధ్వర్యంలో స్థానిక సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన ఆరు రోజుల ప్రవచన యజ్ఞం రహేజా గార్డెన్స్ ఆవరణలో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. 'ముంబై–తెలుగు బ్రాహ్మణ మహాసభ' ప్రధాన కార్యదర్శి నిర్వాహకులు ఓజ్జల ప్రవీణ్ శాస్త్రి, సహాయకులు శివకుమార్, ఎన్.ఎస్.రావు, మంజుల తదితరుల పర్యవేక్షణలో జరిగిన ఈ తొలి కార్యక్రమం, అష్టవినాయక నిలయమైన మహారాష్ట్ర గడ్డపై 'గణపతి అథర్వ శీర్షం' వైశిష్ట్యాన్ని చాటి చెప్పేలా సాగింది. అథర్వ వేదానికి శిఖరాయమానమై, 'గణపతి ఉపనిషత్తు'గా ప్రసిద్ధి గాంచిన ఈ మంత్ర భాగాన్ని షణ్ముఖ శర్మ సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తాత్త్విక కోణంలో విశ్లేషించారు. గణపతి కేవలం విఘ్నాలను తొలగించే దైవం మాత్రమే కాదని, ఆయన సర్వోన్నత బ్రహ్మ పదార్థమని, సృష్టి స్థితి లయలకు మూల కారణమైన ప్రత్యక్ష దైవమని శాస్త్ర ప్రమాణ పూర్వకంగా నిరూపించారు. ఉపనిషత్తుల సారాంశమైన 'తత్త్వమసి', 'త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి' వంటి మహా వాక్యాలను ఉటంకిస్తూ, గణేశ తత్త్వానికి గల నిగూఢార్థాలను వివరించిన తీరు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసింది. సనాతన ధర్మం అంటే కేవలం కొన్ని ఆచారాల సమాహారం కాదని, అది ఒక పరిపూర్ణ జ్ఞాన వ్యవస్థ అని, ఆ జ్ఞాన పరంపరను సర్వ దిక్కుల నుండి రక్షించమని చేసే ప్రార్థనే ఈ స్తోత్రమని వారు సోదాహరణంగా వివరించారు. శాస్త్ర విశ్లేషణలో భాగంగా గణేశుడిని త్రిగుణాతీతునిగా, అవస్థాత్రయానికి (జాగ్రత్, స్వప్న, సుషుప్తి) అతీతునిగా, కాలత్రయ బాధితునీగా వర్ణిస్తూ ఆయన మూలాధార చక్రంలో కొలువై ఉండే సర్వదేవతా స్వరూపుడని షణ్ముఖ శర్మ పేర్కొన్నారు. మంత్ర శాస్త్ర రహస్యాలను, బీజాక్షరాల ప్రాముఖ్యతను వివరిస్తూనే, గణపతి జన్మ వృత్తాంతం వెనుక ఉన్న తాత్త్విక పరమార్థాన్ని సవివరంగా ఆవిష్కరించారు.



క్లిష్టమైన మంత్ర భాగాలను లలితా సహస్ర నామ వైభవంతో అనుసంధానిస్తూ, భక్తికి జ్ఞానాన్ని మేళవించి సాగిన ఈ ప్రవచనం ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ఒక నూతన మార్గాన్ని చూపింది. మంత్ర పఠనం వల్ల కలిగే ఫలశృతిని, విఘ్న నివారణకు అవసరమైన ఉపాసన మార్గాలను తెలియజేస్తూ ఈ ప్రవచన యజ్ఞాన్ని ఆయన సంపూర్ణం చేశారు. సాంస్కృతిక హంగులతో సాగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు వంశీ కోటారు, హైదరాబాద్‌కు చెందిన భవ్య శ్రీనిధి గారు ఆలపించిన 'శివపదం' సంకీర్తనలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిష్ఠించాయి. సామవేదం సాంస్కృతిక సమన్వయ సమితి నిర్వాహకులు మూలా సిద్దారెడ్డి, గంగాధర రెడ్డి, కె.ఎస్.మూర్తి, బి.నారాయణరెడ్డి పర్యవేక్షణలో, రాధిక ముంగిపూడి వ్యాఖ్యానంతో సాగిన ఈ సభకు ముంబైలోని వివిధ తెలుగు సంస్థల ప్రతినిధులు, పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సుమారు 300 మందికి పైగా తెలుగు శ్రోతలు పాల్గొన్న ఈ ప్రారంభ వేడుక ముంబైలో తెలుగు సంస్కృతికి, ఆధ్యాత్మిక వైభవానికి అద్దం పట్టింది. కేవలం ఒక ప్రసంగంగా కాకుండా, సనాతన ధర్మ రక్షణకు అవసరమైన మేధో చైతన్యాన్ని అందించిన ఈ కార్యక్రమం ముంబై తెలుగు బ్రాహ్మణ మహాసభ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచి పోతుంది.

- రామ కిష్టయ్య సంగన భట్ల

# అసమాన గణిత శాస్త్రజ్ఞుడు
## శ్రీనివాస రామానుజుడు



ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు సాధించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్. గత సహస్రాబ్దిలో ప్రపంచానికి అత్యుత్తమ గణితశాస్త్ర సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అత్యుత్తమ అ'గణిత' మేధావి శ్రీనివాస రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం.
అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్.
శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ (డిసెంబర్ 22, 1887–ఏప్రిల్ 26, 1920) 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. ఆయనకు పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పడింది. పదమూడేళ్లకే ఎస్ఎల్ లోనీ త్రికోణమితిపై రాసిన పుస్తకాన్ని ఔపోసన పట్టడమే కాదు తను సొంతంగా సిద్ధాంతాలు కూడా ప్రారంభించారు.

కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ గణితం మీదే శ్రద్ధ చూపి మిగిలిన సబ్జెక్టులపై దృష్టి పెట్టక పోవడంతో ఎఫ్.ఎ. పరీక్ష తప్పారు. ఆ తరువాత మద్రాస్‌లోని పచ్చయ్యప్ప కాలేజీలో చేరారు. అక్కడ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై రామానుజన్ విశేష పరిశోధనలు చేశారు.
1729 సంఖ్యను రామానుజన్ సంఖ్యగా పిలుస్తారు. తీవ్రమైన అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నప్పుడు కూడా హార్డీతో 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను తెలియజెప్పి ఆయన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేశారు.
రామానుజన్ అనారోగ్యంతో హాస్పిటల్లో వున్నపుడు, హార్డీ ఆయనను పలుకరించటానికి వెళ్లి మాటల మధ్యలో తాను వచ్చిన కారు నంబరు 1729, దాని ప్రత్యేకత ఏమైనా ఉన్నదా ? అని అడిగారు. అందుకు రామానుజన్ తడుము కోకుండా ఆ సంఖ్య ఎంతో చక్కని సంఖ్య అని, ఎందుకంటే రెండు విధాలుగా రెండు ఘనముల మొత్తముగా వ్రాయబడే సంఖ్యా సమితిలో అతి చిన్నసంఖ్య అని తెల్పారు. (1729 = 1గీ3 ం 12గీ3 = 9గీ3 ం 10గీ3 ). ఈ సంఘటన గణితంపై ఆయనుకున్న అవ్యాజమైన అనురాగానికి, అంకిత భావానికి నిదర్శనం.
మహా మేధావులు కూడా సాధించలేని సమస్యలను అలవోకగా ఎలాంటి పుస్తకాల సాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం..

15ఏళ్ళకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్చూచ్‌సిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవారు. 3,500 గణిత ఫలితాలను సమీకరించిన రికార్డును సొంతం చేసుకున్న మేధావి.

1903లో మద్రాసు విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్ వచ్చింది. లెక్కల వల్ల కొడుకుకి పిచ్చి పడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్ళి చేశారు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరారు. చిత్తు కాగితాలను కూడా బహు జాగ్రత్తగా వాడుకుంటూ గణితమే లోకంగా బతికేవారు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూచి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వ విద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా.వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్డి (1877–1947)కి పంపారు.

ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు.

జీవిత చరమాంకంలో రామానుజన్ రాసిన మ్యాజిక్ స్క్వేర్, ప్యూర్ మాథ్స్‌కు చెందిన నెంబర్ థియరీ, మాక్ తీటా ఫంక్షన్స్ చాలా ప్రసిద్ధి పొందాయి. 33 ఏళ్ళకే ఆయన 1926, ఏప్రిల్ 26న మరణించారు. ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలెజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండో భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కారు.

రామానుజన్ స్వరాష్ట్రమైన తమిళనాడు, ఆ రాష్ట్ర వాసిగా ఆయన సాధించిన విజయాలకు గుర్తుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22 ను రాష్ట్ర సాంకేతిక దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో ఆయన 75వ జన్మదినం నాడు, సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2012లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టినరోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. 125వ జయంతి సందర్భంగా 2014ను భారత ప్రభుత్వం జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా ప్రకటించింది.
రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన విదేశీ ప్రొఫెసర్ హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం..

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...**
**9440595494**

### కేవలం 5 నిమిషాల్లో వేడిని తగ్గించే
# చల్లని సలాడ్! ఒక్కసారి ట్రై చేయండి!





మండే వేసవి ఎండల్లో శరీరాన్ని చల్లగా, తేలికగా ఉంచుకోవడానికి పండ్లు, కూరగాయలపై ఆధారపడటం చాలా మంచిది. అటువంటి ఆరోగ్యకరమైన, సులభంగా తయారుచేయగల వంటకాల్లో ఒకటి పచ్చి బొప్పాయి సలాడ్.దపులుపు, తీపి, కారం రుచుల సమతుల్యతతో ఇది కేవలం రుచికరమైన సలాడ్ మాత్రమే కాదు, శరీరాన్ని శుద్ధి చేసే పోషకాహారం కూడా...

**ఈ సలాడ్ ఆరోగ్య ప్రయోజనాలు**

పచ్చి బొప్పాయి ని "సూపర్‌ఫుడ్"గా పరిగణించడానికి కారణం దానిలో ఉండే పాపైన్ (ఞుజూఞుఱఅ) ఎంజైమ్. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఆహారంలోని ప్రోటీన్లను సులభంగా విడగొట్టి, శరీరం పోషకాలను బాగా గ్రహించేందుకు సహాయపడుతుంది.

అదేవిధంగా, పచ్చి బొప్పాయి శరీరంలోని వ్యర్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. వేసవిలో కనిపించే ఉబ్బరం (బ్లోటింగ్) తగ్గించడంలో ఇది ఉపయోగకరం. ఇందులో అధికంగా ఉండే పీచుపదార్థం (ఫైబర్) ఆకలిని నియంత్రించి, అనవసరమైన చిరుతిళ్లను తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ప్రేగుల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది.

**కావలసిన పదార్థాలు**
**ఈ సులభమైన సలాడ్ కోసం సాధారణంగా ఇంట్లో ఉండే పదార్థాలు చాలును:**

తురిమిన పచ్చి బొప్పాయి – 1 కప్పు
తరిగిన పుదీనా ఆకులు – 2 టేబుల్ స్పూన్లు
నిమ్మరసం – 1.5 టేబుల్ స్పూన్లు
వేయించిన జీలకర్ర పొడి – 1/4 టీస్పూన్
ఉప్పు – రుచికి సరిపడా (సుమారు 1/4 టీస్పూన్)
తేనె – 1 టీస్పూన్
దోసకాయ ముక్కలు – 1/4 కప్పు (ఐచ్ఛికం, చల్లదనం కోసం)
వేయించిన వేరుశెనగలు – ఒక గుప్పెడు

**తయారీ విధానం**

పచ్చి బొప్పాయి సలాడ్ తయారీ చాలా సులభం, వేగంగా పూర్తవుతుంది.
మొదటగా పచ్చి బొప్పాయి తొక్క తీసి, సన్నగా తురిమాలి. తురిమిన ముక్కలు సమానంగా ఉండేలా చూసుకోవాలి.
ఒక పెద్ద గిన్నెలో ఈ తురుము వేసి, అందులో తరిగిన పుదీనా ఆకులు కలపాలి. తరువాత నిమ్మరసం, వేయించిన జీలకర్ర పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి.
రుచిని సమతుల్యం చేయడానికి తేనెను కలపాలి. కావాలనుకుంటే దోసకాయ ముక్కలు కూడా చేర్చుకోవచ్చు, ఇది మరింత చల్లదనాన్ని ఇస్తుంది.
మిశ్రమాన్ని 2–3 నిమిషాలు అలాగే ఉంచితే రుచులు బాగా కలిసిపోతాయి.
చివరగా పైగా వేయించిన వేరుశెనగలు చల్లి సర్వ్ చేయాలి. ఇవి సలాడ్‌కు మంచి కరకరలాడే టెక్చర్‌ను ఇస్తాయి.
పచ్చి బొప్పాయి సలాడ్‌ను సైడ్ డిష్‌గా లేదా తేలికపాటి స్నాక్‌గా తీసుకోవచ్చు.
నిమ్మరసం, పుదీనా కలయిక దీనికి తాజాదనాన్ని ఇస్తూ శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.
ఈ వేసవిలో ఆరోగ్యకరమైన అలవాటును ప్రారంభించాలనుకునే వారు తప్పకుండా ఈ సలాడ్‌ను ప్రయత్నించవచ్చు.

### మామిడి vs పుచ్చకాయ: ఎండాకాలంలో
# శరీర వేడిని తగ్గించడానికి ఏది బెస్ట్..?

నీటి శాతం ఎందులో ఎక్కువ: దాహం తీర్చుకోవడంలో పుచ్చకాయకు సాటి ఏదీ లేదు.ఇందులో దాదాపు 90శాతం పైగా నీరు ఉంటుంది. ఎండలో తిరిగే వారికి, శరీరంలో నీటి శాతం తగ్గిపోకుండా చూడటంలో ఇది దిట్ట. మామిడి పండు రసభరితంగా ఉన్నప్పటికీ, దాని సాంద్రత ఎక్కువ. ఇది శరీరానికి తేమను అందిస్తుంది కానీ పుచ్చకాయ అంత వేగంగా బాడీని రీఛార్జ్ చేయలేదు.

శక్తి వర్సెస్ చల్లదనం: మామిడి పండులో సహజ చక్కెరలు ఎక్కువగా ఉంటాయి. ఇది తిన్న వెంటనే మీకు మంచి శక్తిని ఇస్తుంది. నీరసంగా అనిపించినప్పుడు మామిడి పండు తింటే వెంటనే హుషారు వస్తుంది. శరీరంలోని వేడిని తగ్గించి,



తక్షణమే సేదతీర్చడంలో పుచ్చకాయ నెంబర్ వన్. ఇది జీర్ణం కావడానికి కూడా చాలా తేలికగా ఉంటుంది.

పోషకాల పరంగా ఏది టాప్: రెండు పండ్లూ ఆరోగ్య ప్రదాతలే, కానీ వాటి ప్రత్యేకతలు వేరు. మామిడి లో విటమిన్–ూ, విటమిన్–జ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా చర్మ సౌందర్యానికి మేలు చేస్తాయి. ఇందులో లైకోపీన్ వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి, ఎండ వల్ల చర్మం కాలిపోకుండా రక్షించడానికి తోడ్పడతాయి.





జీర్ణక్రియ – శరీర వేడి: ఇక్కడే అసలైన ట్విస్ట్ ఉంది. మామిడి పండు రుచిగా ఉందని ఎక్కువగా తింటే శరీరంలో వేడి పెరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల కొందరికి వేసవిలో మొటిమలు లేదా వేడి కురుపులు వస్తుంటాయి. అందుకే మామిడి పండును మితంగా తినాలి. అదే పుచ్చకాయ అయితే ఎన్ని తిన్నా శరీరాన్ని చల్లబరుస్తూనే ఉంటుంది.

ఏది ఎప్పుడు తినాలి?: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు పుచ్చకాయ తినడం ఉత్తమం. ఇది మిమ్మల్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. శక్తి కోసం, కడుపు నిండుగా ఉండటం కోసం ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో మామిడి పండును ఎంచుకోవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు మాత్రం మామిడి పండు విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

### 20 ఏళ్ల అప్పు
# 10 ఏళ్లలోనే క్లోజ్..
### రూ.30 లక్షలు ఆదా చేసే అద్భుతమైన ట్రిక్..!

నినాదం మార్కెట్

సొంతిల్లు అనేది ప్రతి ఒక్కరి జీవిత కల. కానీ, ఆ కల కోసం తీసుకునే హోమ్ లోన్ సుమారు 20 నుండి 25 ఏళ్ల పాటు మనల్ని రుణగ్రస్తులుగా మారుస్తుంది.మనం తీసుకున్న అసలు మొత్తం కంటే వడ్డీ రూపంలోనే బ్యాంకుకు రెండింతలు చెల్లించాల్సి వస్తుంది. అయితే, సరైన ఆర్థిక ప్రణాళికతో ఈ వడ్డీ భారాన్ని భారీగా తగ్గించుకోవచ్చు.

**వడ్డీ మాయాజాలం: ఫ్రంట్–లోడింగ్ అంటే ఏమిటి?**

హోమ్ లోన్ తీసుకున్న మొదటి 5 నుండి 7 సంవత్సరాలు అత్యంత కీలకమైనవి. దీనిని 'ఫ్రంట్–లోడింగ్' అంటారు. అంటే, మీరు కట్టే ప్రతి ఈఎంఐ (జువీ×)లో ఎక్కువ భాగం వడ్డీకే పోతుంది, అసలు మాత్రం చాలా తక్కువగా తగ్గుతుంది. ఉదాహరణకు మీరు రూ.50,000 ఈఎంఐ కడుతుంటే అందులో దాదాపు రూ.40,000 వడ్డీకే వెళ్తుంది. దీనివల్ల లోన్ కాలపరిమితి ముగిసేసరికి మీరు తీసుకున్న అప్పు కంటే చాలా ఎక్కువ మొత్తాన్ని బ్యాంకుకు సమర్పించుకుంటారు. మీ లోన్ కాలాన్ని సగానికి తగ్గించడానికి ఉన్న అత్యంత ప్రభావవంతమైన మార్గం వార్షిక టాప్–అప్. ప్రతి ఏటా మీ జీతం పెరిగినప్పుడు, మీ ఈఎంఐ మొత్తాన్ని కూడా 5% నుండి 10% పెంచుకుంటూ పోవాలి.

**ఉదాహరణకు:**
మీరు 9% వడ్డీతో రూ.50 లక్షల లోన్‌ను 20 ఏళ్ల కాలపరిమితికి తీసుకుంటే మీరు చెల్లించాల్సిన మొత్తం వడ్డీ సుమారు రూ.58 లక్షలు అవుతుంది.

**సింపుల్ ట్రిక్:**
అదే ఈఎంఐని ప్రతి సంవత్సరం కేవలం




10% పెంచుకుంటూ వెళ్తే, అదే లోన్‌ను కేవలం 10 సంవత్సరాల్లోనే పూర్తి చేయవచ్చు. దీనివల్ల మీకు సుమారు రూ.30 లక్షల వడ్డీ ఆదా అవుతుంది.

**మొదటి 5 ఏళ్లలోనే అదనపు చెల్లింపులు**

లోన్ తీసుకున్న తొలి ఐదేళ్లలో చేసే అదనపు చెల్లింపులు (ూతీవ–జూఞుఎవవతం) అసలు మొత్తాన్ని వేగంగా తగ్గిస్తాయి. అసలు తగ్గితే, దానిపై పడే వడ్డీ కూడా గణనీయంగా తగ్గుతుంది. సంవత్సరానికి కనీసం ఒక అదనపు ఈఎంఐని చెల్లించడం వల్ల కూడా మీ లోన్ భారం త్వరగా తగ్గుతుంది. ఇలా ఆదా చేసిన లక్షలాది రూపాయలను మీ పిల్లల చదువులకో లేదా మీ రిటైర్మెంట్ కోసమో ఉపయోగించుకోవచ్చు. 20 ఏళ్ల పాటు అప్పుల ఊబిలో ఉండటం కంటే, ప్రారంభంలో కొంచెం అదనంగా కష్టపడి ఈఎంఐని పెంచుకోవడం ద్వారా త్వరగా ఆర్థిక స్వేచ్ఛను పొందవచ్చని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# చాణక్య నీతి: జీవితంలో దుఃఖాన్ని జయించాలంటే ఈ అలవాట్లు తప్పనిసరి!

చాణుక్యుడు మన జీవితంలో జరిగే ముఖ్య విషయాలను గురించి ముందే చెప్పారు. వీటిని తెలుకోవడానికి ఇప్పటికి ఎంతో మంది ఆసక్తి చూపిస్తున్నారు. అలా మనిషి జీవితం గురించి ముందే ఎన్నో విషయాలను చెప్పాడు.

అయితే, మన జీవితంలో దుఃఖాన్ని జయించాలంటే ఈ అలవాట్లు తప్పనిసరి అంటున్న చాణక్యుడు. మరి, ఆయన విషయాలు ఏంటో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం..

దానం చాలా గొప్పదని చాణక్యుడు చెబుతున్నాడు. అయితే, దానధర్మాలు చేసే ఆ మనిషి పేదరికంలో ఉండరు. అలాగే, లక్ష్మీదేవి ఆశీస్సులను కూడా పొందుతారు. ఇంకా డబ్బు మాత్రమే కాకుండా ఆహారానికి కూడా లోటు లేకుండా ఉంటుంది. ఇలా ఇతరులకు చేసే సాయం ఆ వ్యక్తి తన లైఫ్ లో గౌరవం పెరుగుతుందని చాణక్యుడు అంటున్నారు.

మంచి ప్రవర్తన కలిగిన మనుషులు సమాజంలో ఎప్పుడూ కింద పడిపోరు. వారికి అవమానాలు పెద్ద లెక్క కాదు, ఎప్పుడు ఏం చేయాలో వాళ్ళకి బాగా తెలుసు. అలాగే, ధర్మాన్ని గౌరవిస్తూ ముందుకు వెళ్తే కాలమే గొప్ప సహాయం చేస్తుంది. ఇంకా గౌరవం కూడా పెరుగుతుంది. ఇది మాత్రమే కాకుండా జీవితంలో ముందుకు వెళ్తారని చాణక్యుడు అంటున్నారు.

అజ్ఞానం మనిషిని కిందకు లాగేస్తుంది. ఇది పెద్ద అడ్డు గోడ అని చాణక్యుడు అంటున్నారు. జ్ఞానంతో ఉంటే చీకటిలో వెలుగు వైపు వెళ్లొచ్చు. ఇంకా ఎప్పుడూ నేర్చుకునే విధంగా ఉండాలి. అలాగే, తెలివిగా వ్యవహరించే మనుషులు వారి లైఫ్ లో ఎప్పుడూ ముందే ఉంటారని చాణక్యుడు చెబుతున్నారు.

చాణక్యుడి నీతి ప్రకారం, నిత్యం దేవున్నీ పూజిస్తే సానుకూల ఆలోచనతో పాటు భయాలు కూడా పూర్తిగా తొలగిపోతాయి. అలాగే, మనిషి అన్ని కర్మలు ఇక్కడే అనుభవించాల్సి ఉంటుంది.



### రష్యా చమురు దిగుమతులు..
# ఆ డేటా వెల్లడించలేం: పీపీఏసీ

రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులకు సంబంధించిన సమగ్ర వివరాలను ఆర్టీఐ కింద అందజేయడం కుదరదని పెట్రోలియం శాఖ ఆధ్వర్యంలోని 'పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్' (ూూూజ) తెలిపింది. ఇది వాణిజ్యపరమైన, గోప్యమైన అంశం కావడంతో సమాచార హక్కు చట్టం కింద మినహాయింపు ఉందని పేర్కొంది. దేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను ఉటంకిస్తూ.. కేంద్ర సమాచార కమిషన్ (జ×జ) కూడా దీనిని సమర్థించింది.

2022 జూన్ నుంచి 2025 జూన్ మధ్యకాలంలో రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న ముడి చమురు వివరాలను అందజేయాలని 'పీపీఏసీ'లో ఓ ఆర్టీఐ పిటిషన్ దాఖలైంది. ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఓఎన్‌జీసీ విదేశ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ వంటి సంస్థల వారీగా కూడా డేటా కావాలని దరఖాస్తుదారు కోరారు. అయితే, ఈ సమాచారాన్ని ఇచ్చేందుకు 'సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్' (సీపీఐవో) నిరాకరించారు.

"దేశాలు, కంపెనీల వారీగా ముడి చమురు దిగుమతులకు సంబంధించిన సమాచారం వాణిజ్యపరమైనది, గోప్యమైనది. ఆర్టీఐ చట్టం కింద ఈ డేటాను వెల్లడించడాన్ని మినహాయించారు. అయితే, ముడి చమురు మొత్తం దిగుమతి పరిమాణం, విలువను పీపీఏసీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు" అని సీపీఐవో తెలిపారు. ఫస్ట్ అప్పీలేట్ అథారిటీ సైతం ఈ సమాధానాన్ని సమర్థించింది.




దిగుమతులపై ఆధారపడటం తగ్గేదెప్పుడో?

దీంతో దరఖాస్తుదారు.. సీఐసీని ఆశ్రయించారు. ఇంధన రంగంలో దేశం ఎలా పనిచేస్తుందో తాను తెలుసుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు. అయితే.. ఈ సమాచారాన్ని వెల్లడించడం దేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తుందని సీఐసీ పేర్కొంది. ఇతర దేశాలతో సంబంధాలను కూడా ప్రభావితం చేస్తుందని తెలిపింది. ఈ సమాచారం భౌగోళిక రాజకీయ సంబంధాలతో ముడిపడి ఉందని చెప్పింది. ఆర్టీఐ చట్టం కింద మినహాయింపు చెల్లుబాటు అవుతుందని స్పష్టం చేసింది.

## లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సన్మానం

విద్యలో రాణిస్తున్న విద్యార్థులను అభినందిస్తూ ప్రోత్సహించడంతోపాటు విద్యా వైద్య ఆరోగ్య కార్యక్రమాలను లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర దేవరకొండ చేపడుతుందని లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర దేవరకొండ ప్రెసిడెంట్ ఇడం రాములు అన్నారు. దేవరకొండ పట్టణానికి చెందిన చేరుపల్లి రాజేష్ రమ్య ల కుమార్తె ప్రణతి ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో 986/1000 మార్కులు సాధించి ప్రతిభను కనబరిచింది ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థినీని అభినందిస్తూ శాలువతో ఘనంగా సన్మానించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులను సైతం సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఇడం రాములు, ప్రధాన కార్యదర్శి మాకం చంద్రమౌళి, లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర దేవరకొండ కమింగ్ ప్రెసిడెంట్ పగిడిమర్రి సతీష్, జెడ్ సి వనం శ్రీనివాసులు, పాల్గొన్నారు.




## వాసవీ మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు.**

**కోదాడలో అధికారికంగా వాసవీ మాత జయంతి వేడుకలు**

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఆర్డీఓ సూర్యనారాయణ.**

మునగాల:కోదాడ పట్టణంలో శ్రీ వాసవీక న్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయంలో అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు, మంగళ పుష్ప నీరాజనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు వంగవీటి రామారావు లు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించడమే కాకుండా, అమ్మవారి జయంతిని అధికారికంగా నిర్వహించి గౌరవించిందని కొనియాడారు. ఆర్డీఓ సూర్యనారాయణ ప్రభుత్వ పక్షాన పట్టువస్త్రాలు సమర్పించగా, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వరల్డ్ హిందూ ఫెడరేషన్ నేషనల్ జనరల్ సెక్రటరీ, టీడీపి జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జోష్నా, శ్రీధర్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడటమే లక్ష్యంగా అంతర్జాతీయ హిందూ ఫెడరేషన్ పనిచేస్తుందని, ఇందులో కులమతాలకు



తావులేదని స్పష్టం చేశారు. అనంతరం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎర్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాగుబండి వీరయ్య-భద్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లీశ్వరి, కమిషనర్ రమాదేవి,ఆలయ ధర్మకర్తలు నాగు బండి రంగా, రంగనాథ్, ఎర్ర జ్యోతి, వశిష్ట, సరోజా, శ్రీనివాసరావు, ఈసీ మెంబర్స్ వెంకటరమణ, వినయ్, పైడిమరి సత్తిబాబు, నారాయణరావు, సుధాకర్, లక్ష్మణరావు, సత్యనారాయణ,తదితరులు ఈవేడుకల్లో పాల్గొన్నారు.

## కొయ్యలగూడెం 6 వ,వార్డు సభ్యుడికి ఘన సన్మానం

**శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన ముసిని అంజన్**

ప్రజలకు సేవ చేసే భాగ్యం అందరికీ దక్కదని ,దక్కిన అవకాశాన్ని ప్రజల కోసం శ్రమించి పనిచేసి ఓట్లు వేసి గెలిపించిన ప్రజ మన్ననలు పొందాలని దేవరకొండ పట్టణానికి చెందిన చేనేత ఐక్యవేదిక రాష్ట్ర మీడియా కో కన్వీనర్ ముసిని అంజన్ అన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో రామన్నపేట కొయ్యలగూడెం 6 వ, వార్డు సభ్యుడుగా గెలుపొందడంతో ఆయనను ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపేందర్ ఎన్నిక పట్ల శుభాకాంక్షలు తెలియజేస్తూ వార్డు అభివృద్ధి కోసం కృషి చేయాలని భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయములో ఘనంగా అమ్మవారి జయంతి ఉత్సవాలు

వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఆర్యవైశ్య కుల దేవత శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినారు, అందులో భాగంగా దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ గారు ప్రభుత్వం తరపున మన వాసవి మాతకు పట్టు వస్త్రాలను సమర్పించినారు, మున్సిపల్ చైర్మన్ పున్నశైలజ వెంకటేశ్వర్లు, ప్రభుత్వం తరపున డిండి తహసిల్దార్ హన్మంతు శ్రీనివాస్ గౌడ్ , హాజరైనారు. వాసవి వనిత క్లబ్ అధ్యక్షులు పందిరి జ్యోతి అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పించిన దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ నీలా సంజీవ్ కుమార్ ,మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆలంపల్లి నరసింహ, మాజీ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పానగంటి మల్లయ్య, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ కొత్త సుబ్బారావు, సావిత్రి ,వాసవి క్లబ్ అధ్యక్షులు అతుకూరి ఆంజనేయులు, కార్యదర్శి బెల్దర్ రవీందర్, వాసవి వనిత క్లబ్ కార్యదర్శి బెజవాడ మల్లీశ్వరి, ఐపీసీలు గోవిందు కొండయ్య, బెల్దే మాధవి, లకుమారపు మల్లయ్య, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చిదేళ్ళ వెంకటేశ్వర్లు, వాసవి కళ్యాణమండపం అధ్యక్షులు వాసా వెంకటేశ్వర్లు, వాసవి వనిత క్లబ్ వాసవి క్లబ్ సభ్యులు పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు .



## శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ ఉత్సవాలలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు

కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి మండలం వేంపేట గ్రామంలో జరిగిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ ఉత్సవాలలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోరుముంతల ప్రవీణ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎల్లేటి మహిపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, శేఖర్ గౌడ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు విజన్ తెలుగుజాతికి గర్వకారణం

**అభివృద్ధి ప్రదాతకు అంతర్జాతీయ గుర్తింపు..**

**పసుపు జెండాను ఎవరూ అంతం చేయలేరు.**

**కార్యకర్తలు ఐక్యమత్యంతో పనిచేయాలి...**

**టిడిపి జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ తిరునగూరు జోష్ణ..**

మునగాల:తెలుగుదేశం పార్టీ జాతీయఅధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు కు 'ఎకనామిక్‌టైమ్స్' సంస్థ నుండి 'బిజినెస్ బెస్ట్ రిఫార్మర్ఆఫ్ ది ఇయర్' అవార్డు దక్కడం ప్రతితెలుగు బిడ్డకు గర్వకారణమని ఆ పార్టీజాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్‌తిరునగూరు జోష్ణ శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం కోదాడలో సీనియర్ మాజీ రాష్ట్ర నాయకులు ముత్తినేనీ సైదేశ్వరరావు ఆహ్వానం మేరకు వారి నివాసంలో టిడిపి నాయకులతో కలిసి జరిగిన సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు కేవలం ఒక రాజకీయ నాయకుడిగానే కాకుండా, అద్భుతమైన విజన్ ఉన్న అడ్మినిస్ట్రేటర్‌గా ప్రపంచం గుర్తించిందని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన వేసిన హైటెక్ సిటీ పునాదుల నుంచి నేడు మనం చూస్తున్న ఐటీ, ఏఐ, క్వాంటం టెక్నాలజీ వరకు ఆయన ఆలోచనా విధానమే యువతకు ఉపాధి బాటలు వేసిందని స్పష్టం చేశారు.?రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే అరుదైన నాయకుడు చంద్రబాబు అని, అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోనైనా, విభజిత ఆంధ్రప్రదేశ్‌లోనైనా సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఆయన ముందుంటారని తెలిపారు. తెలంగాణ గడ్డపై ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీని అంతం చేయడం ఎవరి తరము కాదని, రాబోయే రోజుల్లో పార్టీ ఒక నిర్ణయాత్మక శక్తిగా ఎదగబోతుందని ధీమా వ్యక్తం చేశారు. సంస్థాగత నిర్మాణం చాలా బలంగా సాగుతోందని, నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంతో పనిచేసి పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం ఆమెను శాలువా, పూల బొకే లతో ఘనంగా





సన్మానించారు. ఈ సమావేశంలో నాయకులు కట్టా సతీష్, గుండు నాగేశ్వరరావు, వనపర్తి నాగేశ్వరరావు,చావా హరినాథ్, పొందూరి వెంగల్ రావు, శ్రీ వాత్సవ్, బాబా, తదితరులు పాల్గొన్నారు.

## ఆశయాల కోసం కమ్యూనిస్టు లు కడవరకు పోరాడుతారు : సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి

ఆశపడి కొందరు రాజకీయాల్లోకి వస్తారని కమ్యూనిస్టులు ఆశయం కోసం కడవరకు పోరాడుతారని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు ఆదివారం గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు పెద్దగోని యాదయ్య స్మారక స్థూపావిష్కరణ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. సందర్భంగా పల్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో కార్పోరేట్ పారిశ్రామిక వర్గాలు ప్రవేశించి రాజకీయాలను వ్యాపారంగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సేవే పరమావధిగా భావించే కమ్యూనిస్టులు చిరకాలం ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని అన్నారు యాదయ్య తన జీవితకాలం కుటుంబం కన్నా పార్టీని ప్రాణంగా పెట్టి పని చేశాడని కొనియాడారు ఆయన ఆశయ ఎధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని సందర్భంగా కోరారు.?ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దోపిడీ లేని సమ సమాజ స్థాపనే దేయంగా ప్రతి ఒక్కరు పాటుపడాలని అన్నారు యాదయ్య కమ్యూనిస్టు భావజాలాన్ని బడుగు బలహీన వర్గాల ప్రజలకు వివరిస్తూ అనేక పోరాటాల్లో తనదైన పాత్ర పోషించాడని కొనియాడారు. వారి కుటుంబం కమ్యూనిస్టు కుటుంబంగా ఎదగడం సంతోషకరమని అన్నారు.మూడు దశాబ్దాల కాలంగా తెలంగాణ ప్రాజెక్టుల సాధన కోసం సిపిఐ నిరంతర పోరాటాలు సాగిస్తుందని తెలిపారు. డిండి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల పూర్తి కోసం




సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బిలాలు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చలం పాండురంగారావు, గణేష్ పరమేష్,?కంపే దుర్గయ్య,రాపోలు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో..

**శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 333వ ఆరాధన మహోత్సవం**

ప్రగతి విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 333వ ఆరాధన మహోత్సవ పూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులుగా తుంపాల వెంకటేశ్వరరావు, పెంట శ్రీనివాసరావు, తాతారావు హాజరై పూజల్లో పాల్గొన్నారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రగతి విశ్వబ్రాహ్మణ సేవా సంఘం కమిటీ అధ్యక్షుడు వీరమల్లు రమేష్, ఉపాధ్యక్షుడు తూమాటి శంకరరావు, జనరల్ సెక్రటరీ శ్రీరామదాసు నరసింహ చారి, ట్రెజరర్ పట్నాల వెంకటరాజు, జాయింట్ సెక్రటరీ సునీల్, ముఖ్య కార్యదర్శులు రవిశంకర్, ఉపేందర్, ఈశ్వర్ రావు విశ్వబ్రాహ్మణ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



## 'పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ గ్యాస్‌పై వదంతులు నమ్మొద్దు'




హైదరాబాద్: తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాకు నిల్వలు సమృద్ధిగా ఉన్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఎటువంటి అపోహలకు గురి కావద్దని సూచించారు. రోజుకి 9,574 కిలోలీటర్ల పెట్రోల్, 14,457 కిలో లీటర్ల డీజిల్ మొత్తం 24 వేల కిలో లీటర్ల పైగా పెట్రోల్, డీజిల్‌ను బంకుల ద్వారా వాహనదారులకు పోస్తున్నట్లు తెలిపారు. అలాగే వినియోగదారులకు 2 లక్షల 22 వేల కు పైగా ఎల్‌పీజీ గ??యాస్ సిలిండర్లు డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. పెట్రోల్,డీజిల్ సరఫరా, గ్యాస్ డెలివరీలపై పౌర సరఫరాల శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1967కు ఫోన్ చయొచ్చని కోరారు. కాగా, రెండు రోజులపాటు బంకుల్లో పెట్రోల్, డీజిల్ ఉండదన్న వదంతులతో ఖమ్మం నగరంలో వాహనదారుల పెట్రోల్ బంక్‌ల ముందు క్యూ కట్టారు. రాత్రి నుంచి వాహనదారులు పెట్రోల్ బంకుల ముందు నిలబడుతున్నారు. కొన్ని బంకులు మూసివేసి ఉండటంతో వాహనదారుల్లో ఆందోళన మొదలై బంకుల ముందు క్యూ కడుతున్నారు. పెట్రోల్, డీజిల్ దొరకదని అపోహలతో కొంతమంది వ్యక్తులు క్యాన్లలో నింపుకుని పోతున్న వీడియోలు వైరల్‌గా మారాయి. కొన్ని రోజుల ?క్రితం హైదరాబాద్ సహా పలు నగరాల్లోనూ ఇటువంటి ఘటనలే చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

## 'రేవంత్ పేరు చెప్పాలంటేనే మొహం తిప్పుకుంటున్నారు'



హైదరాబాద్: దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు అంతా ముందుకు వస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆదివారం హుజూర్ నగర్ నియోజకవర్గం నుంచి పలువురు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో హుజూర్ నగర్‌లో భారీగా ఓట్లు వచ్చాయి. దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు అంతా ముందుకు వస్తున్నారు. హుజూర్‌నగర్‌లో గతంలో ఎమ్మెల్యే పార్టీ మారినా కార్యకర్తలు మారలేదు. కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి. హుజూర్ నగర్ నియోజకవర్గంలో అనామకుడైన సైదిరెడ్డిని గెలిపించాం. 2023 శాసన సభ ఎన్నికల్లో ఓడిపోగానే పార్టీని వదిలిపెట్టి పోయారు. హుజూర్ నగర్‌లో దుర్మార్గమైన కాంగ్రెస్ వైఖరిని బీఆర్ఎస్ శ్రేణులు పోరాట స్ఫూర్తితో ఎదుర్కొంటున్నారు. సైదిరెడ్డి ఆయన సొంత ఊరులో సర్పంచ్‌ని గెలిపించుకోలేక పోయారు. ఆనాడు జలదృశ్యంలో గులాబీ జెండా ఎగిరింది. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ జెండా ఎగిరి 25 యేండ్లు పూర్తి చేసుకొని 26 వసంతంలోకి అడుగుపెడుతోంది. దేశంలో ఏ పార్టీకి లేని విశిష్టత ఒక్క బీఆర్ఎస్ పార్టీకే ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి ఐడెంటిటీ క్రైసిస్ ఉంది.. అందుకే కేసీఆర్‌ను విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి పేరును ఎవరూ గుర్తు పెట్టుకోవడం లేదు. రేవంత్ పేరు చెప్పాలంటేనే మొహం తిప్పుకుంటున్నారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది. ఒక్కొక్క కాంగ్రెస్ నేత కమల్‌హాసన్‌ను మించి యాక్టింగ్ చేస్తున్నారు. వంద రోజుల్లోనే గ్యారెంటీలు అమలు చేస్తామని నమ్మించారు. బాండ్లు పేపర్లు రాసి, దేవుడి మీద ఒట్టు వేశారు. 420హామీలు, 13 డిక్లరేషన్లు ఏమయ్యాయి?. మాటలు ఆకాశన్నంటాయి.. చేసింది మాత్రం సున్నా.. కాంగ్రెస్‌కు ఓటేసి తప్పు చేశామని నల్గొండ రైతులు చెబుతున్నారు'అని తెలిపారు.

## పాక్ ప్రధానితో ఇరాన్ ఫోన్ కాల్..



ఇస్లామాబాద్: ఇరాన్, అమెరికా మధ్య చర్చల సందర్భంగా హైడ్రామా చోటుచేసుకుంది. చర్చల కోసం పాకిస్థాన్ వెళ్లిన ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికా ప్రతినిధులు రాకముందే ఒమన్ బయల్దేరి వెళ్లిపోయారు. దీంతో శాంతి చర్చలకు తన ప్రతినిధులను ఇస్లామాబాద్‌కు పంపించడం లేదని ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో అమెరికాతో శాంతి చర్చలపై అనిశ్చితి నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక కామెంట్స్ చేశారు. పెజెష్కియాన్ తాజాగా పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన శాంతి చర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. అలాగే, ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని స్పష్టం చేశారు. ప్రస్తుత ఉద్రిక్తతలకు అమెరికానే కారణమని పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న చర్యలే చర్చలకు ప్రధాన అడ్డంకి ఆయన కుండబద్దలు కొట్టారు. కాగా, ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం వల్ల ఇరాన్ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి దిగ్బంధనాల నడుమ పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరించడం అసాధ్యమని పేజెష్కియాన్ వెల్లడించారు. అందుకే ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలంటే ముందుగా అమెరికా ఆంక్షలను తొలగించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయిన తర్వాత ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఇప్పటికే తాము ఒక ఫ్రేమ్ వర్క్‌ను పాకిస్తాన్?కు అందించామని తెలిపారు. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఇది ఒక మంచి మార్గమని ఆయన చెప్పారు. అయితే, శాంతి చర్చలపై అమెరికాకు నిజంగా ఆసక్తి ఉందా? అన్నది అనుమానమేనని ఆయన చెప్పుకొచ్చారు. ప్రస్తుతం అబ్బాస్ అరాగ్చీ ఒమన్ పర్యటనలో ఉన్నారు. అయితే, చర్చల కోసం ఆయన తిరిగి పాకిస్తాన్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తున్నాయి.

## పార్టీని వీడిని ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలి

### – రాజ్యసభ ఛైర్మన్‌కు ఆప్ వినతి



న్యూఢిల్లీ : అశోక్ కుమార్ మిట్టల్, రాఘవ్ చద్దాతోపాటు ఏడుగురు ఆప్ ఎంపీలు బిజెపిలో వీలైనమనట్లు శుక్రవారం ప్రకటించారు. తాజాగా ఈ ఎంపీలందరిపై అనర్హత వేటు వేయమని ఆప్ ఎంపి సంజయ్ సింగ్ ఆదివారం రాజ్యసభ ఛైర్మన్ సి. పి రాధాకృష్ణన్ కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఇటువంటి ఫిరాయింపులు ముఖ్యంగా పంజాబ్‌లో ప్రజల తీర్పుకు ద్రోహం చేయడమే కాకుండా, రాజ్యాంగ స్ఫూర్తికి కూడా విరుద్ధమని– ఆయన ఆరోపించారు. పార్టీని వీడిన ఏడుగురిలో ఆరుగురు పంజాబ్ కు చెందినవారే. ఈ విషయంపై సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, మాజీ లోక్‌సభ సెక్రటరీ జనరల్ సహా రాజ్యాంగ నిపుణులను ఆప్ సంప్రదించింది. చట్టం ప్రకారం బిజెపిలో విలీనమైన ఈ ఎంపీలు అనర్హతకు గురవుతారని వారు స్పష్టం చేశారు. ఈ సభ్యులు ఆమ్ ఆద్మీ పార్టీ చేత ఎన్నికై, ఆ తర్వాత పార్టీని వీడి మరో పార్టీలో చేరారు. ఇది పంజాబ్ ప్రజలకు, అలాగే భారత రాజ్యాంగానికి చేసిన ద్రోహం," అని ఆయన అన్నారు.

# ఫిరాయింపుతో పునీతులు!



కమలం పార్టీ పాలనలో సాగుతున్న ఫిరాయింపులతో ప్రజాస్వామ్యం పరిహాసం పాలవుతోంది. ఇడి, సిబిఐ వంటి కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు దాడులు చేయడం...నిందితులుగా ఆరోపించబడినవారు ఆ తరువాత అధికార పార్టీలో చేరి తమ పంకిలాన్ని కడిగేసుకుని 'పునీతుల'వుతున్నారు. ఆ క్రమంలో తాజాగా ఆప్ రాజ్యసభా పక్షం విలీనం సంభవించింది. రాఘవ్ చద్దా దుర్బుద్ధిని గమనించిన ఆప్ ఆయనను రాజ్యసభలో డిప్యూటీ లీడర్ పదవి నుంచి తప్పించింది. దాంతో రాఘవ్ చద్దా ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు ఆప్‌లో చాలా కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయని హెచ్చరించడం ఈ పరిణామాలకు సూచిక. డిప్యూటీ లీడర్ పదవిని పొందిన అశోక్ కుమార్ మిట్టల్ నివాసంలోనూ ఆయన సంస్థ (లవ్లీ యూనివర్శిటీ)కి సంబంధించిన తొమ్మిది ప్రదేశాలలో ఈ నెల 15న ఇడి సోదాలు నిర్వహించింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఎఫ్ఇఎంఎ) కింద మిట్టల్, ఆయన కుమారుడిపై మనీ లాండరింగ్ కేసులో దర్యాప్తు చేస్తున్నామన్నారు. సరిగ్గా పది రోజులు తరువాత ఆయన సహా ఏడుగురు ఎంపీలు ఆప్‌కు రాజీనామా చేసి బిజెపిలో చేరారు. గత కొంత కాలంగా ఆప్‌తో విభేదిస్తున్న ఆ పార్టీ ఎంపీ స్వాతి మాలివాల్ ఒంటరిగా బయటకు వస్తే పదవి పోతుందని భావించి వేచి చూసి ఇప్పుడు వారితో చేతులు కలిపారు. మిట్టల్ పై గానీ ఈ ఏడుగురికి సంబంధించిన వారెవరిపైనా ఇక కేంద్ర దర్యాప్తు సంస్థల నీడ కూడా పడదు. కమల తీర్థం పుచ్చుకోవడంతోనే వారంతా పునీతులైపోతారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి పూరీ వంటి అనేక మంది ఈ బాపతు ఫిరాయింపుదారులే కదా! అయితే ఫిరాయింపులవంటి వక్ర మార్గాల్లో అధికారాన్ని నిలబెట్టుకున్నప్పటికీ వారు ప్రజల ముందు పలుచన కాక మారరు. ఆప్ రాజ్యసభ సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది రాజ్యాంగ నిబంధనల ప్రకారం బిజెపిలో విలీనం అవుతున్నామని చెప్పడంతోపాటు రాఘవ్ చద్దా ప్రధాని నరేంద్రమోడీపై ప్రశంసలు కురిపించడం షరా మామూలే! ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఏ పార్టీకి చెందిన సభ్యులైనా వ్యక్తిగతంగా రాజీనామా చేసి వేరే పార్టీలో చేరితే వారి పదవి పోతుంది కాని, పార్టీకి చెందిన మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది మరో పార్టీలో విలీనమైతే వారిపై అనర్హత వేటు పడదు. రాజ్యసభలో ఆప్‌కు మొత్తం పది మంది సభ్యులుండగా, అందులో ఏడుగురు బిజెపిలోకి ఫిరాయించడంతో తమ ఎంపి పదవులను కాపాడుకోవడంతోపాటు బిజెపికి రాజ్యసభలో బలం పెంచారు. ఆ విధంగా బిజెపి బలం పెరగడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలు సహకరించాయన్నమాట. ఫిరాయించిన ఏడుగురిలో ఆరుగురు పంజాబ్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నవారే. మరో పది నెలల్లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో అక్కడి ఆప్ ప్రభుత్వానికిది పెద్ద రాజకీయ సవాలుగా మారింది. పంజాబ్ ప్రజలకు బిజెపి మరోసారి వెన్నుపోటు పొడిచిందన్న ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాటలు అక్షర సత్యాలు. గతంలో మాజీ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ వంటి ఫిరాయింపుదార్లను ముందుపెట్టినా బిజెపికి పరాభవం తప్పలేదు. ఇప్పుడూ పంజాబ్ ప్రజలు అలాగే వ్యవహరించక మానరు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతిపక్ష పార్టీల నేతలపై ఇడి, సిబిఐ, ఐటి, ఎన్ఐఎ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి, తద్వారా ఆయా నేతలను తమ పార్టీలో చేర్చుకోవడం బిజెపికి అలవాటుగా మారింది. అలా కాకపోతే ఆయా ప్రాంతీయ పార్టీలను చీల్చి వారే వేరు కుంపటి పెట్టుకున్నట్టు నటింపజేస్తుంది. 2014 నుంచి ఎన్నికల్లో ప్రజల ఓట్లతో తాను నేరుగా గెలవలేని రాష్ట్రాల్లో బిజెపి అనుసరిస్తున్న కుటిల నీతి ఇదే! ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించే ఇటువంటి దుర్విధానాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలి. కమలనాథుల కుట్రలను వమ్ము చేయాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి!

# ఒఆర్ఆర్ ఒత్తిళ్లు !



రాజధాని నిర్మాణం, పట్టణాభివృద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఒత్తిళ్లకు గురి చేయడం సబబు కాదు. అమరావతి కోసం తొలి దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు డెవలప్ చేసిన ప్లాట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. భూ యజమానులకు కౌలు, పేదలకు పింఛన్లు సరిగా అందడం లేదు. ఇబ్బందులిలా వుండగానే ఏలినవారు రెండవ దశ, అనంతరం మరింత విస్తరించడానికి భూములు సమీకరిస్తామని ఊరూరా తిరుగుతుంటే అన్నదాతల గుండెలు గుభిల్లుమంటున్నాయి. ఇప్పుడది చాలదన్నట్టు 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 189 కిలోమీటర్ల పొడవున 250 మీటర్ల వెడల్పుతో ఔటర్ రింగురోడ్డు (ఒఆర్ఆర్) నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా ఒఆర్ఆర్ నిర్మిస్తామంటూ అక్కడి భూయజమానులతో ఇటీవల అధికారులు చెప్పగా ఇప్పటికే మూడు సార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామనీ, ప్రభుత్వానికి ఇంకెన్నిసార్లు భూములివ్వాలని రైతులు అభ్యంతరం తెలపడాన్ని ఎవరూ తప్పుబట్టలేరు. దేశంలో అనేక ముఖ్య నగరాల్లో ఒఆర్ఆర్, జాతీయ రహదారులు 70 మీటర్ల వెడల్పుతో నిర్మించగా అమరావతి రింగురోడ్డును 250 మీటర్ల వెడల్పుతో నిర్మించే ప్రతిపాదన సరి కాదు. రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఎఐ) డిపిఆర్ కూడా సిద్ధం చేసి, ముందుకు పోతుండడం దారుణం. ఒఆర్ఆర్ ప్రతిపాదిస్తున్న మండలాలు, గ్రామాల పరిధిలో భూములు చాలా విలువైనవి. రైతులు, కూలీల జీవనం వాటిపైనే ఆధారపడి ఉంది. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయల నుండి రెండుకోట్ల వరకూ ఉంటుంది. భూములు కోల్పోయే రైతులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా కొన్ని గ్రామాల్లో సచివాలయాల ముందు భూముల సేకరణకు సంబంధించి సర్వే నెంబర్లు, ఎల్‌పి నెంబర్లు సేకరించే భూమి విస్తీర్ణం వంటి వివరాలతో నోటీసులు అతికించారు. ఇందులో ఏ రైతు భూమిని ఎంత విస్తీర్ణం ప్రభుత్వం సేకరించబోతోంది వంటి వివరాలు రైతుల వారీగా లేకపోవడం చట్ట విరుద్ధం. ప్రభుత్వం పత్రికల్లో చేసిన ప్రకటన, సచివాలయాల్లో వేలాడదీసిన పత్రాలు పారదర్శకంగా లేకపోవడంతో రైతులు భయాందోళనల్లో ఉన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి సామాజిక ప్రభావ అంచనా వివరించి రైతులు, ప్రజల సమ్మతి పొందడం అవసరం. అటువంటి చట్టబద్ధమైన ప్రక్రియ అమరావతి ఔటర్‌రింగురోడ్డు ప్రతిపాదిత గ్రామాల్లో ఇప్పటి వరకూ ఎక్కడా చేపట్టకపోవడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల రేటుకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్న రైతుల కోర్కె ఎంతో సమంజసమైనది. ఆ ప్రాంతం అభివృద్ధి చెందితే భూముల విలువలు ఎంతగానో పెరుగుతాయని భూ సమీకరణకు రైతులను అంగీకరింపజేయడానికి చెప్పిన ఏలికలు ఆ రైతులకు ఇప్పటి మార్కెట్ విలువనైనా పరిహారంగా చెల్లించాలి కదా! ఒఆర్ఆర్‌లో భూమి కోల్పోతున్న ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 71 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కొత్తగా జాతీయ రహదారి వేయాలనుకున్న ప్రాంతం కృష్ణానది బఫర్‌జోన్లో ఉందని, గతంలో వరదలు వచ్చిన సమయంలో పెద్దఎత్తున ముంపునకు గురయ్యాయని, నీటి ఒత్తిడి కూడా ఎన్‌టిఆర్ జిల్లావైపు ఉంటోందని, వరదలు వచ్చిన సమయంలో నష్టం ఎక్కువగా ఉండటంతోపాటు రోడ్డుకు దక్షిణభాగంలో ఉండే గ్రామాలన్నీ మునిగిపోతాయని ధర్మాసనం ఎదుట మొరపెట్టుకున్నారు. అన్నదాతల వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన పూర్తి వివరాలు కోర్టుకు సమర్పించాలని ఆర్అండ్‌బి, జలవనరులు, ఎన్‌హెచ్‌ఎఐ అధికారులను ఆదేశించింది. అభివృద్ధి పేరిట భారీగా భూములు గుంజుకుంటున్న ప్రభుత్వం ఇప్పటికైనా విచక్షణతో వ్యవహరించడం అవసరం. ఒఆర్ఆర్ ను 70 మీటర్లకే పరిమితం చేయడం విజ్ఞతగా ఉంటుంది. భూమి కోల్పోయే రైతులను, నష్టపోయే ప్రజలను భాగస్వాములను చేసి వారి ఆమోదంతోనే ముందుకు వెళ్లడం అన్ని విధాలా మంచిది.

# రాష్ట్రంలో కర్కోటకుడి పాలన


హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) పేరిట కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం కొత్త పార్టీ పేరు, జెండా, ఎజెండాపై కవిత ప్రసంగించారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పి సామాజిక రథ చక్రం విరిగి ముక్కలైందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఆత్మను కోల్పోయిందని, కేసీఆర్ మన మనిషిలా కాకుండా 'మర మనిషి'లా తయార య్యాడన్నారు. బీఆర్ఎస్ కుటుంబ పాలనలో తాను భాగస్వామిగా ఉండటం పట్ల క్షమాపణలు కోరారు. తన తప్పును సరిదిద్దుకునేందుకు కొత్త పార్టీతో ప్రజల ముందుకొస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కుటుంబ పాలన, బంధుప్రీతి, అవినీతి, అవినీతిపై పాంచజన్యం పూరిస్తున్నట్లు కవిత ప్రకటించారు. ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే...

### ఈనాటి కేసీఆర్ మర మనిషి..

'గుంటనక్కలు, తోడేళ్ల నడుమ ఖైదీ అయిన కేసీఆర్ ఇప్పుడు మన మనిషి కాదు.. మారిన మనిషి, ఆత్మలేని మర మనిషి. ప్రజలకు కష్టాలు వచ్చినా ఆ సారు.. రారు. గుంటనక్కలు, తోడేళ్ల నడుమ బందీ అయ్యారు. తెలంగాణ ప్రజలను పట్టించుకోకుండా జాతీయ పార్టీ అంటూ పంజాబ్, గుజరాత్, బిహార్‌కు వెళ్లారు. కేసీఆర్‌కు తెలంగాణ వచ్చిన తర్వాత అధికారం ముందు ప్రజల మీద మమకారం పోయిందా. కేసీఆర్ నాకు తండ్రి అయినా రాజకీయ పరిణతి కోల్పోయి మాట్లాడుతున్నారు, కేటీఆర్‌కు పెద్దగా ఏమీ తెలియదు. ప్రజలు తప్పు చేశారని అంటున్న కేసీఆర్.. రాష్ట్రంలో కర్కోటకుడి పాలన నడుస్తున్నా బయటకు రావడం లేదు. నా ప్రశ్నలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పకపోతే ప్రజలే మిమ్మల్ని బయటకు లాగి చెప్పిస్తారు.

### ఉద్యమకారులకు జరిగిందే నాకు జరిగింది

'నాడు ఉద్యమకారులకు జరిగిందే.. ఇప్పుడు నాకు జరిగింది. కేసీఆర్ కోసం ఇళ్లు, భూములు అమ్ముకున్న వాళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు. మనల్ని లాఠీలతో కొడితే తల్లి కోడిలా కాపాడుకోవాల్సిన కేసీఆర్ ఎక్కడ పోయిండు. అవినీతి పేరిట నన్ను సస్పెండ్ చేసి అవినీతి చేసిన పందికొక్కులను పక్కన పెట్టుకున్నారు. అందుకే కేసీఆర్‌కు ఎదురు నిలిచి కొట్లాడేందుకు పార్టీతో వస్తున్నా. ఇక ముందున్నది ముసళ్ల పండుగ. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల కలలు నిజం కాలేదు. రాజకీయ శక్తితో ప్రజాపోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణను సాధిస్తాం. బీఆర్ఎస్ అనే పార్టీ తెలంగాణ ఆత్మ కోల్పోయింది. అందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. తెలంగాణలోని మూడున్నర కోట్ల మందికి ఒక అమ్మలాగా పరిణితి చెందాలని అనుకుంటున్నా.



### రాష్ట్రంలో కర్కోటకుడి పాలన

రాష్ట్రంలో ఒక కర్కోటకుడి పాలన నడుస్తోంది. వెలుగుమట్లలో అనుమతులు ఉన్న ఇళ్లను కూలగొడితే గర్భిణికి అబార్షన్ అయింది. గురుకులాల్లో విషం పెట్టి పిల్లలను చంపితే సీఎం పట్టించుకోవడం లేదు. కర్ల రాజేశ్ మృతికి కారకులపై హోంమంత్రిగా ఉన్న సీఎం రేవంత్ కేసులు కూడా పెట్టించలేకపోయారు. కాంగ్రెస్ మీద కచ్చితంగా మనమే పోరాటం చేస్తాం. ఇప్పుడు మనమే ప్రధాన ప్రతిపక్షం. రెండేళ్ల తర్వాత అధికారంలోకి వస్తాం. రాహుల్‌ను ప్రధాని చేసేందుకు కాంగ్రెస్, పెద్దసారును ఫామ్‌హౌజ్‌కు పరిమితం చేసి చిన్నసారును సీఎం చేసేందుకు బీఆర్ఎస్, దేశంలో సామాజిక న్యాయాన్ని ఖతం చేసేందుకు బీజేపీ పనిచేస్తున్నాయి. తెలంగాణ రావడం ఇష్టంలేని బీజేపీ రాష్ట్ర ఏర్పాటును భారత్ పాక్ విభజనతో పోలుస్తున్నా రాష్ట్ర బీజేపీ బానిస ఎంపీలు మాట్లాడటం లేదు.

### పాంచజన్యం పూరిస్తున్నా..

తెలంగాణ రాష్ట్ర సేన ఐదు అంశాలపై పాంచజన్యం పూరిస్తోంది. ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తాం. ఊరికో బడి, తరగతికో ఉపాధ్యాయుడు ఉండేలా చూస్తా. మీ అమ్మలా జేబు చూడకుండా కడుపు చూస్తా. ప్రభుత్వ కార్యాలయాల్లో రైతులను గౌరవించే వ్యవస్థ ఉంటుంది. యువతకు రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు ఉపాధి కోసం ఆర్థిక సాయం అందిస్తా. అధికారంలోకి వస్తే ఒకే నోటిఫికేషన్ ద్వారా 4 లక్షల ఉద్యోగాలు, ఉద్యమకారుల కోసం లక్ష సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టిస్తాం. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం పనిచేస్తాం' అని కవిత చెప్పారు.

### పసుపు.. నీలం.. ఆకుపచ్చ

కల్వకుంట్ల కవిత శనివారం తన కొత్త పార్టీ పేరుతోపాటు జెండాను కూడా ఆవిష్కరించారు. పార్టీ జెండాలో పసుపు, నీలం, అకుపచ్చ రంగుల్లో పార్టీ జెండా మధ్యలో తెలంగాణ భౌగోళిక చిత్రపటం పొందు పరిచారు. జెండా మధ్యలో ఇంగ్లిషు అక్షరాల్లో టీఆర్ఎస్ పేరును చేర్చారు. సుమారు 50 నిమిషాలపాటు కవిత ప్రసంగం సాగింది. కార్యకర్తలు ఇచ్చిన పాంచజన్యం (శంఖం)ను పూరించారు. సభలో పాల్గొనేందుకు వచ్చిన వారు ఏఐ టెక్నాలజీ సాయంతో గ్రీన్‌మ్యాట్‌పై కవితతో కలిసి ఉన్నట్లుగా ఫొటోలు దిగారు. కవిత కుమారుడు ప్రజల మధ్య కూర్చొని తల్లి ప్రసంగాన్ని ఏకాగ్రతతో వింటూ కనిపించారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు, సింగరేణి కార్మికులు సహా అన్నీ వర్గాల ప్రజలు ముఖ్యంగా మహిళలు, యువత నడుమ సభ ఉత్సాహభరితంగా సాగింది. 'టీ' ఆకారంలో ఏర్పాటు చేసిన సభా వేదిక ప్రజలను ఆకర్షించింది. సభకు వచ్చిన ప్రతినిధులకు తెలంగాణ వంటకాలతో భోజనాలు పెట్టారు.

నినాదం

# రోజూ ఈ జ్యూస్ తాగితే ఇన్ని లాభాలా..? ఇప్పటికైనా అలవాటు చేసుకోండి..!



జీర్ణ సమస్యలతో బాధపడేవారికి పైనాపిల్ జ్యూస్ చాలా మేలు చేస్తుంది. మీరు అతిసారం, కడుపు నొప్పి, మలబద్ధకం లేదా ఉబ్బరంతో బాధపడుతుంటే, పైనాపిల్ రసం మీకు సరైనది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పండులో లభించే కాల్షియం, మెగ్నీషియం, ఇతర పోషకాలు పైనాపిల్స్‌లో తగినంత పరిమాణంలో కనిపిస్తాయి. ఇది ఎముకలు, దంతాలను బలపరుస్తుంది. పైనాపిల్ రసంలో పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి.



ముఖ్యంగా మాంగనీస్, కాపర్, విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలన్నీ ఎముకల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, గాయం నయంకావటం, శక్తి ఉత్పత్తి చేయటానికి, కణజాల సంశ్లేషణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.ఇందులో ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, జింక్, కోలిన్, విటమిన్లు కె, బి కూడా ఉంటాయి. పైనాపిల్ యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి అద్భుతమైన మూలం. ఇది గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. పైనాపిల్ జ్యూస్ తాగడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. పైనాపిల్ రసంలో విటమిన్ ఎ లభిస్తుంది. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పిల్లలకు పైనాపిల్ జ్యూస్ ఇవ్వడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. అనేక రకాల క్యాన్సర్‌తో పోరాడవచ్చు.. బ్రోమెలైన్ జీర్ణక్రియ, గుండె ఆరోగ్యంతో పాటు అనేక రకాల క్యాన్సర్‌ల నుండి మిమ్మల్ని కాపాడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆస్తమా లక్షణాలను కూడా తగ్గించవచ్చు. పైనాపిల్ రసం ఉబ్బసంతో ఇబ్బంది పడేవారికి కూడా మేలు చేస్తుంది. పైనాపిల్ జ్యూస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది మీ శరీరాన్ని డ్యామేజ్ నుండి, ఇతర వ్యాధుల నుండి కాపాడుతుంది. ఇందులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్‌ల సమూహం కూడా ఉంటుంది. ఇది వాపును తగ్గిస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

# అవిసె గింజలతో ఆరోగ్యమే కాదు.. ఇలా వాడితే మెరిసే అందం మీ సొంతం!




మన శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలు అవిసె గింజల్లో ఉన్నాయి. కొలెస్ట్రాల్, డయాబెటిస్, ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్నవారు, ప్రతిరోజూ అవిసె గింజలతో చేసిన ఆహారాన్ని తినడం వల్ల వాటిని అదుపులో ఉంచుకోవచ్చు. మన శరీరానికి ఎంతో అత్యవసరమైన ఒమేగా త్రీ ఫ్యాటీ ఆమ్లాలు అవిసె గింజల్లో ఉంటాయి. ఇవి పిల్లలకు, పెద్దలకు, గర్భిణులకు చాలా అవసరం. అవిసె గింజలతో చేసుకుంటే రోజుకో లడ్డును తినవచ్చు. ఇది శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఫేస్ ప్యాక్: ఒక టీస్పూన్ అవిసె గింజలను కప్పు నీటిలో వేసి అరగంట పాటు నానబెట్టాలి. తర్వాత చిన్న మంటమీద నీరంతా జెల్‌గా మారేవరకు ఉడికించాలి. చల్లారిన తర్వాత జెల్‌ను ముఖానికి పట్టించాలి. కాసేపటి తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. రోజుకు ఒకసారి ఈ ప్యాక్ వేసుకుంటే చర్మంపై ఉన్న వాపు, మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. రోజ్ వాటర్‌తో: అవిసెలను నీళ్లలో నానబెట్టి మిక్సీలో వేసి పేస్టులా చేసుకోవాలి. ఆ పేస్టులో రోజ్ వాటర్ కలిపి ముఖానికి పట్టించాలి. ఇలా చేయడం వల్ల అవిసె గింజల్లో ఉన్న పోషకాలు చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తాయి. స్క్రబ్ గా ఉపయోగపడుతుంది: చర్మంలో ఉండే మృత కణాలను తొలగించి చర్మాన్ని తాజాగా ఉంచడానికి అవిసె గింజల పొడి మంచి స్క్రబ్‌గా ఉపయోగపడుతుంది. ఇందుకోసం ఒక కప్పులో అవిసె గింజల పొడి, ఒక టేబుల్ స్పూన్ తేనె వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకుని పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. ఇలా చేస్తే చర్మం తాజాగా మారుతుంది. జుట్టు ఆరోగ్యానికి: ఒక టీస్పూన్ అవిసె గింజల పొడిని చిన్న గిన్నెలో వేసి, ఒక గుడ్డును కొట్టి ఆ పొడిలో వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి, జుట్టుకు రాసుకుని అరగంట తర్వాత స్నానం చేయాలి. ఇలా చేస్తే జుట్టు మెరుస్తుంది. చర్మం కాంతిమంతంగా మారుతుంది.


# 30 ఏళ్లు వచ్చేసరికి.. పురుషుల్లో వచ్చే అనారోగ్య సమస్యలు ఇవే!



సాధారణంగా వయసు పెరిగే కొద్దీ.. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. ఇవి చాలా కామన్ విషయం. కానీ ఇప్పుడున్న రోజుల్లో చిన్న పెద్దా అనే వయసుతో సంబంధం లేకుండా అన్ని రకాల వ్యాధులు వస్తున్నాయి. వీటి పట్ల మొదట్లోనే జాగ్రత్తలు తీసుకోకపోతే.. చిన్న సమస్యలు కాస్తా పెద్ద సమస్యలుగా మారుతున్నాయి. అయితే ఆడవారి కంటే పురుషులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఉంటారు. అస్సలు పట్టించుకోరు. అనారోగ్య సమస్యల లక్షణాలు కనిపించినా కేర్ చేయరు. ఆ తర్వాత ఆస్పత్రి పాలవ్వాల్సి వస్తుంది. ఇటీవల జరిగిన సర్వేల ప్రకారం.. 30 ఏళ్లు దాటిన పురుషుల్లో కొన్ని రకాల హెల్త్ ప్రాబ్లమ్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయట. వీటిని ప్రారంభంలో గుర్తించకపోతే.. చివరికి ప్రాణాల మీదకే వస్తుంది. ఇంతకీ పురుషులకు 30 ఏళ్లు దాటాక వచ్చే సమస్యలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఎముకలు బలహీనం: 30 ఏళ్లు వచ్చిన తర్వాత పురుషుల్లో ఎముకలు బలహీనంగా మారతాయి. ఈ వయసులో ఆహారం విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే.. శరీరంలో విటమిన్ డి, క్యాల్షియం లోపం ఏర్పడుతుంది. దీంతో కీళ్ల నొప్పులు, ఎముకలకు సంబంధించిన సమస్యలు రావచ్చు. కాబట్టి 30 ఏళ్ల వయసులో పురుషులు ఖచ్చితంగా క్యాల్షియం ఉండే ఆహారం తీసుకోవాలి. అలాగే వ్యాయామం కూడా చేయాలి. గుండె జబ్బులు: ప్రస్తుత కాలంలో ఉన్న ఆహారపు అలవాట్ల కారణంగా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ అనేది విపరీతంగా పెరిగిపోతుంది. ఈ కొలెస్ట్రాల్ కారణంగా గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. మీ లైఫ్ స్టైల్‌లో ఖచ్చితంగా మార్పులు చేసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. బరువు పెరగడం: పురుషులకు 30 ఏళ్లు దాటాక.. బరువు అనేది పెరుగుతూ ఉంటారు. ఒత్తిడి, సరైన వేళకు సరైన ఆహారం తీసుకోకపోవడం వంటి కారణాల వల్ల బరువు అనేది పెరిగిపోతారు. ఈ సమయంలో మీరు మీ శరీరంపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలి. వ్యాయామాలు, వాకింగ్ వంటివి చేయడం వల్ల ఒత్తిడి, బరువు తగ్గుతాయి. క్యాన్సర్: పురుషులకు 30 ఏళ్ల వయసులో ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మూత్రంలో మంట, వృషణాల్లో నొప్పి, యూరిన్ సమస్యలు, ఇన్ ఫెక్షన్లు రావచ్చు. మీరు ఈ సమస్యలతో ఇబ్బంది పడితే టెస్టులు చేయించుకోవడం అవసరం.

# షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచే దివ్యాస్త్రాలు.. ఈ 5 జాగ్రత్తలు తప్పనిసరి!






డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఏడాది పొడవునా బ్లడ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచుకోవడం సవాలుతో కూడుకున్న విషయం. ముఖ్యంగా వేసవిలో షుగర్ లెవెల్స్‌ను తగ్గించుకోవడం అంత సులువు కాదు. అందుకే డయాబెటిక్ రోగులందరికీ వేసవి కష్టకాలంతో సమానం. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో మీ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చంటున్నారు నిపుణులు. వోక్‌హార్డ్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ మీరా.. డయాబెటిక్ రోగులను వేసవి ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. సాధారణంగా అధిక వేడి వల్ల అలసట, డీహైడ్రేషన్ వంటి కారణాల వల్ల రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడం కష్టతరం అవుతుంది. అందుకే మధుమేహం ఉన్నవారు వేసవిలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే మధుమేహం ఉన్నవారు తమ శరీరంలోని నీటిని త్వరగా కోల్పోతారు. దీంతో సులభంగా నిర్జలీకరణానికి గురవుతారు. పైగా తక్కువ నీరు తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. దీంతో రక్తనాళాలు, నరాల దెబ్బతినడం వంటి కొన్ని మధుమేహం సమస్యలు స్వేద గ్రంధులపై ప్రభావం చూపుతాయి. పైగా శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. ఇది హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్‌కు కారణమవుతుంది. ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతాయి. అందుకే వేసవిలో షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవాలి. వేసవిలో మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ కింది జాగ్రత్తలు తీసుకుంటే హాయిగా ఉండొచ్చు. ఔ వేసవిలో మధుమేహాన్ని నియంత్రించడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలు వీలైనంత హైడ్రేటెడ్‌గా ఉండాలి వేసవి కాలంలో అధిక వేడికారణంగా చెమట ద్వారా ఎక్కువ నీటిని కోల్పోతారు. ఇది నిర్జలీకరణానికి దారితీస్తుంది. నిర్జలీకరణం రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడానికి దారితీస్తుంది. అందుకే ఈ కాలంలో నీరు ఎక్కువగా తాగాలి. తద్వారా డీహైడ్రేషన్‌ను నివారించవచ్చు. కానీ చక్కెర కలిపిన తీపి పానీయాలకు దూరంగా ఉండాలి. ఆల్కహాల్ కెఫిన్ వద్దు ఆల్కహాల్, కెఫిన్ ఆధారిత పానీయాలు నిర్జలీకరణానికి దారితీస్తాయి. ఎందుకంటే ఇవి అధిక మూత్రవిసర్జనకు కారణం అవుతాయి. ఈ పానీయాలు శరీరంలో నీటిని కోల్పోవడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడానికి దారితీస్తాయి. కాబట్టి అలాంటి డ్రింక్స్ తీసుకోవడం తగ్గించాలి. రక్తంలో చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి వేసవిలో రక్తంలో చక్కెర స్థాయిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. వేడి వాతావరణంలో హృదయ స్పందన రేటు పెరిగి, అధిక చెమటలు పట్టవచ్చు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుంది. అందుకే ఈ కాలంలో ఇన్సులిన్ మోతాదును మార్చుకోవాలి. ఇన్సులిన్ మోతాదును మార్చాలనుకుంటే వైద్యుడిని సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. శారీరకంగా చురుకుగా ఉండాలి శారీరకంగా చురుకుగా ఉండటం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు. ఈ కాలంలో యాక్టివ్‌గా ఉండటానికి ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయాలి. ఇలాంటి చిన్నపాటి వ్యాయామాలు చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలో హెచ్చుతగ్గులు వస్తాయి. అందుకే వ్యాయామాలు చేసే ముందు, పూర్తి చేసిన తర్వాత దాన్ని పరీక్షించుకోవాలి. ఎండలో బయటకు వెళ్లకపోవడం బెటర్ రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడానికి వేసవి ఎండల నుంచి మిమ్మల్ని మీరు వీలైనంత ఎక్కువగా రక్షించుకోవాలి. వడదెబ్బ శరీరాన్ని ఒత్తిడికి గురి చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ఒకవేళ తప్పనిసరైతే చర్మానికి సన్ స్క్రీన్ రాసుకోవడంతోపాటు వడదెబ్బను నివారించడానికి టోపీ, సన్ గ్లాసెస్, గొడుగుతో బయటకు వెళ్లాలి. అలాగే, శరీరంలోని బహిర్గత భాగాలను కవర్ చేసేలా చూసుకోవాలి.

# గుట్టలాంటి పొట్టకు ఛూమంత్రం..





గసగసాలులో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మసాలా దినుసు గసగసాలు యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉన్నాయి. వీటిని రాగి, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, ఫైబర్, మాంగనీస్ గొప్ప మూలంగా పరిగణిస్తారు. గసగసాలు అనేక వ్యాధుల నుండి రక్షించడంలో సాయపడతాయి. నాడీ వ్యాధులు, మధుమేహం, గుండె జబ్బులు వంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలోగసగసాలుఉపయోగపడతాయి.ఇంకాఎసిడిటీ, మలబద్ధకం సమస్య నుంచి కూడా ఉపశమనం కలిగిస్తాయి. గసగసాలు.. బరువు తగ్గించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటాయి. పొట్ట, నడుము చుట్టూ కొవ్వు పెరగడం వల్ల మీరు ఇబ్బంది పడుతుంటే గసగసాలు తీసుకోవడం చాలా మంచిది.. ఎందుకంటే ఇందులోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్‌లు బరువు తగ్గడానికి సహకరిస్తాయి. గసగసాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. రోజువారీ ఆహారంలో గసగసాలు చేర్చుకుంటే.. కొన్ని రోజుల్లోనే మార్పు వస్తుంది. ఇంకా గసగసాల సిరప్‌ను మార్కెట్ నుంచి కొనుగోలు చేసి, దానిని షర్బత్‌గా చేసుకుని తాగవచ్చు.ఇదితీసుకోవడం వల్లఎక్కువసేపు ఆకలిగా అనిపించకుండా చేస్తుంది. దీంతో బరువు క్రమంగా తగ్గుతుంది.గసగసాలు, పాలు కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. దీని వినియోగం వల్ల కండరాలు, ఎముకలు బలపడతాయి. ఒక గ్లాసు పాలలో 1టేబుల్ స్పూన్ గసగసాలు వేసిమరిగించి గోరువెచ్చగా ఉన్నప్పుడు త్రాగాలి.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీళ్లు తాగితే ఏమవుతుందో తెలుసా..?



కొత్తిమీర నీరు ఎసిడిటీ, పిత్తాను తగ్గించడంలో చాలా మేలు చేస్తుంది. కొత్తిమీరలోని గుణాలు పొట్టకు మేలు చేస్తాయి. కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపులో యాసిడ్ స్థాయి తగ్గుతుంది. ఎసిడిటీ వల్ల వచ్చే మంట, నొప్పి తగ్గుతుంది. కొత్తిమీరలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది అసిడిటీ వల్ల వచ్చే సమస్యలను తగ్గిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపు సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కొత్తిమీర నీరు మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. కొత్తిమీరలో అధిక పీచు ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొత్తిమీర గింజలలో ఉండే థైమోల్ అనే పదార్థం మలబద్ధకం నుండి ఉపశమనం కలిగించే జీర్ణ రసాల స్రావాన్ని పెంచుతుంది. అలాగే, కొత్తిమీర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. బరువు నియంత్రణ, బరువు తగ్గడంలో కొత్తిమీర నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కొత్తిమీరలో ఉండే ఫైబర్ కడుపు నిండుగా ఉంచుతుంది. ఆకలి దప్పులను తగ్గిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు నియంత్రణలో సహాయపడుతుంది. కొత్తిమీరలో ఉన్న పాలీఫెనాల్ యాంటీ ఆక్సిడెంట్లు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. థైరాయిడ్ సమస్యలకు సహజ నివారణగా పనిచేస్తుంది. కొత్తిమీర ఆకులు, కాండం యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి సరైన థైరాయిడ్ పనితీరుకు సహాయపడతాయి. మీరు దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే అద్భుత ఫలితం ఉంటుంది. కొత్తిమీరలో గ్లైసెమిక్ 33 మాత్రమే ఉంది. ఇది చాలా తక్కువ. అటువంటి పరిస్థితిలో, ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా చెప్పవచ్చు. పచ్చి కొత్తిమీర శరీరంలో చక్కెర స్థాయిని తగ్గించి, ఇన్సులిన్ మొత్తాన్ని పెంచుతుంది. అలాగే, రక్తంలో చక్కెర తక్కువగా ఉంటే కొత్తిమీర నీటిని తాగకూడదు. అది రక్తంలో చక్కెరను తగ్గిస్తుంది.

# భారత్‌లో ఈ బీచ్ గురించి వింటే వామ్మో అంటారు!

గుజరాత్‌లో భయానక ప్రదేశంగా పేరుగాంచిన డ్యూమాస్ బీచ్

నల్లటి ఇసుకతో భయంకరంగా కనిపించే సముద్ర తీరం

ఒకప్పుడు శ్మశాన వాటిక కావడంతో దెయ్యాల కథలు ప్రచారంలో ఉన్నాయి

చీకటి పడ్డాక అక్కడ ఉండవద్దని స్థానికుల హెచ్చరిక

సాధారణంగా సముద్ర తీరం అనగానే బంగారు వర్ణంలో మెరిసే ఇసుక, నీలి సముద్రం గుర్తుకొస్తాయి. కానీ, గుజరాత్‌లోని సూరత్‌కు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న డ్యూమాస్ బీచ్ మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. ఇక్కడి ఇసుక నల్లగా ఉండటంతో పాటు, భారతదేశంలోని అత్యంత భయానక (హాంటెడ్) ప్రదేశాలలో ఒకటిగా పేరుగాంచింది. ఈ వింతైన వాతావరణమే పర్యాటకులను ఇక్కడికి ఆకర్షిస్తోంది. స్థానికంగా ప్రచారంలో ఉన్న కథల ప్రకారం, డ్యూమాస్ బీచ్ ఒకప్పుడు హిందువుల శ్మశాన వాటికగా ఉండేది. అందుకే ఇక్కడ ఆత్మలు తిరుగుతాయని నమ్ముతారు. సూర్యాస్తమయం తర్వాత గాలిలో గుసగుసలు వినిపిస్తాయని, ఎవరో తమను గమనిస్తున్నట్లు అనిపిస్తుందని సందర్శకులు చెబుతుంటారు. రాత్రిపూట కుక్కలు వింతగా అరవడం, కొందరు వ్యక్తులు అదృశ్యమయ్యారనే కథలు కూడా వినిపిస్తాయి. అయితే, ఈ భయానక కథలకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఇసుక నల్లగా ఉండటానికి అందులోని ఖనిజాలే కారణమని, గాలి, అలల శబ్దాలే గుసగుసలుగా భ్రమ కలిగిస్తాయని నిపుణులు చెబుతారు. ఈ భయానక కథలు ఎలా ఉన్నా, పగటిపూట డ్యూమాస్ బీచ్ సందర్శకులతో సందడిగా ఉంటుంది. ఇక్కడి ఫుడ్ స్టాల్స్‌లో లభించే వేడివేడి భజియాలు, పావ్ భాజీ వంటి గుజరాతీ స్నాక్స్ పర్యాటకులను ఆకట్టుకుంటాయి. అయితే, చీకటి పడేకొద్దీ వాతావరణం నిశ్శబ్దంగా, కాస్త భయానకంగా మారుతుంది. భద్రతా కారణాల వల్ల లేదా ప్రచారంలో ఉన్న కథల వల్ల, సూర్యాస్తమయం తర్వాత అక్కడ ఉండవద్దని స్థానికులు సూచిస్తుంటారు. రద్దీగా ఉండే పర్యాటక ప్రదేశాలకు భిన్నంగా, ప్రశాంతమైన, సహజమైన అనుభూతిని కోరుకునే వారికి డ్యూమాస్ బీచ్ ఒక ప్రత్యేకమైన ఎంపిక. అక్కడి నల్లటి ఇసుక, నీలి సముద్రం, సూర్యాస్తమయ దృశ్యాలు, ఆ మిస్టరీ వాతావరణం ప్రయాణికులకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవాన్ని అందిస్తాయి.



# ట్రంప్ విందులో కాల్పులు... ఆమె మాటలు నిజం అయ్యాయి!

ట్రంప్ హాజరైన విందులో కాల్పుల కలకలం

'షాట్స్ విల్ బి ఫైర్డ్' అన్న ప్రెస్ సెక్రటరీ

ట్రంప్ వాడీవేడి ప్రసంగం చేస్తారన్న ఉద్దేశంలో ఆమె వ్యాఖ్యలు

ఆ తర్వాత నిజంగానే కాల్పులు

ట్రంప్‌ను సురక్షితంగా తరలించిన సీక్రెట్ సర్వీస్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరైన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ వార్షిక విందులో తీవ్ర కలకలం రేగింది. ఓ దుండగుడు కాల్పులకు తెగబడటంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. అయితే, ఈ ఘటనకు కొద్దిసేపటి ముందే ట్రంప్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఆమె అన్న మాటలకు, జరిగిన ఘటనకు మధ్య ఉన్న సారూప్యత అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వివరాల్లోకి వెళితే, ఈ కార్యక్రమానికి ముందు ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడిన లీవిట్, ట్రంప్ ప్రసంగం చాలా ఉత్సాహంగా ఉండబోతోందని చెప్పారు. "ఈ రాత్రి కొన్ని షాట్లు పేలబోతున్నాయి (షాట్స్ విల్ బి ఫైర్డ్). ఆయన ప్రసంగం చాలా సరదాగా, ఆకర్షణీయంగా ఉంటుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ఇక్కడ 'షాట్స్ ఫైర్డ్' అంటే ట్రంప్ ప్రసంగం వాడిగా, వేడిగా ఉండబోతోందని ఆమె ఉద్దేశం. కానీ, ఆమె వ్యాఖ్యలు చేసిన కొద్దిసేపటికే ఆ కార్యక్రమంలో నిజంగానే కాల్పులు జరిగాయి. ఓ దుండగుడు (లోన్ వుల్ఫ్) సెక్యూరిటీ అధికారిపై కాల్పులు జరపడంతో గందరగోళం నెలకొంది. అయితే, ఆ అధికారి బుల్లెట్‌ప్రూఫ్ వెస్ట్ ధరించి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. వెంటనే అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, ట్రంప్‌ను చుట్టుముట్టి వేదిక వెనుక నుంచి సురక్షితంగా తరలించారు. ఈ ఘటనపై ట్రంప్ స్పందిస్తూ, దాడి చేసిన వ్యక్తి తనను హత్య చేసేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. "మొదట ఆ శబ్దం ఏదో ట్రే కిందపడినట్లుగా భావించాను, కానీ ఫస్ట్ లేడీ మాత్రం అది ప్రమాదకరమైన శబ్దమని వెంటనే గుర్తించారు" అని ట్రంప్ తెలిపారు. లీవిట్ చేసిన వ్యాఖ్యలకు, జరిగిన ఘటనకు మధ్య ఉన్న ఈ అసాధారణ సారూప్యతపై సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ ఘటనలో ఎవరికీ తీవ్ర గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దాడిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



# ఓటీటీలో ఈ వారం వినోదానికి ధోకా లేదు.. పూర్తి జాబితా ఇదిగో!

వేసవిలో వినోదం పంచేందుకు సిద్ధమైన ఓటీటీ ప్లాట్‌ఫామ్స్

నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్, ఆహాలో అందుబాటులోకి వచ్చిన కొత్త చిత్రాలు

తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న లగ్గమ్ టైమ్, లేచింది మహిళా లోకం

అంతర్జాతీయ సిరీస్‌లు, చిత్రాలు తెలుగు డబ్బింగ్‌లోనూ విడుదల

ఈ వారం వివిధ భాషల్లో పలు ఆసక్తికర వెబ్ సిరీస్‌ల స్ట్రీమింగ్

వేసవి వచ్చేసింది, ఎండలు మండిపోతున్నాయి. ఇలాంటి సమయంలో థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసేవారితో పాటు, ఇంట్లోనే కూర్చుని ప్రశాంతంగా వినోదాన్ని ఆస్వాదించాలనుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగానే ఓటీటీ సంస్థలు ప్రతి వారం సరికొత్త కంటెంట్‌తో సిద్ధమవుతున్నాయి. థియేటర్లలో కొత్త చిత్రాలు విడుదలవుతున్నప్పటికీ, ఓటీటీల హవా ఏమాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలో ఈ వారాంతంలో ప్రేక్షకులను అలరించడానికి పలు చిత్రాలు, వెబ్ సిరీస్‌లు స్ట్రీమింగ్‌కు వచ్చాయి. మరి ఆయా ప్లాట్‌ఫామ్స్‌లో అందుబాటులో ఉన్న వినోదంపై ఓ లుక్కేద్దాం. నెట్‌ఫ్లిక్స్ ఈ వారం నెట్‌ఫ్లిక్స్‌లో వివిధ భాషల్లో పలు ఆసక్తికర చిత్రాలు, సిరీస్‌లు విడుదలయ్యాయి. ముఖ్యంగా అంతర్జాతీయ కంటెంట్‌ను తెలుగు డబ్బింగ్‌తో అందించడం విశేషం. నీ ఫరెవర్ (మూవీ) -- తమిళ్/తెలుగు నుక్కడ్ నాటక్ (మూవీ) -- హిందీ కోకోమెలాన్ లేన్ (వెబ్‌సిరీస్) -- ఇంగ్లీష్ కిల్ టోనీ మేనియా (మూవీ) -- ఇంగ్లీష్ అన్‌చూజెన్ (మూవీ) -- ఇంగ్లీష్/తెలుగు హల్క్ హోగన్: రియల్ అమెరిన్ (వెబ్‌సిరీస్) -- ఇంగ్లీష్/తెలుగు స్ట్రేంజర్ థింగ్స్ (వెబ్‌సిరీస్) -- ఇంగ్లీష్ అపెక్స్: హంట్ ఆర్ బి హంటెడ్ (మూవీ) -- ఇంగ్లీష్/తెలుగు అన్ కామన్ వాలోర్ (మూవీ) -- ఇంగ్లీష్ ది ఈజ్ ఏ గార్డెనింగ్ షో (మూవీ) -- ఇంగ్లీష్ అమెజాన్ ప్రైమ్ అమెజాన్ ప్రైమ్ వీడియో కూడా ఈ వారం కొత్త సిరీస్‌లు, డబ్బింగ్ చిత్రాలతో ప్రేక్షకులను పలకరిస్తోంది. ఫ్రమ్ 4 (వెబ్‌సిరీస్) -- ఇంగ్లీష్ కెవిన్ (వెబ్‌సిరీస్) -- ఇంగ్లీష్ కిల్లింగ్ గ్రౌండ్స్: ది గిల్గో బీచ్ మర్డర్స్ (వెబ్‌సిరీస్) -- ఇంగ్లీష్ ఆల్ఫా: మెన్ లవ్ వెన్జెన్స్ (మూవీ) -- కన్నడ, తెలుగు ఇతర ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ ప్రముఖ తెలుగు ఓటీటీ 'ఆహా'తో పాటు జియో సినిమా, జీ5, సన్‌నెక్ట్స్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లోనూ కొత్త కంటెంట్ అందుబాటులోకి వచ్చింది. ఆహా: లగ్గమ్ టైమ్ (మూవీ) -- తెలుగు జియో సినిమా/హాట్‌స్టార్: 24 (వెబ్ సిరీస్) -- హిందీ, పేట్రియాట్ లెజెండ్స్ హ్యాంగ్ అవుట్, ఒరాంగుటాన్ (మూవీ) జీ5: జెరాక్స్ (వెబ్‌సిరీస్) -- కన్నడ సన్‌నెక్ట్స్: లేచింది మహిళా లోకం (తెలుగు మూవీ) -- ఏప్రిల్ 22 నుంచి స్ట్రీమింగ్ తెలుగు ప్రేక్షకులను ప్రత్యేకంగా ఆకట్టుకునే చిత్రాల విషయానికొస్తే.. 'ఆహా'లో విడుదలైన 'లగ్గమ్ టైమ్', సన్‌నెక్ట్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'లేచింది మహిళా లోకం' చిత్రాలు ఉన్నాయి. అలాగే అమెజాన్ ప్రైమ్‌లో కన్నడ చిత్రం 'ఆల్ఫా: మెన్ లవ్ వెన్జెన్స్' తెలుగు డబ్బింగ్‌లో అందుబాటులో ఉంది. మొత్తం మీద ఈ వారం అన్ని వర్గాల ప్రేక్షకులకు సరిపడా వినోదం ఓటీటీలో సిద్ధంగా ఉంది. ఇంకెందుకు ఆలస్యం, మీకు నచ్చిన సినిమా లేదా సిరీస్‌ను ఎంచుకుని కుటుంబంతో కలిసి ఈ వీకెండ్‌ను ఆస్వాదించండి.



# తుపానుకు ముందు ప్రశాంతత.. రామ్ చరణ్‌తో బుచ్చిబాబు స్పెషల్ ఫోటో!

రామ్ చరణ్‌తో దిగిన ఫోటోలను షేర్ చేసిన దర్శకుడు బుచ్చిబాబు

తుపానుకు ముందు ప్రశాంతత అంటూ ఆసక్తికర వ్యాఖ్య

నాకు ఇష్టమైన పోజు అంటూ చరణ్‌పై అభిమానం చాటుకున్న దర్శకుడు

జూన్‌లో 'పెద్ది' గ్రాండ్ రిలీజ్

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేటెస్ట్ పిక్స్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రాబోతున్న 'పెద్ది' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించి దర్శకుడు బుచ్చిబాబు సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. రామ్ చరణ్‌తో కలిసి ఉన్న కొన్ని ఫోటోలను ఆయన పంచుకున్నారు. ఈ ఫోటోలలో రామ్ చరణ్, బుచ్చిబాబు ఎంతో ఉత్సాహంగా, నవ్వుతూ కనిపించారు. ఈ ఫోటోలకు "తుపానుకు ముందు ప్రశాంతత" అని క్యాప్షన్ జోడించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అంతేకాకుండా, "నాకు ఇష్టమైన పోజులో నా ఫేవరెట్ సర్.. లవ్ యూ సర్" అంటూ రామ్ చరణ్‌పై బుచ్చిబాబు తన అభిమానాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం 'పెద్ది' షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ సినిమాను జూన్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్'తో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన రామ్ చరణ్, తొలి సినిమా 'ఉప్పెన'తోనే బ్లాక్‌బస్టర్ అందుకున్న బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలోనూ, అభిమానుల్లోనూ అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండగా.. సినిమా అప్‌డేట్స్ కోసం మెగా అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.



# టోల్ ప్లాజా సిబ్బందిపై దాడి.. సొంత పార్టీ ఎమ్మెల్యే అనుచరులైనా వదలొద్దన్న చంద్రబాబు

టోల్ ప్లాజా సిబ్బందిపై ఎమ్మెల్యే అనుచరుల దాడి


కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు అనుచరుల దౌర్జన్యం

మహిళా ఉద్యోగిని జుట్టు పట్టుకుని కొట్టిన గన్‌మన్

ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

దాడికి పాల్పడిన వారిపై కేసులు పెట్టాలని ఆదేశం

చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లాలోని టోల్‌ప్లాజా సిబ్బందిపై కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అనుచరుల దాడిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో బాధ్యులపై తక్షణమే కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే, కల్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు తన అనుచరులతో కలిసి తిరుమల దర్శనం ముగించుకుని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారిపై ఉన్న గండబోయినపల్లె టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ సిబ్బంది ఎమ్మెల్యే వాహనాన్ని గుర్తించనప్పటికీ టోల్ ఫీజు చెల్లించాలని కోరడంతో వివాదం మొదలైంది. దీంతో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే అనుచరులు, గన్‌మన్ రెచ్చిపోయారు. "ఎమ్మెల్యే వాహనాన్నే ఆపుతారా?" అంటూ సిబ్బందిపై దాడికి దిగారు. గన్‌మన్ టోల్ బ్యారియర్‌ను ధ్వంసం చేయడంతో పాటు, టోల్‌ప్లాజా మేనేజర్ రవిపై, మహిళా ఉద్యోగిని శ్రీలతపై చేయి చేసుకున్నాడు. మహిళ జుట్టు పట్టుకుని కొట్టిన దృశ్యాలు సీసీటీవీలో స్పష్టంగా రికార్డయ్యాయి. ఈ ఘటన జరిగినంతసేపు ఎమ్మెల్యే సురేంద్రబాబు తన వాహనంలోనే ఉండటం గమనార్హం.



# కూకట్ పల్లి ఎమ్మెల్యే కృష్ణా రావు పై బండి రమేష్ ఫైర్...





10 సంవత్సరాల ని హాయంలో కూకట్ పల్లి కి నువ్వు చేసింది శూన్యం...

90 శాతం అభివృద్ధి చేశా మనడం హాస్యాస్పదం

చిరు వ్యాపారులపై కపట ప్రేమ ఎందుకు,,,,,

మా కాంగ్రెస్ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్

ఎమ్మెల్యే కృష్ణా రావు పై బండి రమేష్ ధ్వజం..

కూకట్ పల్లి లో 90% అభివృద్ధి అని చెప్పిన నీవు చేసిన చెప్పుకోదగ్గ ఒక్క ప్రాజెక్టు కూకట్ పల్లి లో చూపించు... కూకట్పల్లి కాంగ్రెస్ కార్యాలయం ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఫైర్ అయ్యారు. ప్రధానంగా ఇటీవల ప్రజా పాలన ప్రగతి నివేదిక విషయంలో రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించడం విమర్శిం చారుబండి రమేష్ మాట్లాడుతూ కూకట్ పల్లి లోని చిరు వ్యాపారులపై కపట ప్రేమ చూపిస్తున్న నువ్వు మీ హయాంలో చిరువ్యాపారాలు ఎందుకు పట్టించు కోలేదని ఐడియల్ లేకు వద్ద ఉన్న 40 మంది చిరు వ్యాపారాలని మీ హాయంలో ఎందుకు లేపేసారని ప్రశ్నించారు. మీ హయాంలో వారికి పది ఎకరాలు ఇప్పించి మార్గం చూపించకపోయినా నువ్వు మాట్లాడే అర్హత లేదని అన్నారు. కూకట్ పల్లి లో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ చాలా స్ట్రాంగ్ గా ఉందని దాదాపు నియోజకవర్గ స్థాయిలో 11 నుంచి 120 మందికి పదవులు ఇప్పించామని టెంపుల్ కమిటీలు వేసుకొని కాంగ్రెస్ పార్టీ ముందుకెళ్తోంది అని తెలిపారు కూకట్ పల్లి అభివృద్ధికి అన్ని రకాల సహకరిస్తూ కూకట్ పల్లి డిగ్రీ కాలేజీకి దాదాపు రెండున్నర కోట్ల కలెక్టర్ ఫ్రెండు ఇతర ఫండ్ తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నామని ఇంటర్ నుండి పిజి కాలేజ్ వరకు అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు, అలాగే మీ హయాంలో శిలాఫలకం వేసిన 100 పడకల ఆసుపత్రి పని జరుగుతుందని త్వరలోనే అది పూర్తి చేస్తామని తెలిపారు క్రీడల కోసం పార్కులు ఏర్పాటు చేస్తు న్నామని మీలాగా కల్లబొల్లి కబుర్లు చెప్పి మేము పక్కకు పోవట్లేదు అని తెలిపారు. మీ హయాంలో ఒక్క గుడికి ఒక్కొక్క ఓనర్ మాజీ కార్పొరేటర్ మూడు గుడులకు ఇంచార్జ్, కూరగాయల మార్కెట్ కోసం ఏర్పాటుచేసిన భవనాల్లో ఎస్పీ నగర్ కావచ్చు సిక్స్ ఫేస్ నైన్త్ పేస్ లలో ఏర్పాటు చేసిన మార్కెట్లలో మీ అనుచ రులతో కబ్జా చేయించింది నిజం కాదా, మీ మీ హయాంలో ఐడిఎల్ ల్యాండ్ అన్యాక్రాంతమైందని హౌసర్ హోమ్స్ లో మీకు ఇల్లు ఎలా వచ్చాయని ఆయన ఎమ్మెల్యే ని ప్రశ్నించారు. పొద్దున లేస్తే సీఎం మీద విమర్శలు చేస్తా నీకు ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా అభివృద్ధి చేసిన నల్లచెరువు పై రెండున్నలకల ధోరణి కరెక్ట్ కాదని స్టేజ్ పైన ఒక మాట స్టేజి దిగాక ఒక మాట మాట్లాడటం నీ విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. మూసాపేట జంక్షన్ లో 170 కోట్లతో ఫ్లైఓవర్ నేర్పిస్తు న్నామని అలాగే జేఎన్టీయూ స్కైవాక్ కూడా పని జరుగుతుందని తమ ప్రభుత్వంలో అభివృద్ధి దూసుకుపోతుందని ఆయన తెలిపారు. ఎంతసేపటికి అధికారులను భయపడటం బెదిరించి వారితో పని చేయించుకోవడం కరెక్ట్ కాదని తెలిపారు 90 శాతం అభివృద్ధి చేస్తే ఎక్కడా ఏమీ కనిపించట్లేదని ఆయన ఎద్దేవా చేశారు. బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణం లో సైతం ని ప్రమేయం ఏమీ లేదని అప్పటికి ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ సర్వే సత్యనారాయణ కృషి వల్ల వచ్చిందని ఆయన అన్నారు. కెపిహెచ్బి ఫ్లైఓవర్ కట్టినప్పుడు నువ్వు ఏ పార్టీలో ఉన్నావో గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఎన్టీఆర్ స్కూల్ పేరుతో పండు వసూలు చేసి ఎక్కడ ముందుకు జగన్ పరిస్థితి నీ హాయంలో జరగలేదా అని ప్రశ్నించారు. ఎంతసేపు ప్రభుత్వం ప్రభుత్వ అధికారుల పడి ఏడవటం తప్పితే నువ్వు చేసేది ఏమీ లేదని అన్నారు. గత హయాంలో కెపిహెచ్బిలో చాపల మార్కెట్ ఏర్పాటు చేస్తే ఆ దుకాణాలు ముదిరాజు సోదరులకు కాకుండా మీ అనుచరులకి పిచ్చి అద్దెలు వసూలు చేసేది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు.రైతు బజార్లో దుకాణాలు ఏఎంసి లో ఎలా చేసిన దుకాణాలు ఎవరి పేరు మీద ఉన్నాయో బయటకు తీస్తామని అని తెలిపారు. కూకట్పల్లిలో అక్రమ నిర్మాణాలకి ఆధ్యుడివి నీవు కావా ఇప్పుడు నీ ఆత్మ కడుతున్న కెపిహెచ్బి భువన విజయం బిల్డింగ్ ని కూల్చేదామా అంటూ ఆయనకు సవాల్ విసిరారు. చిరు వ్యాపారులపై కపట ప్రేమ చూపిస్తున్న నువ్వు గతంలో వారికి చేసింది శూన్యం అని కేవలం నీ అనుచరుల మనుగడ కోసమే నువ్వు మాట్లాడుతున్నామని ఆయనపై విరుచుకుపడ్డారు. మా కాంగ్రెస్ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు.మూడు కార్పొరేషన్లతో ప్రజలకు చేరువై వారికి సేవ చేయాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందు కెళుతుందని తెలిపారు.అంతెందుకు గోపాల్ నగర్ లో కనీసం పార్కు లేదని నువ్వు 10 సంవత్సరాల్లో పార్క్ ఎందుకు ఇప్పించలేకపోయావని ప్రశ్నించారు తమ హయాంలో హైడ్రా ద్వారా 3300 గజాల స్థలంలో పార్క్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు, మీ ఇంటికి కూతవీడు దూరంలో ఉన్న స్వామి లేఖ పక్కన నాలాతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ పది సంవత్సరాల్లో ఏమీ ఎందుకు చేయలేకపోయావని బండి రమేష్ ప్రశ్నించారు.

# కాశి పోగుల వారి వివాహ మహోత్సవం ఘనంగా నిర్వహణ

శ్రీ వివేకానంద కమ్యూనిటీ హాల్‌లో సందడి... ప్రముఖుల హాజరు

హైదరాబాద్ నగరంలోని అమీర్‌పేట్ ధరంతరం రోడ్డులో ఉన్న శ్రీ వివేకానంద కమ్యూనిటీ హాల్‌లో కాశి పోగుల వారి వివాహ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. సాంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకలో బంధుమిత్రులు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమానికి అతిథులుగా చక్కా బ్రదర్స్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఏడెల్లి సన్నీ హాజరయ్యారు.వారు వధూవరులకు ఆశీర్వాదాలు అందించి,వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



# జగిత్యాల పట్టణంలో పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న -మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల పట్టణంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన కలెక్షన్స్ షాప్ ప్రారంభించారు. అనంతరం జగిత్యాల పట్టణంలోని నేత్ర స్కిన్ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి హాజరైన జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ లు మరియు వారి వెంట కౌన్సిలర్ సుంకేతి మమత, రామకృష్ణారెడ్డి, మూలస్థం లావణ్య మహేష్, మాజీ కౌన్సిలర్ మూలస్థం లలిత మరియు హాస్పిటల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# వివాదంలో అషు రెడ్డి... తండ్రి ఏమంటున్నారంటే..!

అషురెడ్డి రూ.9.5 కోట్ల మేర మోసం చేసిందంటూ ఆరోపణలు

స్పందించిన తండ్రి వెంకటకృష్ణారెడ్డి

అబ్బాయికి అప్పటికే పెళ్లయి విడాకుల కేసు నడుస్తోందని వెల్లడి

ఆర్థిక లావాదేవీలతో తమకు సంబంధం లేదని స్పష్టీకరణ

సోమవారం ప్రెస్ మీట్ పెట్టి తన కుమార్తె నిజాలు చెబుతుందన్న తండ్రి

బిగ్‌బాస్ ఫేమ్ అషురెడ్డిపై వచ్చిన రూ. 9.5 కోట్ల మోసం ఆరోపణల వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. ఈ వివాదంపై అషురెడ్డి తండ్రి వెంకటకృష్ణారెడ్డి తొలిసారిగా మీడియా ముందుకొచ్చి సంచలన విషయాలు వెల్లడించారు. తన కూతురు అమాయకురాలని, అసలు తప్పు అవతలి వారిదేనని ఆయన పేర్కొన్నారు. రేపు (సోమవారం) అషురెడ్డి స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి అన్ని విషయాలు వివరిస్తుందని తెలిపారు.వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. “2021లో కాకినాడ నుంచి సత్యనారాయణ అనే వ్యక్తి ఫోన్ చేసి, అషురెడ్డికి పెళ్లి సంబంధం గురించి మాట్లాడారు. మా అమ్మాయి గురించి మీకెలా తెలుసు అని అడిగాను. మీ అమ్మాయికి, మా అబ్బాయి ధర్మేంద్రకు ఉద్యోగం చేసే దగ్గర పరిచయం అని ఆయన చెప్పారు. అయితే, మేము తెలిసిన వారి ద్వారా విచారించగా కొన్ని నిజాలు తెలిశాయి. అప్పటికే ధర్మేంద్రకు పెళ్లయి విడాకుల కేసు నడుస్తోందని, తండ్రి సత్యనారాయణ నడుపుతున్న ఫైనాన్స్ కంపెనీపై కాల్ మనీ కేసు ఉందని తెలిసింది. దీంతో ఈ సంబంధం వద్దని నిర్ణయించుకున్నాం” అని వెంకటకృష్ణారెడ్డి వివరించారు. ఆ తర్వాత వారి గురించి మళ్లీ ఇప్పుడే వింటున్నామని ఆయన అన్నారు. తన కూతురు తల్లి ప్రోత్సాహంతోనే ఇండస్ట్రీలోకి వచ్చిందని, ఆమెకు బయట ప్రపంచం గురించి పెద్దగా తెలియదని వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. “మా అమ్మాయి అమాయకురాలు. ఆమెపై వచ్చిన ఆర్థిక ఆరోపణల్లో వాస్తవం లేదు. వాటికి ఎలాంటి ఆధారాలు లేవు. ఒకవేళ ఉంటే నిరూపించుకోవాలి” అని ఆయన సవాల్ విసిరారు. ప్రస్తుతం అషురెడ్డి వేరే ఊరిలో ఉందని, ఈ రాత్రికల్లా హైదరాబాద్ చేరుకుంటుందని తెలిపారు. సోమవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, ఈ వివాదం వెనుక ఉన్న అసలు నిజాలను అషురెడ్డే స్వయంగా వెల్లడిస్తుందని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యవహారంలో అషురెడ్డి ఏం చెప్పబోతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది



# ఆసుపత్రిలో దుశర్ల సత్యనారాయణను పరామర్శించిన మంత్రి కొండా సురేఖ

ఇటీవల పర్యావరణవేత్త దుశర్ల సత్యనారాయణపై దాడి

దాడిని హేయమైన చర్యగా పేర్కొన్న మంత్రి కొండా సురేఖ

కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

నల్గొండ ఫ్లోరోసిస్ సమస్యపై ఆయన పోరాటాన్ని గుర్తు చేసుకున్న మంత్రి

ప్రముఖ పర్యావరణవేత్త, జలసాధన సమితి వ్యవస్థాపకుడు దుశర్ల సత్యనారాయణపై జరిగిన దాడిని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. ఇది మానవత్వంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. దాడిలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణను ఆమె పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సత్యనారాయణ గాయపడిన శరీరం విధ్వంసానికి గురైన అడవిలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు, నీటి హక్కులకు జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిపై దాడి చేయడం మానవ మనుగడపై దాడి చేయడంతో సమానమని అన్నారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్యపై సత్యనారాయణ చేసిన పోరాటాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. పాదయాత్రలతో ఢిల్లీ వరకు వెళ్లి, అప్పటి ప్రధాని వాజ్‌పేయికి సమస్య తీవ్రతను వివరించారని కొనియాడారు. దాడికి పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నల్గొండ ఎస్పీ నరసింహను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. సత్యనారాయణకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన సృష్టించిన 70 ఎకరాల అడవి పరిరక్షణకు వన మహోత్సవం నిధుల నుంచి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సత్యనారాయణను స్ఫూర్తిగా తీసుకుని, ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.



# జగ్గంపేటలో డీజిల్ నిల్.... పెట్రోల్ కొరత-

జగ్గంపేట పరిసరాల్లోని ఆయిల్ బంకుల్లో డీజిల్ లేకపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగితే ట్రాన్స్పోర్ట్ నిలిచిపోయి నిత్యవసర ధరలు భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీనికి తోడు పెట్రోల్ కూడా కొరత ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జగ్గంపేట పరిసర ప్రాంతాల్లోని బంకుల్లో వాహన దారులు బారులు తీరుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం పెట్రోల్ , డీజిల్ కొరత లేదంటుంది. కానీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులను తొలగించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.



## వ్యాపారం

# కొత్త వ్యాపారంలోకి పేటీఎం..
# త్వరలో క్యాబ్ సర్వీస్ ప్రారంభం..

ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎం కొత్త వ్యాపారంలోకి అడుగుపెడుతోంది. తన ప్లాట్ ఫాంలోని ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్డీసీ) ద్వారా ఆటో రిక్షా బుకింగ్ సేవలను ప్రారంభించనుంది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై నగరాల్లో ఆటో రిక్షా రైడ్ లను అందించేందుకు రైడ్ హెయిలింగ్ మార్కెట్‌లోకి అడుగు పెడుతుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.. డిజిటల్ పేమెంట్ యాప్.. స్మార్ట్ ఫోన్ వినియోగ దారులందరికీ పరిచయం చేయనక్కర్లేని యాప్ పేటీఎమ్. దాదాపు ప్రతి ఒక్కరూ దీనిని ఉపయోగిస్తారు. ముఖ్యంగా డిజిటల్ పేమెంట్లు చేయడానికి వాడే నంబర్ వన్ యాప్ అని చెప్పవచ్చు. దీని యూజర్ల దేశంలో అధిక సంఖ్యలో ఉన్నారు. అయితే ఇటీవల ఆర్బీఐ ఆంక్షలతో పేటీఎం కుదేలైంది. అయినప్పటికీ తిరిగి పుంజుకునేందుకు పేటీఎం కొత్త వ్యాపారంలోకి అడుగు పెట్టడానికి సిద్ధమైంది. పెద్దసంఖ్యలో ఉన్న యూజర్లు తనకు ప్లస్ పాయింట్ మారే అవకాశం ఉందని భావిస్తోంది. పరీక్షల స్థాయిలో ఫీచర్.. ఈ కొత్త ఫీచర్ పరీక్షల స్థాయిలో ఉంది. చాలా తక్కువ మంది పేటీఎమ్ వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. ఇప్పటికే రైడ్ హెయిలింగ్‌లో ఓలా, ఉబర్ ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వాటికి పేటీఎం సవాలు విసురుతుందని భావిస్తున్నారు. పేటీఎం ప్రస్తుతం ఎంపిక చేసిన వినియోగదారులతో తన యాప్‌లో రైడ్ హెయిలింగ్ ఫీచర్‌ను పరీక్షిస్తోంది. తదుపరి దశలో క్యాబ్ బుకింగ్ సేవలను కూడా అందించనుంది. గత రెండేళ్లలో ఓఎన్డీసీలో ఫుడ్ డెలివరీ, కిరాణా, ఫ్యాషన్,ఎలక్ట్రానిక్స్ వంటి అనేక ఇ-కామర్స్ ఆఫర్‌లను పేటీఎం ప్రయోగాత్మకంగా ప్రారంభించి, విడుదల చేసింది. నమ్మయాత్రికి అనుసంధానం.. పేటీఎం యాప్‌లో బుక్ చేసిన ఆటో రిక్షాలు ఓఎన్డీసీ మద్దతు కలిగిన నమ్మ యాత్రి యాప్ కు అనుసంధానం చేశారు. ఇది సంప్రదాయ కమీషన్ విధానానికి విరుద్ధంగా డ్రైవర్ భాగస్వాములకు చందా రుసుముతో తన సేవలను అందిస్తుంది. నమ్మయాత్రి గత రెండేళ్లలో బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా,ఇతర మెట్రోలతో సహా ఏడు నగరాల్లో 3.73 కోట్ల రైడ్‌లను అందించింది. వీటిలో ఎక్కువ భాగం ఆటో రైడ్‌లు. నగరాల్లో క్యాబ్ బుకింగ్‌లను కూడా ప్రారంభిస్తోంది. ఓఎన్డీసీ అంటే? ఓఎన్డీసీ అనేది ఓపెన్ ప్రోటోకాల్ ఆధారంగా పనిచేసే టెక్నాలజీ నెట్‌వర్క్. అలాగే మొబిలిటీ, గ్రోసరీ, ఫుడ్ ఆర్డర్, డెలివరీ, హోటల్ బుకింగ్, ప్రయాణం వంటి విభాగాల్లో సేవలు అందిస్తుంది. ఈ ప్లాట్‌ఫారమ్ లో కొనుగోలుదారులు, విక్రేతలు ఏ ఇతర అప్లికేషన్లను వాడినా ఆన్‌లైన్‌లో ఒకరితో ఒకరు కనెక్ట్ అవ్వవచ్చు. అలాగే లావాదేవీలు నిర్వహించడానికి కూడా అనుమతి ఉంది. కొనుగోలుదారులు, విక్రేతలు లావాదేవీలను నిర్వహించడానికి ఒకే ప్లాట్‌ఫారమ్, అదే మొబైల్ యాప్‌ను ఉపయోగించాల్సిన అవసరం లేదు. వివిధ అప్లికేషన్లను ఉపయోగించి వ్యాపార లావాదేవీలు చేయవచ్చు. 2022లో ప్రారంభం నమ్మ యాత్రి యాప్ 2022లో ప్రారంభమైంది. సుమారు 2.1 లక్షల మందికి పైగా డ్రైవర్లు, 50 లక్షల మంది కస్టమర్లతో భాగస్వామ్యం కలిగి ఉంది. బెంగళూరు, మైసూరు, హైదరాబాద్, కోల్‌కతాతో సహా ఏడు నగరాల్లో 3.3 కోట్లకు పైగా ట్రిప్పులను పూర్తి చేసింది. దేశంలో ప్రజా రవాణా సేవలను మెరుగుపరచడానికి గూగుల్ మ్యాప్స్, ఓఎన్డీసీతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది.




## రూ. 69వేలకే ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్.. డెలివరీలు కూడా ప్రారంభం..

ఎలక్ట్రిక్ స్కూటర్ల శ్రేణిలో దేశంలోనే అగ్రశ్రేణి విక్రయదారుగా వెలుగుతోంది ఓలా ఎలక్ట్రిక్. తనకంటూ ఓ ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్ ను క్రియేట్ చేసుకుంది. అయితే దాని ధర విషయంలోనూ వినియోగదారులు కాస్త అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఇతర ఎలక్ట్రిక్ స్కూటర్లతో పోల్చితే ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ క్రమంలో అన్ని తరగతుల వారీగా అందుబాటులో ధరలో ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ ను ఓలా ఎలక్ట్రిక్ లాంచ్ చేసింది. ఓలా ఎస్1ఎక్స్ పేరుతో వచ్చిన ఈ స్కూటర్ డెలివరీలను ఓలా ఇటీవల ప్రారంభించింది. ఇది ప్రస్తుతం ఓలా లైనప్ లో ఉన్న స్కూటర్లు అన్నింటిలోకి తక్కువ ధరకు లభ్యమవుతోంది. 2కేడబ్ల్యూ వేరియంట్ రూ. 69,999, 3కేడబ్ల్యూ రూ. 84,999, 4కేడబ్ల్యూ రూ, 99, 999 కి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ధరలన్నీ ఎక్స్ షోరూం. ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో అన్ని స్కూటర్లలో కెల్లా ఇదే చవకైన స్కూటర్ గా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ల గురించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం..2కేడబ్ల్యూ వేరియంట్.. ఓలా ఎస్1 ఎక్స్ 2కేడబ్ల్యూ వేరియంట్ కు సంబంధించిన వివరాలను చూస్తే.. సింగిల్ చార్జ్ పై 91 కిలోమీటర్ల రేంజ్ ని ఇస్తుంది. బ్యాటరీ ఫుల్ చార్జ్ అవడానికి 7.4 గంటలు పడుతుంది. యాక్సలరేషన్ కూడా ఎక్కువగా ఉంటుంది. కేవలం 4.1 సెకండ్లలోనే గంటకు సున్నా నుంచి 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీనిలో మోటార్ గరిష్ట పవర్ అవుట్ పుట్ 6కేడబ్ల్యూ ఉంటుంది. ఈ స్కూటర్లో ఎకో, నార్మల్, స్పోర్ట్స్ మోడ్స్ ఉంటాయి. గరిష్టంగా గంటకు 85 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించ గలుగుతుంది. ఈ స్కూటర్లో 3.5 అంగుళాల ఎల్సీడీ టచ్ స్క్రీన్ తో కూడిన ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంటుంది. 3కేడబ్ల్యూహెచ్, 4కేడబ్ల్యూహెచ్ వెర్షన్లు.. 3కేడబ్ల్యూ వెర్షన్లో కూడా అదే చార్జింగ్ టైం, అవే రైడింగ్ మోడ్స్ ఉంటాయి. అయితే ఫీచర్ల విషయంలోనే కొన్ని



అదనంగా యాడ్ అవుతాయి. అలాగే యాక్సలరేషన్ టైం, టాప్ స్పీడ్, రేంజ్ మారతాయి. 3కేడబ్ల్యూ వెర్షన్ 3.3 సెకండ్లలోనే 90 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. బ్యాటరి సింగిల్ చార్జ్ పై 151 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. అదే సమయంలో 4కేడబ్ల్యూహెచ్ వేరియంట్ గురించి చూస్తే 3కేడబ్ల్యూహెచ్ లో ఉన్న అన్ని అంశాలు ఉంటాయి. రేంజ్ మాత్రం అధికంగా ఉంటుంది. సింగిల్ చార్జ్ పై 190 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. మిగిలిన ఫీచర్లు, స్పెసిఫికేషన్లు అలాగే ఉంటాయి.

## ఆదాయపు పన్ను రిటర్న్‌లో ఫారం-16 అంటే ఏమిటి? ఇది ఎందుకు అవసరం!




ఆదాయపు పన్ను విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ చేసేవారు చాలా విషయాలపై అవగాహన ఉండాలి. ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్‌లో ఏ ఫారం దేనికి పని చేస్తుంది? ట్యాక్స్ మినహాయింపు కోసం ఎలాంటి ఫారాలు అవసరం తదితర వివరాలు తెలిసి ఉండాలి. ఆదాయపు పన్ను రిటర్న్‌ను ఫైల్ చేయడానికి ఫారం 16 అవసరం. ఇది లేకుండా పన్ను చెల్లింపుదారులు, ముఖ్యంగా ఉపాధి ఉద్యోగులు తమ పన్నులను జమ చేయలేరు. ఫారం 16 అంటే ఏమిటో తెలుసా? మీరు దీన్ని ఎక్కడ నుండి పొందుతారు? ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి మీకు ఇది ఎందుకు అవసరం? ఫారం 16కి సంబంధించిన మొత్తం సమాచారాన్ని తెలుసుకుందాం. మీకు ఫారం 16 ఎందుకు అవసరం? ఉద్యోగస్తులకు ఐటీఆర్ ఫైల్ చేయడానికి ఫారం 16 అవసరం. ఆదాయపు పన్ను రిటర్న్‌ను దాఖలు చేస్తున్న అసెస్‌మెంట్ సంవత్సరం జూన్ 15 నాటికి కంపెనీలు తమ ఉద్యోగులకు ఫారమ్ 16ను జారీ చేయాల్సి ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఫారమ్ 16 (అసెస్‌మెంట్ ఇయర్ 2024-25) జూన్ 15, 2024లోపు జారీ చేయాలి. ఫారం 16 అంటే ఏమిటి? ఫారం 16 అనేది ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 203 ప్రకారం జారీ చేయబడిన సర్టిఫికేట్. ఇది ఒక ఉద్యోగి సంపాదించిన జీతం, యజమాని (కంపెనీ) అతని జీతం నుండి తీసివేయబడిన పన్నుల గురించి సమాచారాన్ని అందిస్తుంది. ఫారమ్ 16 యజమాని అంటే మీ కంపెనీ టీడీఎస్ డిపాజిట్ చేసిందో లేదో నిర్ణయిస్తుంది. ఫారమ్ 16 అనేది ఈ మొత్తం సమాచారాన్ని కలిగి ఉన్న సర్టిఫికేట్. ఇది ఉద్యోగి సంపాదించిన ఆదాయం, అలవెన్సులు, తగ్గింపులను కలిగి ఉంటుంది. ఉద్యోగి చెల్లించిన పన్ను ఫారమ్ 16 ఆదాయ రిటర్న్ ఫైల్ గురించి, మీ ఆదాయం గురించి ఇతర సమాచారాన్ని అందిస్తుంది. ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి ఫారం 16 అవసరం. ఇది మీ ఆదాయం, తగ్గింపులను ఖచ్చితంగా నివేదించడంలో మీకు సహాయపడుతుంది. పన్ను వాపసును క్లెయిమ్ చేయడంలో ఆదాయపు పన్ను కూడా సహాయపడుతుంది. ఫారమ్ 16లో పార్ట్ అంటే ఏమిటి? ఫారమ్ 16లోని పార్ట్ ప్రతి త్రైమాసికంలో తీసివేయబడిన టీడీఎస్ గురించి సమాచారాన్ని కలిగి ఉంటుంది. ఫారం ఉద్యోగి పేరు, చిరునామా కంపెనీ పేరు, చిరునామా ఉద్యోగి పాన్ నంబర్ కంపెనీ పాన్ నంబర్ యజమాని పన్ను మినహాయింపు ఖాతా సంఖ్య ఫారమ్ 16 పార్ట్ మూల వేతనం ఇంటి అద్దె భత్యం రవాణా భత్యం తగ్గింపు 80%కింద తీసుకున్న మినహాయింపు గురించి సమాచారాన్ని కలిగి ఉంటుంది. 80% కింద తీసుకున్న మినహాయింపు గురించి సమాచారం సెక్షన్ 80డి కింద ఆరోగ్య బీమా ప్రీమియం సెక్షన్ 80% కింద మినహాయింపు సెక్షన్ 80% కింద మినహాయింపు సెస్, సర్‌ఛార్జ్ సమాచారం ఫారమ్ 16ని ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోండి ఆ తర్వాత ఫారమ్ డౌన్‌లోడ్‌కి వెళ్లండి. తర్వాత ఆదాయపు పన్ను ఫారమ్ ట్యాబ్‌పై క్లిక్ చేయండి. తరచుగా ఉపయోగించే ఫారమ్‌లలో ఫారమ్ 16ని ఎంచుకోండి. ఫారమ్ 16 అవసరమయ్యే ఆర్థిక సంవత్సరాన్ని ఎంచుకోండి. ఫారమ్ 16 కింద పీడీఎఫ్ ఆప్షన్‌న ఎంచుకోండి. ఫారమ్ తదుపరి విండోలో డౌన్‌లోడ్ అవుతుంది.

## డబ్బులు ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలో తెలియడం లేదా.? ఇదే బెస్ట్ ఆప్షన్

కరోనా తదనంతర పరిస్థితుల నేపథ్యంలో చాలాలో మంది డబ్బు పొదుపై చేయడంపై ఆసక్తిపెరిగింది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా డబ్బులను పొదుపుచేయాలని చేస్తున్నారు. ఇందులో భాగంగానే రకరకాల మార్గాలను ఎంచుకుంటున్నారు. అయితే ఎలాంటి రిస్క్ లేకుండా సొమ్ముకు భద్రతతో పాటు మంచి రిటర్న్ వచ్చే వాటిపై దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ పోస్టాఫీస్ రకరకాల పథకాలను అందిస్తున్నాయి. అలాంటి ఓ బెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. పోస్టాఫీస్ గ్రామ్ సురక్ష స్కీమ్ పేరుతో పథకాన్ని అందిస్తోంది. ఈ పథకం ద్వారా ఉద్యోగ విరామం తర్వాత ఆర్థికంగా ఎలాంటి ఢోకా లేకుండా ఉండొచ్చు. ఇంతకీ ఈ పథకం ఏంటి.? దీంతో కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. పోస్టాఫీస్ ఈ పథకాన్ని 1955లో ప్రవేశపెట్టారు. ఈ పథకంలో చేరిన వ్యక్తి 80 ఏళ్ల తర్వాత దాని ఫలాలు పొందుతాడు. ఒకవేళ స్కీమ్‌లో చేరిన వ్యక్తి మధ్యలోనే మరణిస్తే మొత్తం డబ్బులను నామినీకి లేదా కుటుంబ సభ్యులకు అందిస్తారు. 19 నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న వారు ఈ స్కీమ్‌లో చేరడానికి అర్హులుగా చెప్పొచ్చు. ప్రీమియంను మూడు నెలలు, ఆరు నెలలు లేదా ఏడాదికి ఒకసారి చొప్పున చెల్లించే అవకాశం ఉంది. అదే విధంగా పథకం మెచ్యూరిటీ 55, 58, 60 ఏళ్లుగా ఉంటుంది. ఉదాహరణకు మీకు మెచ్యూరిటీ తర్వాత రూ. 31 లక్షలు పొందాలనుకుంటే 9 ఏళ్ల వయసులో ఉన్న సమయంలో పథకాన్ని ప్రారంభించాలి. రూ.10లక్షల మొత్తానికి పాలసీ తీసుకున్నారని అనుకోండి. దానికి55ఏళ్ల వరకూ ప్రీమియం చెల్లిస్తే.. మెచ్యూరిటీ తర్వాత మీకు రూ. 31.60లక్షల రాబడి వస్తుంది. ఇందు కోసం నెలకు రూ. 1500 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అలాకాకుండా 58ఏళ్ల కాల వ్యవధితో తీసుకుంటే మెచ్యూరిటీ తర్వాత మీకు రూ. 33.4 లక్షలు..ఒకవేళ 60ఏళ్ల వ్యవధి తీసుకుంటే రూ. 34.60 లక్షలు వస్తాయి.

## రైలు ప్రయాణంలో మీ ఫోన్ పోయిందా..
## నో టెన్షన్! వెంటనే ఈ పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి

రైలులో ప్రయాణిస్తున్నప్పుడు మీ ఫోన్ పొరపాటున పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా, దాన్ని తిరిగి పొందడం దాదాపు అసాధ్యం అనిపిస్తుంది. కానీ ఇప్పుడు మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైలులో మీ పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి పొందేందుకు భారతీయ రైల్వే సంచార్ సతి పోర్టల్‌తో చేతులు కలిపింది. దీని సహాయంతో ప్రజలు ప్రయాణించేటప్పుడు పోగొట్టుకున్న ఫోన్‌లను తిరిగి పొందడం చాలా సులభం అవుతుంది. పోగొట్టుకున్న ఫోన్ గురించి ఇక్కడ ఫిర్యాదు చేయండి ప్రజల ప్రయాణానికి, వారి భద్రతకు సాధికారత కల్పించేందుకు టెలికమ్యూనికేషన్స్ విభాగం భారతీయ రైల్వేతో చేతులు కలిపిందని టెలికాం డిపార్ట్‌మెంట్ తెలిపింది. ఇందులో రైలులో ప్రయాణిస్తున్నప్పుడు మీరు పోగొట్టుకున్న లేదా దొంగిలించిన ఫోన్‌ని ఇప్పుడు సంచార్ సతి పోర్టల్‌లో నివేదించవచ్చు. గత వారం నివేదించబడిన 25 ఫోన్‌లలో 10 రికవరీ అయినట్లు డిపార్ట్‌మెంట్ తెలిపింది. సంచార్ సతి పోర్టల్ అంటే ఏమిటి? టెలికాం మంత్రి అశ్విని వైష్ణవ్ గత ఏడాది మేలో సంచార్ సతి పోర్టల్‌ను ప్రారంభించారు. సంచార్ సాథీ సహాయంతో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గరైనా, దాన్ని ఎలా బ్లాక్ చేయవచ్చు, ట్రాక్ చేయడం.. ట్రేస్ చేయడం వంటివి చేసువచ్చు. ఇది అతని డేటా, వ్యక్తిగత విషయాలను సురక్షితంగా ఉంచడంలో సహాయపడుతుంది. సదరు వ్యక్తి సిమ్ కార్డుతో పాటు ఫోన్‌ను కూడా బ్లాక్ చేయవచ్చు. సంచార్ సతి పోర్టల్‌ను ఉపయోగించి ఇప్పటివరకు 40 లక్షలకు పైగా మోసపూరిత కనెక్షన్‌లను గుర్తించారు. కమ్యూనికేషన్ భాగస్వామి ఎక్కడ ఉపయోగపడుతుంది? మొబైల్ ఫోన్ పోయినా లేదా దొంగిలించబడినా, దానిని ఎలా బ్లాక్ చేయడం.. ట్రాక్ చేయడం.. ట్రేస్ చేయడం వంటివి చేయవచ్చు. ఇది దాని డేటాను, వ్యక్తిగత విషయాలను సురక్షితంగా ఉంచడంలో సహాయపడుతుంది.

## రైలులో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నారా.? అయితే ఇది తెలుసుకోండి..!



నిత్యం వందల కిలోమీటర్లు ప్రయాణించే రైళ్లలో కేవలం రెండు నుంచి మూడు జనరల్ బోగీలు మాత్రమే ఉంటాయి.. అందులోనూ ఒకటి స్త్రీలకు కేటాయిస్తారు. వాటిలోను సుమారు రెండు రాష్ట్రాల నుంచి మూడు రాష్ట్రాల కు చెందిన ప్రయాణికులు వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది.. అందులో సీటు దొరికితే డోంట్ వరీ లేదంటే టాయిలెట్స్ దగ్గరరో లేదంటే జనాలు కూర్చునే సీట్ల క్రిందలో పడుకొని ప్రయాణం చేస్తూ వుంటారు.. అది లేదంటే ప్రమాదకరంగా తలుపుల దగ్గర ఫుట్ బోర్డు ప్రయాణాలు చేస్తూ ఉంటారు. ఫుట్ బోర్డు ప్రయాణం ఎంత ప్రమాదమని హెచ్చరించిన చాలా మంది యువకులు ఆమాటలను పెడచెవిన పెడుతున్నారు.. సరదా పేరుతో ఫుట్ బోర్డు ప్రయాణాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. రైళ్లలో చాలా మంది ప్రయాణికులు చాలా దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తూ ఉంటారు. జనరల్ బోగిలలో కాలు కూడా పెట్టలేనతగా కిక్కిరిసిపోతాయి. అలానే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడి వేల కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ ఉంటారు. కొంచెం స్థలం దొరికితే రైలు తలుపుల దగ్గర కూర్చొని ప్రయాణం చేసిన సందర్భాలు ఉంటాయి.. అలా కూర్చొని సెల్ ఫోన్ చూడడం ,రైలు అప్పుడప్పుడు కుదుపులకు గురికావడంతో ఫుట్ బోర్డు దగ్గర ఉన్నవారు రైలు నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. ఇలా చాలా మంది యువకులు ఫుట్ బోర్డు ప్రయాణం చేసి రైలు నుండి కిందపడి తీవ్ర గాయలై మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి ప్రమాదాల నివారణకు రైల్వే శాఖ మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ఫుడ్ బోర్డు దగ్గర ఎవరు కూర్చొని ప్రయాణాలు చేయకుండా రైల్వే పోలీసులు చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చు.. అయితే రైలు ఫుడ్ బోర్డు ప్రయాణం చేయవద్దు అని ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కొందరు యువకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైల్వే అధికారులు చెప్తున్నారు. ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి రైలులో జనరల్ బోగీల సంఖ్యను ఇప్పుడున్న రెండు నుంచి ఐదుకు పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ఎక్స్‌ప్రెస్ , సూపర్ ఫాస్ట్ రైళ్లలో రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉంటాయి. దేశవ్యాప్తంగా కోట్ల సంఖ్య రైళ్లలో రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారు. వారికి సరిపడా జనరల్ బోగీలు లేక తొక్కిసలాటలు , ఫుట్ బోర్డు ప్రయాణం చేయడం సర్వ సాధారణంగా మారింది. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## వాహనదారులకు గుడ్‌న్యూస్.. ఇకపై ఆర్‌సీ, లైసెన్స్ వెంట పెట్టుకోనక్కర్లేదు..




ట్రాఫిక్ రూల్స్ మారాయ్. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బండి తీసుకుని రోడ్డెక్కితే.. జేబుకు తడిసిమోపెడు అయినట్టే. ఒక డ్రైవింగ్ లైసెన్స్ మాత్రమే కాదు..ఆర్‌సీ, పొల్యూషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్ ఇలా వాహనానికి సంబంధించి అన్ని డాక్యుమెంట్స్ ఉంటేనే కుదురుతుంది. లేదంటే మోటార్ వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలే. ఒకవేళ మీరెప్పుడైనా కంగారుగా ఇంట్లో లైసెన్స్, ఇతర పత్రాలను మర్చిపోయి.. మీ వాహనంతో సహా ట్రాఫిక్ పోలీసులకు తనిఖీల్లో దొరికారంటే..! కచ్చితంగా రూ. 5 వేల వరకు ఫైన్ చెల్లించాల్సిందే. అందుకే డ్రైవింగ్ లైసెన్స్ మోస్ట్ ఇంపార్టెంట్. అయితే మీకు ఇప్పుడొకటి చెప్పనా.? ఈ ఒక్క యాప్ ఉంటే.. లైసెన్స్, ఆర్‌సీ లాంటివి ఏవి కూడా మీ వెంట పెట్టుకోనక్కర్లేదు. ఎందుకంటే.! వాహనానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్‌ను ఒకే చోట పొందేలా పలు యాప్‌లను రూపొందించింది కేంద్ర ప్రభుత్వం. అవే మొబైల్ యాప్‌లు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, పొల్యూషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్ లాంటి డాక్యుమెంట్స్‌ను మీరు ఈయాప్‌లలో అప్‌లోడ్ చేసుకోవచ్చు. దీంతో మీకు అవసరమెనప్పుడల్లా.. ఎప్పుడైనా, ఎక్కడైనా లైసెన్స్, ఆర్‌సీని ఉపయోగించుకోవచ్చు. ఈ రెండు యాప్‌లు దేశవ్యాప్తంగా చెల్లుబాటులో ఉన్నాయ్. దీంతో డైవింగ్ చేసేటప్పుడు మీ దగ్గర అవసరమైన డాక్యుమెంట్స్ హార్డ్ కాపీలు లేకున్నా పర్లేదు. 2018వ సంవత్సరం నుంచి కేంద్ర రోడ్డు రవాణా శాఖ ఈ డిజిలాకర్, యాప్‌లలో అప్‌లోడ్ చేసిన పత్రాలను ఒరిజినల్‌విగా నిర్ధారించాలని చెప్పడం.. మీ దగ్గర ఈ యాప్ ఉన్నా ఇకపై నో ప్రాబ్లం.

## బీఎస్ఎన్ఎల్ యూజర్లకు గుడ్‌న్యూస్.. అదిరిపోయే సరికొత్త రీఛార్జ్ ప్లాన్స్..!

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఒక ప్రభుత్వ భారతీయ టెలికాం కంపెనీ. టెలికాం కంపెనీ తన ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం రెండు కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌లను తీసుకొచ్చింది. టెలికాం కంపెనీ 4% సేవను ప్రారంభించేందుకు కష్టపడుతోంది. అయితే వినియోగదారులను అలరించడానికి, అలాగే వారి నెట్‌వర్క్‌ను విడిచిపెట్టకుండా నిరోధించడానికి కొత్త ఆఫర్‌లు, ప్లాన్‌లను తీసుకువస్తోంది. రెండు కొత్త ప్లాన్‌ల ధర రూ.58, రూ.59. రూ.58 ప్లాన్ డేటా వోచర్ అయితే రూ.59 ప్లాన్ రెగ్యులర్ సర్వీస్ వాలిడిటీతో ప్రీపెయిడ్ ప్లాన్. వాటి ప్రయోజనాల గురించి తెలుసుకుందాం. రూ.58 ప్రీపెయిడ్ ప్లాన్ బీఎస్ఎన్ఎల్ రూ.58 ప్రీపెయిడ్ ప్లాన్ డేటా వోచర్, దాని ప్రయోజనాలను పొందడానికి, వినియోగదారులు యాక్టివ్ ప్లాన్‌ను కలిగి ఉండాలి. రూ.58 ప్లాన్ 7 రోజుల వ్యాలిడిటీ, 2జీబీ రోజువారీ డేటాతో వస్తుంది. అయితే డేటా అయిపోయిన తర్వాత డేటా వేగం 40కి తగ్గుతుంది. రూ.59 ప్రీపెయిడ్ ప్లాన్ బీఎస్ఎన్ఎల్ రూ.59 ప్రీపెయిడ్ ప్లాన్ 7 రోజుల చెల్లుబాటుతో వస్తుంది. ఈ ప్లాన్ రోజుకు 1జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాలింగ్‌తో వస్తుంది. ఈ ప్లాన్‌తో ఎలాంటి ఎస్ఎంఎస్ ప్రయోజనం చేర్చలేదు. ఈ ప్లాన్‌ను ఉపయోగించేందుకు రోజువారీ ఖర్చు రూ.8.43. షార్ట్ టర్మ్ ప్లాన్‌ల కోసం చూస్తున్న కస్టమర్లకు ఇది ఉపయోగపడుతుంది. మీరు ఎక్కువ కాలం చెల్లుబాటుతో ప్లాన్ కోసం చూస్తున్నట్లయితే మీరు బీఎస్ఎన్ఎల్ ఇతర ప్లాన్‌లను చూడవచ్చు. రూ.197 రీఛార్జ్ ప్లాన్ బీఎస్ఎన్ఎల్ రూ.197 ప్లాన్ వాలిడిటీ 70 రోజులు. అంటే, మీరు రూ.197కి 2 నెలల 10 రోజుల చెల్లుబాటును పొందుతారు. దీని ప్రకారం 70 రోజులకు దీని నెలవారీ ఖర్చులు చూస్తే రూ.84 వస్తుంది. ఈ ప్లాన్ రోజువారీ ధర రూ.2 కంటే కొంచెం ఎక్కువ. 30 రోజుల ప్లాన్‌ను పరిశీలిస్తే, ఈ ప్లాన్ ఖరీదు రూ.84. మీరు తక్కువ బడ్జెట్ ప్లాన్‌ల కోసం చూస్తున్నట్లయితే, ఈ ప్లాన్ మీకు ఉపయోగకరంగా ఉంటుంది.

నినాదం

# విశ్వజ



## చుండ్రు సమస్య వేధిస్తోందా? ఇలా ట్రై చేయండి!

### చుండ్రు వదలాలంటే... హెయిర్ కేర్

వేసవిలో చెమట ఎక్కువగా ఉండటం, వాతావరణ కాలుష్యం కారణంగా జుట్టు సమస్యలు వేధిస్తాయి. చెమట, ధూళికారణంగా జుట్టుకి తొందరగా మురికిపడుతుంది. అందువల్ల తరచు తలస్నానం చేయాలి. అలా తలస్నానం చేయకపోవడం వల్ల అంతకుముందు చుండ్రు లేనివారికి చుండ్రు వచ్చే అవకాశం ఉంది. ముందే చుండ్రు ఉన్నవారిని ఆ సమస్య మరింతగా వేధిస్తుంది. చుండ్రు సమస్యను తగ్గించుకునేందుకు కొన్ని చిట్కాలున్నాయి. రెండు టీ స్పూన్‌ల నిమ్మరసాన్ని తీసుకుని ఒక టీస్పూన్ రసాన్ని తలకు (జుట్టు కుదుళ్లకు) పట్టించి పది నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. మరొక టీ స్పూన్‌ల రసంలో కప్పు నీటిని కలిపి తలస్నానం పూర్తయిన తర్వాత తల మీద (స్కాల్ప్‌కు పట్టేలా) పోసుకోవాలి. వారం పాటు తలకు ఆలివ్ ఆయిల్ రాస్తే చుండ్రు వదులుతుంది. రోజూ తలస్నానం చేసే వాళ్లు రాత్రి పడుకునే ముందు ఆలివ్ ఆయిల్ పెట్టి ఉదయం తలస్నానం చేయవచ్చు. లి రెండు టేబుల్ స్పూన్‌ల ల కొబ్బరి నూనెలో అంతే మోతాదు నిమ్మరసం కలిపి తలకు పట్టించి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. మర్దన చేసిన తర్వాత ఇరవై నిమిషాలకు మామూలు షాంపూ లేదా కుంకుడుకాయ రసంతో తలస్నానం చేయాలి. టేబుల్ స్పూన్‌ల మెంతులను రాత్రి నానబెట్టి ఉదయం మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి అందులో నిమ్మరసం (ఒక కాయ) కలిపి తలకు పట్టించాలి. అరగంట తర్వాత తలస్నానం చేయాలి. తలకు మెంతుల పేస్ట్ పెట్టినప్పుడు కొద్దిగా తేమగా ఉండగానే తలస్నానం చేయాలి. పూర్తిగా ఎండి?ోయే వరకు ఉంచితే జుట్టుకు పట్టేసిన మెంతుల పేస్టును వదిలించడం కష్టం. కప్పు పుల్లటి పెరుగులో టీ స్పూన్‌ల నిమ్మరసం కలిపి తలకు పట్టించాలి. ఆరిన తర్వాత తలస్నానం చేయాలి. చుండ్రును వదిలించడంలో వేపాకు కూడా బాగా పని చేస్తుంది. వేపనూనె తలకు పట్టించి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. ఆ తర్వాత తలస్నానం చేయాలి. వేప నూనె లేక?ోతే వేపాకు రసం పట్టించి మర్దన చేయవచ్చు.

## నెయ్యిని తీసుకుంటే బోలెడన్ని లాభాలు!



మనం తినాలనిపించినప్పుడో లేదా ఘుమఘుమలాడే వేడివేడి పప్పులో నెయ్యి వేసుకుంటే ఆ రుచే వేరు. ఏడాది పొడవునా కొందరూ నెయ్యి వేసుకుని తింటుంటారు. అయితే ఆరోగ్య నిపుణులు మాత్రం వేసవిలో కచ్చితంగా ఆహారంలో నెయ్యిని చేర్చుకోవడం మంచిదని చెబుతున్నారు. అసలు ఈ వేసవిలో దాహం దాహం అంటుంది వాతావరణం. అలాంటి ఈ టైంలో నెయ్యి వేసుకంటే అమ్మో దాహమే దాహంగా ఉంటుంది కదా మరీ ఇలా ఎలా చెబుతున్నారు? రీజన్ ఏంటీ తదితరల గురించి సవివరంగా చూద్దాం. శీతాకాలం లేదా వేసవికాలంలో నెయ్యిని తరుచుగా తీసుకుంటాం గానీ వేసవిలోనే దీన్ని ఎక్కువగా తీసకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే..? నెయ్యిలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయి. దీనిలో విటమిన్ ఏ, సీలు కూడా అధికంగా ఉంటాయి. ఇవి కణజాలాలకు పోషణనిస్తాయి. పైగా అవయవాల పనితీరుని మెరుగుపరుస్తుంది. శరీరం వేడిని తగ్గించడంలో నెయ్యికి మించిది మరోకటి లేదు. శరీరంలో ఆరోగ్యకరమైన కొవ్వులు కోసం నెయ్యిని రోజువారి అల్పాహారంలో తీసుకోవడం మంచిది. ఈ ఆరోగ్యకరమై కొవ్వులు శరీరంలో పోషకాలను గ్రహించడానికి ముఖ్యమైన హార్మోన్లను విడుదల చేస్తాయి. నెయ్యిలో మాయిశ్చరైజింగ్ గుణాలు శరీరాన్ని హైడ్రేటింగ్ ఉంచడంలో సహాయపడతాయి. నెయ్యి తీసుకోవడంలో శరీరం మృదువుగా ఉంలేలా లోపలి నుంచి పోషణ ఇస్తుంది. ముఖ్యంగా వేసవిలో శరీరం సులభంగా డీహైడ్రేట్ అయినప్పుడు నెయ్యి తీసుకోవడం వల్ల చర్మం తేమగా, మృదువుగా ఉంటుంది. మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో నెయ్యి కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మనల్ని వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది. అంతేగాదు దీనిలో ఉండే బ్యూట్రిక్ యాసిడ్, స్వల్పకాలిక కొవ్వు ఆమ్లం, రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఆయుర్వేదం ప్రకారం, శరీరం జీర్ణక్రియను మెరుగుపరచడానికి, పోషకాలను గ్రహించడంలో సహాయపడటానికి నెయ్యి ఉత్తమమైన ఆహారాలలో ఒకటిగా చెప్పవచ్చు. నెయ్యి తీసుకోవడం వల్ల శరీరాన్ని చల్లగా ఉంచడమే గాక మనస్సు కూడా ప్రశాంతంగా ఉంటుంది. ఎందుకంటే..? నెయ్యి మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరాన్ని శాంతపరిచే ప్రభావాన్ని అందిస్తుంది. నెయ్యి రుచిలో తీపి, చల్లని స్వభావం కలిగి ఉంటుంది. ఇది హాట్‌గా ఉండే వేసవి కాలంతో శరీరాన్ని చల్లగా ఉంచడంలో నెయ్యి ది బెస్ట్ అని చెప్పొచ్చు.

## వైట్‌హౌస్‌కు ఏఐ టెక్నాలజీని పరిచయం చేసిన భారత సంతతి ఇంజనీర్! ఎవరీమె..?

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ శరవేగంగా విస్తరిస్తోంది. అన్నిరంగాల్లో దీని హవానే నడుస్తుంది అన్నంతగా సరికొత్త టెక్నాలజీతో దూసుకుపోతుంది. అలాంటి టెక్నాలజీని అమెరికా శ్వేతసౌధానికి పరిచయం చేసింది మన భారత సంతి అమెరికన్ ఆరతి ప్రభాకర్. అక్కడ ఆమె కీలకమైన బాధ్యతలు చేపట్టిన తొలి భారతీయ అమెరికన్‌గా కూడా చరిత్ర సృష్టించింది. ఎవరీ ఆరతీ ప్రభాకర్? ఆమె నేపథ్యం ఏంటంటే..ఇంజనీర్ కమ్ సామాజిక కార్యకర్త అయిన ఆరతి ప్రభాకర్ భవిష్యత్తులో ఏఐ హవా గురించి వైట్‌హౌస్‌లో పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషించారు. 2022లో ఆరతిని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వైట్ హౌస్ ఆఫీస్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ(ఓఎస్‌టీపీ) డైరెక్టర్ అండ్ సైన్స్ అడ్వైజర్‌గానూ నియమించారు. దీంతో ఆరతి ఈ అత్యున్నత పదవిలో పనిచేస్తున్న తొలి భారతతి సంతతి అమెరికన్‌గా చరిత్ర సృష్టించింది. ఆమె ఓఎస్‌టీపీ డైరెక్టర్‌గా సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్‌లకు సంబంధించిన విషయాలపై రాష్ట్రపతికి సలహా ఇవ్వడంలో కీలకపాత్ర పోషిస్తుంది. వైట్‌హైస్‌లో అందించే సేవలు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) నియంత్రణకు సంబంధించిన విధానాలను రూపొందించడంలో చురుకుగా పాల్గొంటారు. ఆమె అక్కడ ఏఐ అపార సామార్థ్యాన్ని గుర్తించడమే గాక దాని వల్ల ఎదురయ్యే నష్టాలను సమర్థవంతంగా నిర్వహించవలసిన అవసరాన్ని గురించి నొక్కి చెబుతుంది. ఆమె బైడెన్ పరిపాలనకు సంబంధించిన ఏఐ భద్రత, గోప్యత, వివక్షను పరిష్కరించడానికి ముఖ్యమైన చర్యలు తీసుకుంటుంది. నిజానికి ఆమె ఓవెల్ ఆఫీస్‌లో ల్యాప్‌టాప్‌ని ఉపయోగించి ప్రెసిడెంట్ జో బైడెన్‌కి చాట్‌జిపిటి గురించి వివరించడంతోనే వెట్‌హౌస్‌లో దీని ప్రాముఖ్యత ఉందని గుర్తించారు బైడెన్. ఆ తర్వాత ఆరునెల్లలోనే అధ్యక్షుడు బైడెన్ ఏఐ భద్రత గోప్యత, ఆవిష్కరణలపై దృష్టి సారించేలా కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఈ ఉత్తర్వు ఏఐ కొత్త ప్రమాణాలను ఏర్పాటు చేస్తుంది. ఇది




ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏఐలో అమెరికన్ నాయకత్వాన్ని అభివృద్ధి చేయడం తోపాటు వివక్ష నుంచి రక్షిస్తుంది. ఇక ఆరతి ఈ ఏఐ అభివృద్ధికి సంబంధించిన విషయాల్లో అమెరికా అధ్యక్షుడికి సమగ్ర వ్యూహాలు, సలహాలు అందిస్తుంది. ఆమె నేపథ్యం.. ఢిల్లీలో పుట్టిన ఆరతి.. మూడేళ్ల ప్రాయంలో ఉండగానే ఆమె కుటుంబం అమెరికాకు వెళ్లింది. టెక్సాస్‌లోని లుబ్బాక్‌లో పెరిగారు. ఆమె ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పట్టా పొందారు. ఆ తర్వాత అప్లైడ్ భౌతిక శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. దీంతో 1984లో కాలిఫోర్నియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి అప్లైడ్ భౌతిక శాస్త్రంలో పీహెచ్‌డీ చేసిన తొలి మహిళగా ఆరతి చరిత్ర సృష్టించింది. ఆమె డాక్టరల్ అధ్యయనాల తదనంతరం వాషింగ్టన్ డీసీలో కాంగ్రెస్ ఫెలోషిప్‌ను పూర్తి చేసింది.

## ఎండలో తిరిగొచ్చి వెంటనే చన్నీళ్ళస్నానం చేస్తున్నారా.. అయితే మీరు డేంజర్‌లో పడ్డట్టే



తెలుగు రాష్ట్రాలలో ఎండలు మండుతున్నాయి. ఉగ్ర భానుడి దెబ్బకు జనాలు విలవిలలాడుతున్నారు. వేసవి తాపాన్ని తట్టుకోలేక అల్లాడి పోతున్నారు. చల్లదనం కోసం తెగ పరుగులు పెడుతున్నారు. కొందరైతే ఇళ్లలో ఏసీ రూముల నుంచి బయటకు కూడా రావడం లేదు. ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాలలోనూ అనేక ప్రాంతాలలో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు, వడగాలులు వేస్తున్నాయి. దీంతో అనేక జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు వాతావరణ శాఖ అధికారులు. ఎండలో తిరిగొచ్చి వెంటనే చన్నీళ్ళ స్నానం చేస్తున్నారా? వైద్యులు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇక ఇదే సమయంలో మండుతున్న ఎండలలో బయట తిరిగి వచ్చిన తర్వాత చల్లటి నీళ్లతో స్నానం చేస్తే హాయిగా ఉంటుందని భావించి, చన్నీళ్ల స్నానం చేసేవారికి ఇది ఏమాత్రం మంచిది కాదని చెబుతున్నారు. ఇప్పటికే ఎండలో తిరిగి వచ్చిన తర్వాత వెంటనే చల్లటి నీళ్లు తాగకూడదు అన్న విషయాన్ని మనం తెలుసుకున్నాం. లోక్సభ ఎన్నికలు 2024 నియోజకవర్గాలు ఎ అభ్యర్థులు ఎ ఎన్నికల తేదీలు కడప జిల్లాలో పుట్టి అదే కడపకు ద్రోహం చేసిన జగన్, బెంగళూరు నుంచి రావాలంటే ఎలా ? ఎండలో తిరిగొచ్చి వెంటనే చల్లని నీళ్ళు తాగినా, స్నానం చేసినా మంచిది కాదు విపరీతమైన ఎండలో తిరిగి వచ్చిన తర్వాత చల్లటి నీళ్లు తాగితే రక్తనాళాలు చిట్లిపోయే ప్రమాదం ఉంటుందని, మన శరీరం పైన దుష్ప్రభావాన్ని చూపిస్తుందని, ఒక్కొక్కసారి ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం కూడా ఉందని తెలుసుకున్నాం. ఇక ప్రస్తుతం మంచి ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత వెంటనే స్నానం చేయడం మంచిదేనా? అన్న విషయం గురించి తెలుసుకుంటున్నాం. బయట నుండి వచ్చిన వెంటనే కాసేపు ఆగాలి ఎందుకంటే విపరీతమైన ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత వెంటనే చన్నీళ్ల స్నానం చేయడం గాని, చన్నీళ్లతో కాళ్లు కడుక్కోవడం కానీ ఏమాత్రం మంచిది కాదు అని చెబుతున్నారు వైద్యులు. ఎప్పుడైనా ఎండలో బయట తిరిగి వచ్చిన తర్వాత శరీర ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుంది. మళ్లీ శరీర ఉష్ణోగ్రతను గది ఉష్ణోగ్రత లోకి తీసుకు వచ్చిన తర్వాత మాత్రమే స్నానం చేయాలి. చన్నీళ్ళతో స్నానం చేస్తే డేంజర్ బాగా మండుటెండల్లో తిరిగివచ్చి, వచ్చి రావడంతోనే చల్లటి నీళ్లతో స్నానం చేస్తే ఒక్కోసారి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మండుటెండల్లో తిరిగి వచ్చిన తర్వాత చన్నీళ్ళతో స్నానం చేయడం బ్రెయిన్ స్ట్రోక్ కు కూడా కారణం కావచ్చని చెబుతున్నారు. అంతేకాదు బయట తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత వెంటనే చల్లటి నీళ్ళతో కాళ్ళు కూడా కడుక్కోకూడదు. ఈ విషయాలను ప్రతి ఒక్కరు తెలుసుకొని తదనుగుణంగా వడదెబ్బ తగలకుండా, ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

## ఆ వ్యాధులకు దివ్యౌషధం మామిడికాయ



మామిడి పండు అంటే పండ్లలో రారాజు. దాన్ని ఇష్టపడనివారంటూ ఎవరూ ఉండరు. కేవలం వేసవికాలంలోనే లభ్యమవుతుంది. దీని రుచికి సాటివచ్చే పండే ఉండదు. పచ్చి మామిడికాయలో అనేక ఔషధ గుణాలున్నాయి. ఆరోగ్యానికి పచ్చి మామిడి ఎంతో మేలు చేస్తుంది. విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ ఇ, కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్, జింక్, ఫైబర్, పొటాషియం, కాపర్, సోడియం వంటి పోషకాలుంటాయి. అనేకరకాల వ్యాధులను ఇది దూరం చేస్తుంది. పచ్చి మామిడిలో ఉండే విటమిన్ సి వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కడుపునకు కూడా చాలా మేలు చేస్తుంది. మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది. కడుపులో ఎసిడిటీ సమస్య నుండి ఉపశమనం కలుగుతుంది. కంటికి ఎంతో మేలు చేస్తుంది. ఎముకలు దృఢంగా అవుతాయి. కాల్షియం పుష్కలంగా లభిస్తుంది. పచ్చిమామిడిని ప్రతిరోజు తీసుకుంటుంటే ఎముకలకు సంబంధించిన సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. వడదెబ్బ నుంచి రక్షిస్తుంది. పచ్చి మామిడి పన్నాను వినియోగిస్తే వడదెబ్బ తగలదు. దీన్ని పచ్చడిగా చేసుకొని తినొచ్చు. క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. డీహైడ్రేట్ అవకుండా చేస్తుంది. పచ్చి మామిడికాయ పన్నా, చట్నీ, జామ, ఊరగాయ, యాలకులపొడి, జామ, మామిడి పప్పు, కూరగాయ చేసి కూడా తినొచ్చు. అధికంగా తీసుకోవడం వల్ల అపానవాయువు లేదా కడుపు తిమ్మిరి ఏర్పడుతుంది. దీన్ని గుర్తుంచుకొని మితంగా తీసుకోవాలి.

## అవగాహనే ప్రథమ చికిత్స!



ఈ ఫొటోను చూడండి. ఇందులో ఉన్నది షుగర్ పేషెంట్లు. ఒకరితో ఒకరు షుగర్ వ్యాధి గురించి మాట్లాడుకుంటూ అవగాహన కల్పించు కుంటు న్నారు. 'చికిత్స కంటే అవగాహన ముఖ్యం' అంటారు ప్రియా దేశాయ్. బెంగళూరులో ఆమె పేదవారి కోసం ఉచిత క్లినిక్‌లు నడుపుతున్నారు. దయాబెటిస్, బి.పి ఉన్న వారికి సదస్సులు నిర్వహిస్తూ ఉచిత మందులు అందేలా చూస్తున్నారు. ప్రతి ఉదయం ఈ క్లినిక్‌ల ముందు క్యూ కట్టే పేషెంట్లను చూస్తే ప్రియా సేవ తెలుస్తుంది. బెంగళూరులోని శాంతి నగర్‌లో ఉన్న 'అనాహత్' క్లినిక్‌కు వెళితే ఒక బోర్డు మీద ఐదారు రకాల భోజనం ప్లేట్ల ఫొటోలు ఉంటాయి. వాటిలో రొట్టె, కూర, అన్నం, ఇతర కూరలు ఉంటాయి. ప్రతి ప్లేట్ కింద స్టార్లు ఇచ్చి ఉంటారు. ఐదు స్టార్లు ఇచ్చిన భోజనం ప్లేట్‌ను ఆహారంగా తీసుకోవాలని బీపీ, షుగర్ ఉన్న పేషెంట్లకు సులభంగా అర్థమయ్యేలా చె?రు. మీ ప్లేట్‌లో ఏముంది అనేదే మీ ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందని ఈ క్లినిక్‌లో వారానికి రెండుసార్లు జరిగే అవగాహన సదస్సుల్లో తెలియచేస్తారు. ఇలాంటి అవగాహన దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీల తీవ్రతను తగ్గిస్తాయని అంటారు ప్రియా దేశాయ్. ఆమె ఈ క్లినిక్ నిర్వాహకురాలు. 10 వేల మందికి ఒక క్లినిక్.. బెంగళూరు జనాభా కోటీ ముప్పై లక్షలకి పైనే. కాని ఇక్కడ మొత్తం 147 ?థమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రే ఉన్నాయి. అంటే దాదాపు 80 వేల మందికి ఒక క్లినిక్. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా 30 వేల మందికి ఒక క్లినిక్ ఉండాలి. ఆదర్శవంతమైన ?లనా నిర్వహణ అంటే 10 వేల మందికి ఒక క్లినిక్. ఇలాంటి స్థితిలో పేదలకు ఎలా మంచి వైద్యం అందుతుంది అని అడుగుతారు ప్రియా దేశాయ్. జర్నలిజం అభ్యసించిన ప్రియ తన తల్లి రాణీదేశాయ్ స్ఫూర్తితో వైద్య సేవారంగంలోకి వచ్చారు. అనేక స్వచ్ఛంద సంస్థల్లో పని చేసిన రాణీ దేశాయ్ తన కుమార్తెతో కలిసి 'అనాహత్ క్లినిక్'కు అంకురార్పణ చేశారు. బెంగళూరులో ఉన్న పేదలకు వైద్యం అందించాలనేది అనాహత్ సంకల్పం. నేరుగా క్లినిక్‌కు వచ్చేవారికి వైద్యం అందిస్తూనే హెల్త్ క్యాంప్స్ ద్వారా స్లమ్స్‌లో వైద్య చికిత్స అందించడం అనాహత్ లక్ష్యం. ఇప్పటికి 3 లక్షల మందికి హెల్త్ క్యాంప్స్ ద్వారా వైద్యం అందించారు ప్రియ తన తల్లి రాణీదేశాయ్ చేయూతతో. బీపీ, షుగర్ బాధితులు.. 'నగరాల్లో పని చేసే దిగువ ఆదాయ వర్గాల వారు సమయానికి భోజనం చేయరు. ఆహార అలవాట్లు, నిద్రలో క్రమశిక్షణ ఉండదు. శరీరాన్ని పట్టించుకోరు. దానివల్ల బీపీ బారిన పడుతున్నారు. షుగర్ వచ్చిన వారికి షుగర్ వచ్చిన సంగతి కూడా తెలియడం లేదు. మా క్లినిక్‌కు రోజుకు వంద మంది వస్తారు. ఎక్కువ మందికి ఇవే సమస్యలు. మా కౌన్సిలింగ్స్ వల్ల ఎక్కడ ఏ పనిలో ఉన్నా రాత్రి ఎనిమిదికి భోజనం చేయడం నేర్చుకున్నారు చాలామంది' అంటారు ప్రియా దేశాయ్. మిత్రుల దాతల సహాయంతో ఈ క్లినిక్‌ను నడుపుతున్న ప్రియ తగిన సహాయం దొరికితే సేవను విస్తరించవచ్చు అని తపన ప[illegible]రు. 70 రకాల పరీక్షలు.. అనాహత్ క్లినిక్‌లో 70 రకాల టెస్ట్‌లు ఉచితంగా చేస్తారు. 100 రకాల మందులు ఉచితంగా ఇస్తారు. వైద్యుల పరీక్ష ఉంటుంది. వీరే కాకుండా ఫిజియోథెరపిస్ట్‌లూ సేవలు అందిస్తారు. 'ఆనంద' అనే కార్యక్రమం ద్వారా సైకియాట్రీ కౌన్సెలింగ్ కూడా ఉంటుంది. 'అన్నింటికంటే ముఖ్యం మేము పేషెంట్స్‌ను ఒక కమ్యూనిటీగా మారుస్తాం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని ఒక గ్రూప్‌గా చేసి వారే ఒకరితో మరొకరు మాట్లాడుకుని తామంతా ఈ వ్యాధులను ఎదిరించవచ్చు అనే ధైర్యం పొందేలా చేస్తాం' అన్నారు ప్రియ. చికిత్స అందించడం ఎంత ముఖ్యమో వ్యాధి పట్ల అవగాహన, నివారణ అంతే ముఖ్యమని భావిస్తారు ఈ క్లినిక్‌లో. అందుకే బెంగళూరు పేదలు అనాహత్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. ప్రియను, ఆమె తల్లి రాణి దేశాయ్‌ను అభిమానిస్తున్నారు. 'స్లమ్స్‌లో ఉన్నవారు క్లినిక్స్‌కు రారు. స్లమ్స్‌లో హెల్త్ క్యాంప్స్ విస్తృతంగా... క్రమబద్ధంగా జరగాలి. అప్పుడే దీర్ఘకాలిక వ్యాధులు బయటపడి చికిత్స మొదలవుతుంది. లేకుంటే అనవసర మరణాలు కొనసాగుతూనే ఉంటాయి. అందుకే అందరూ ఈ విషయమై ముందుకు రావాలి' అని కోరుతున్నారు ప్రియ.

# సింపుల్ వాక్.. కట్టిపడేస్తున్న జాన్వీ కపూర్!

## తాజాగా మరో ఈవెంట్ లో పాల్గొని..







ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ... దివంగత నటీమణి , అందాల తార శ్రీదేవి ప్రముఖ బాలీవుడ్ నిర్మాత బోనీకపూర్ వారసురాలు జాన్వీ కపూర్ గురించి పరిచయాల ప్రత్యేకంగా అవసరం లేదు. అందం అభినయంతో గ్లామర్ ఒలకబోస్తూ ప్రేక్షక లోకాన్ని ఫిదా చేస్తున్న ఈ అమ్మడు తల్లి తర్వాత అంతటి రేంజ్ దక్కించుకోవడానికి తెగ ప్రయత్నాలు చేస్తోంది. బాలీవుడ్ లోనే సినిమాలు చేయకుండా తన టాలెంట్ ను తన క్రేజ్ ను దేశవ్యాప్తంగా విస్తరించడానికి ఇప్పుడు సౌత్ సినిమాలలో కూడా అవకాశాలు అందుకుంటూ బిజీగా మారింది. అంతేకాదు ఫ్యాషన్ వీక్ లలో కూడా సందడి చేస్తున్న ఈమె.. తాజాగా మరో ఈవెంట్ లో పాల్గొని..తన డ్రెస్సింగ్ స్టైల్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ.

అసలు విషయంలోకి వెళ్తే.. ఇటీవల జరిగిన ఫెంటీ ఈవెంట్ లో జాన్వీ కపూర్ మైక్రో మినీ డ్రెస్ లో కనిపించే సందడి చేసింది. తన బోల్డ్ డ్రెస్సింగ్ స్టైల్ తో గ్లామర్ ను ఒలకబోసింది. అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్ కి పేరు గాంచిన ఈ ముద్దుగుమ్మ.. తరచుగా తన స్టైల్ తో అందరి దృష్టిని ఆకర్షిస్తూ.. ఇప్పుడు ఈ ఈవెంట్లో హీట్ కూడా పెంచేసింది. ఇక జాన్వీ కపూర్ ధరించిన డ్రెస్ విషయానికి వస్తే.. మెత్తటి కౌల్ నెక్ లైన్ తో కూడిన హాఫ్ షోల్డర్, డ్రేప్డ్ వైట్ టాప్ ను ధరించింది. అసమానమైన సిల్హౌట్ ఒక ఆధునిక శిల్పకళాత్మకమైన రూపాన్ని జోడించింది అనడంలో సందేహం లేదు. శాటిన్ లాంటి ఫ్యాబ్రిక్ చూపరులకు విలాసవంతమైన అనుభూతిని అందిస్తోంది. మొత్తానికి అయితే ఈమె ఈ ఈవెంట్లో తన డ్రెస్సింగ్ స్టైల్ తోనే కాదు సింపుల్ వాక్ తో అందరి హృదయాలను దోచుకుంది. మొత్తానికి అయితే జాన్వి కపూర్ లేటెస్ట్ ఔట్ ఫిట్ అందరిని ఆకట్టుకుంది అనడంలో సందేహం లేదు.

జాన్వీ కపూర్ విషయానికి వస్తే.. 2018లో ధడక్ అనే సినిమా ద్వారా సినీ రంగంలోకి అడుగు పెట్టింది. ఘోస్ట్ స్టోరీస్ సినిమాతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్న జాన్వి కపూర్ 2024 వరకు హిందీలోనే సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తన తల్లి కోరిక మేరకు జూనియర్ ఎన్టీఆర్ తో తన తొలి తెలుగు సినిమా చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర మొదటి భాగంలో నటించి పల్లెటూరి అమ్మాయి పాత్రలో అందరి దృష్టిని ఆకట్టుకుంది. హోమ్ బౌండ్ సినిమాతో మరోసారి ఆకట్టుకున్న ఈమె.. పరమ్ సుందరి , సన్నీ సంస్కారీకి తులసీ కుమారి ఇలా పలు చిత్రాలలో నటించిన జాన్వి కపూర్ ప్రస్తుతం రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న పెద్ది సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది.. ఇందులో అచ్చియమ్మ అనే పాత్ర పోషిస్తుంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఈ సినిమాను జూన్ నెలలో విడుదల చేయబోతున్నారు.

# గ్లామర్ షోతో కవ్వించడంలో ప్రగ్య తర్వాతే

**టాలీవుడ్ ట్యాలెంటెడ్ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ తనదైన అందం గ్లామర్ షోతో కుర్రకారును కవ్వించడంలో ఎప్పుడూ ముందుంటుంది.**



టాలీవుడ్ ట్యాలెంటెడ్ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ తనదైన అందం- గ్లామర్ షోతో కుర్రకారును కవ్వించడంలో ఎప్పుడూ ముందుంటుంది. -కంచె- సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ సుందరి..ఆ తర్వాత బాలకృష్ణ సరసన -అఖండ- వంటి భారీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. అయినా ఆశించిన స్థాయిలో అవకాశాలను దక్కించుకోవడంలో ప్రగ్య తడబడుతోంది. అయితే సోషల్ మీడియా వేదికగా తన గ్లామర్ పవర్ చూపిస్తూ ఫాలోయింగ్‌ను నిలబెట్టుకోవడంలో ప్రగ్యా తర్వాతే ఎవరైనా అనిపించుకుంటోంది.

తాజాగా ప్రగ్యా జైస్వాల్ ఇన్‌స్టాలో షేర్ చేసిన ఒక రీల్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. బ్లాక్ కలర్ హాఫ్ షోల్డర్ ఫ్రాక్ ధరించి ఈ బ్యూటీ ఇచ్చిన స్ట్రైకింగ్ ఫోజులు నెటిజన్ల మైండ్ బ్లాక్ చేస్తున్నాయి. ఈ డ్రెస్సులో ప్రగ్యా తన పర్ఫెక్ట్ బాడీ కర్వ్‌లను ప్రదర్శిస్తూ.. కెమెరా ముందు కిల్లింగ్ లుక్స్‌తో సెగలు పుట్టిస్తోంది. కేవలం అందం మాత్రమే కాకుండా ప్రగ్య క్యారీ చేసిన స్టైల్, ఫ్యాషన్ సెన్స్ ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.



ప్రస్తుతం ప్రగ్యాకు టాలీవుడ్‌లో కొత్త అవకాశాలు కొంతమేర తగ్గాయి. టాలీవుడ్ తర్వాత బాలీవుడ్‌లో పాగా వేయాలని ఈ బ్యూటీ గట్టిగానే కలలు కంది. హిందీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా ఎదగాలని ప్రయత్నాలు చేసినా.. అక్కడ కూడా తనకు ఆశించిన స్థాయిలో బ్రేక్ లభించలేదు. దీంతో కొంత నిరాశ చెందిన ప్రగ్య ఒక సెలబ్రిటీగా తనకున్న గుర్తింపును కాపాడుకుంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. సినిమాలు తక్కువగా ఉన్నా.. ప్రగ్యా జైస్వాల్ తన పాపులారిటీని క్యాష్ చేసుకుంటోంది. ప్రముఖ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. అప్పుడప్పుడు టీవీ ప్రకటనల్లో కనిపిస్తూ మంచిగానే ఆర్జిస్తోంది. గ్లామర్ ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే కేవలం సినిమాలే కాదు... నిరంతరం వార్తల్లో ఉండటం కూడా ముఖ్యమని గ్రహించిన ఈ బ్యూటీ సోషల్ మీడియా వేదికగా ఫ్యాషన్ ప్రియులను అలరిస్తోంది. డ్రగ్స్ కేసు నుంచి ఇద్దరు టాప్ హీరోయిన్లు గ్రేట్ ఎస్కేప్! సోషల్ మీడియాలో తనకు ఉన్న ఫాలోయింగ్ తగ్గకుండా ప్రగ్యా ఎంతో జాగ్రత్త పడుతోంది. ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫోటోషూట్స్, ఫిట్‌నెస్ వీడియోలు

ఇప్పుడు వైరల్ అవుతున్న ఈ బ్లాక్ డ్రెస్ ఫోటోలు చూస్తుంటే..త్వరలోనే ఏదో ఒక భారీ ప్రాజెక్టుతో మళ్ళీ వెండితెరపై మెరుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

# స్టైలిష్ లుక్ లో తమన్నా.. ఇలా ఎప్పుడైనా చూశారా

**బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న తమన్నా భాటియా మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారారు.**



బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న తమన్నా భాటియా మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారారు. షూటింగ్స్ తో బిజీగా ఉన్నప్పటికీ, అభిమానులతో టచ్ లో ఉండేందుకు ఆమె ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ఫోటోలు, అభిప్రాయాలు పంచుకుంటూ వస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు, పోస్ట్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల జరిగిన అత్యంత ప్రభావవంతమైన యువ భారతీయులు 2026 అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా, ఆ ఎక్స్పీరియన్స్ ను అభిమానులతో పంచుకున్నారు. ఆ సందర్భంగా ఆమె రాసుకొచ్చిన ఎమోషనల్ కామెంట్స్ అందరి దృష్టి ఆకర్షిస్తున్నాయి. ఆ ఈవెంట్ లో ఉన్న ఎన్విరాన్మెంట్, సహచరుల మధ్య ఉన్న అనుబంధం తనకు ఎంతో ప్రత్యేకంగా అనిపించిందని పేర్కొంది. దీపావళికి హాట్ హాట్ అప్‌డేట్! 'ఆ రాత్రి ఇప్పటికీ నా మనసులో ఉంది. అందరూ ఒకరికి ఒకరు సపోర్ట్ చేస్తూ, నిజమైన ఆనందాన్ని పంచుకున్నారు. విభిన్న రంగాల్లో ఉన్న వ్యక్తుల ప్రయాణాలను చూసి గర్వంగా అనిపించింది' అని ఆమె తన పోస్ట్ లో తెలిపారు. సహచరులు ఒకరిని ఒకరు అభినందించుకోవడం, ఎంకరేజ్ చేసుకోవడం వంటి అంశాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని వెల్లడించారు తమన్నా. అలాగే ఆ రోజు తాను ఎలా రెడీ అయ్యారో అమ్మడు వివరించారు. సాధారణంగా తొందరపడే తనకు, ఈసారి మాత్రం ప్రతి అంశాన్ని ఆస్వాదిస్తూ నెమ్మదిగా రెడీ అయ్యానని చెప్పింది.



డ్రెస్సింగ్ నుంచి స్టైలింగ్ వరకు ప్రతి చిన్న విషయానికీ ఇంపార్టెన్స్ ఇచ్చినట్లు వెల్లడించింది. ఆ ప్రాసెస్ ను ఎంతో ఎంజాయ్ చేశానని తెలిపింది. ఆ ఈవెంట్ లో తమన్నా ధరించిన డ్రెస్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

బ్లూ కలర్ లో క్రేజీ చెక్స్ డిజైన్ తో ఉన్న ఆ అవుట్ ఫిట్ లో ఆమె చాలా స్టైలిష్ గా కనిపించింది. కేప్ తో కూడిన ఆ లుక్ లో పవర్, ప్లేఫుల్ నెస్ రెండూ కలిసినట్లు అనిపించిందని ఆమె పేర్కొంది. తన పర్సనాలిటీ రిఫ్లెక్ట్ చేసేలా ఆ లుక్ ఉండటం మరింత ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు తమన్నా. 'ఆ రోజు పూర్తిగా ఆనందంతో నిండిపోయింది. అలాంటి రోజులు తొందరగా ముగించకుండా ఆస్వాదించాలి. నిజమైన సెలబ్రేషన్ అంటే మనుషులతో కలిసి పంచుకునే ఆనందం' అంటూ తన భావాలను వ్యక్తం చేసింది. ఆ అనుభవం తనకు ఎంతో ప్రత్యేకమని, జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకంగా మిగిలిపోతుందని చెప్పింది. తమన్నా పోస్ట్ కు ఫ్యాన్స్ నుంచి సూపర్ వస్తోంది. ఆమె స్టైల్, ఆలోచనలు, క్యాప్షన్ ను ప్రశంసిస్తూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఆమె అవుట్ ఫిట్, ఫోటో షూట్ పై ప్రశంసల వర్షం కురుస్తోంది. సోషల్ మీడియాలో ఆమె ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇలా సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటూ అభిమానులతో పంచుకుంటూ తమన్నా మరోసారి అందరి మనసులు గెలుచుకున్నారని చెప్పాలి.

# బుచ్చిబాబు స్ట్రాటజీకి చరణ్ డెడికేషన్ తోడైతే..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్ లో రూపొందుతున్న పెద్ది చిత్రంపై అనౌన్స్మెంట్ నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్ లో రూపొందుతున్న పెద్ది చిత్రంపై అనౌన్స్మెంట్ నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు ఆ ప్రాజెక్టు గురించి ఇండస్ట్రీలో వినిపిస్తున్న మాట ఒకటే.. 'బుచ్చిబాబు స్ట్రాటజీకి చరణ్ డెడికేషన్ తోడైతే బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ అవ్వడం ఖాయం' అన్నదే. నిజానికి ఉప్పెనతోనే వంద కోట్ల క్లబ్ లో చేరిన బుచ్చిబాబుకు ఇది రెండో చిత్రం. రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోతో అవకాశం రావడం విశేషం. ఆ అవకాశాన్ని యూజ్ చేసుకోవాలనే లక్ష్యంతో దర్శకుడు ఎంతో జాగ్రత్తగా ముందుకెళ్తున్నట్లు సమాచారం. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలు కొన్నేళ్ల పాటు నిర్మాణ దశలో ఉండటం చూస్తుంటాం. అయితే పెద్ది మాత్రం దాదాపు ఏడాది కాలంలోనే షూటింగ్ పూర్తి దశకు చేరుకోవడం విశేషం. చిత్రీకరణ లాస్ట్ లో ఉన్నప్పటికీ, క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగిస్తున్నారు. రెండు సార్లు విడుదల వాయిదా పడినా, సినిమాపై ఎలాంటి నెగిటివ్ టాక్ రాకుండా దర్శకుడు ప్లానింగ్ మాత్రం సూపర్. ఈ క్రమంలో ఆయన స్ట్రాటజీ క్లియర్ గా కనిపిస్తోంది. ఇక రామ్ చరణ్ విషయానికి వస్తే, గత చిత్రం గేమ్ ఛేంజర్ నిరాశపరిచిన నేపథ్యంలో పెద్దితో గట్టి కమ్ బ్యాక్ ఇవ్వాలనే ప్లాన్ తో ఉన్నారు. అందుకే ఆయన కంప్లీట్ డెడికేషన్ తో పని చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త లుక్, విభిన్న గెటప్ తో ప్రేక్షకుల ముందుకు రావడానికి కష్టపడుతున్నారు. అంతేకాకుండా, ఇతర ప్రాజెక్టులను పక్కనపెట్టి పెద్దిపైనే దృష్టి పెట్టడం ఆయన డెడికేషన్ ను చూపిస్తోంది. 1980ల నాటి ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే రా అండ్ రస్టిక్ పీరియడ్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న పెద్దిలో రామ్ చరణ్ పహిల్వాన్ పాత్రలో కనిపించనుండగా, ఆయన సరసన జాన్వీ కపూర్ అచియమ్మగా నటిస్తున్నారు. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. గ్రామీణ క్రీడ కుస్తీ చుట్టూ తిరిగే కథలో ఎమోషన్స్, విలేజ్ పాలిటిక్స్ ప్రధానంగా ఉండనున్నాయి. రామ్ చరణ్ తన పాత్ర కోసం ఉత్తరాంధ్ర యాసను ప్రత్యేకంగా నేర్చుకోవడం విశేషం. సుమారు రూ.400 కోట్ల భారీ బడ్జెట్ తో వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్నాయి. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం, ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ చిత్రానికి మెయిన్ అసెట్స్. మొదట ఏప్రిల్ 30న విడుదల చేయాలని భావించిన ఆ చిత్రం, షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా వాయిదా పడింది. ఇప్పుడు జూన్ 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. మొత్తానికి, బుచ్చిబాబు స్ట్రాటజీకి రామ్ చరణ్ డెడికేషన్ కలిసొస్తే పెద్ది బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించే అవకాశాలు ఫుల్ గా ఉన్నాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787